

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-1-2026 బుధవారం సంపుటి: 31 సంచిక: 337 పేజీలు: 10+4 వెల: 6.50


'సిందూర్' నిలిపివేతకు పాక్ లాబీయింగ్

నేపాల్‌లో మత ఘర్షణలు

భారత్ సరిహద్దులు మూసివేత

5

## సోనియాకు అస్వస్థత

### ఆస్పత్రికి తరలింపు

### ఆందోళన అనవసరం

### వైద్యుల ప్రకటన



**న్యూఢిల్లీ, జనవరి 6:** కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ మరోసారి అనారోగ్యానికి గురయ్యారు. తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ సమస్యలతో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశాయి. సీనియర్ పల్మోనాలజిస్ట్ (ఊపిరితిత్తుల నిపుణుడు) >>2



## 31న పార్లమెంటు: ఫిబ్రవరి 1న బడ్జెట్

### పార్లమెంటు వ్యవహారాల కమిటీదే తుదినిర్ణయం: రిజిజు

### ఆదివారం కావడంతో సందిగ్ధత

**న్యూఢిల్లీ, జనవరి 6:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న 2026 కేంద్ర బడ్జెట్ తేదీ ఆదివారం రావడంతో ఇపుడు ఆరోజు ఎలా ప్రవేశపెడతారన్న చర్చ రసవత్తరంగా కొనసాగుతోంది. 2017 నుంచి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయంగా వస్తోంది. అయితే 2026లో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీ మారుతుందా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టవచ్చని కొన్ని ఊహాగానాలు లేచాయి. బడ్జెట్‌ను వారాంతంలో ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇలాంటి సందర్భాలు >>2

## 18న దావోస్‌కు సిఎం రేవంత్

### పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కూడా..

### 23 వరకు ముఖ్యమంత్రి బృందం పర్యటన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి6:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఈనెల 18న దావోస్‌కు వెళ్లనున్నారు. అక్కడ ఈనెల 19 నుంచి 23 వరకు జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో పాల్గొంటారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో చర్చలు చేయనున్నారు. దావోస్ పర్యటనకు ఒక రోజు ముందు రోజే బయలు దేరనున్నారు. వీరి వెంట రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం కూడా ఉండనుంది. ఇటీవల ఇక్కడ ఫ్యూచర్ సిటీలో రూ.5లక్షల 75వేల కోట్ల ఒప్పందాలు చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం దావోస్‌లో కూడా మరిన్ని ఒప్పందాలు చేసుకునేందుకు ప్రయత్నాలు చేయనుంది.

## కవిత రాజీనామా ఆమోదం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి6:** నిజామాబాద్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామాను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదించారు. రాజీనామా ఆమోదంపై మంగళవారం రాత్రి పొద్దుపోయాక లెజిస్లేటివ్ సెక్రటరీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆమె రాజీనామాతో శాసనమండలిలో ఒక స్థానం ఖాళీ అయిన విషయాన్ని ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తూ నోటిఫికేషన్ కాపీని పంపించారు. కల్వకుంట్ల కవిత 2021లో నిజామాబాద్ స్థానిక సంస్థల స్థానం నుంచి శాసనమండలి సభ్యురాలిగా ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ పార్టీకి,ఎమ్మెల్సీ పదవికి సెప్టెంబర్ 3న రాజీనామా చేసిన కల్వకుంట్ల కవిత సోమవారం శాసనమండలిలో ప్రసంగించి తన రాజీనామాను ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సభలో కన్నీరు పెట్టుకున్నారు. గత కొంతకాలంగా బిఆర్ఎస్ వర్కింగ్ >>2



## మండలాలు, రెవెన్యూ డివిజన్ల పునర్విభజన!

### అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం


### మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 6:** తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పాలకుల హయాంలో రాజకీయ ప్రయోజనాలు, అదృష్ట సంఖ్యల ఆధారంగా మండలాలు, డివిజన్ల ఏర్పాటు జరిగిందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాసనసభలో చెప్పారు. గత పాలకుల హయాంలో జరిగిన అశాస్త్రీయ విభజనపై చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి అసెంబ్లీలో >>2

## తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 'క్యూర్, ప్యూర్, రేర్'

### 2047కు 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగడమే లక్ష్యం

### రాష్ట్రంలో ప్రతి ఒక్కరిని అభివృద్ధి బాట పట్టించడమే ధ్యేయం



### మహిళా సంఘాలను కార్పొరేట్ సంస్థలుగా తీర్చిదిద్దుతున్నాం..

### సంపన్న రాష్ట్రం కోసం ముందుకే..

### ఆరోగ్యంపై వ్యయం జిఎస్‌డిపిలో 8% పెంచడానికి కట్టుబడి ఉన్నాం

### తెలంగాణ రైజింగ్ 2047పై అసెంబ్లీలో డిప్యూటీ సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి6:** తెలంగాణ రైజింగ్ 2047 కేవలం ప్రభుత్వ నివేదిక కాదు, రాజకీయ ప్రణాళికా పేపర్ అంతకన్నా కాదు అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు ఇది మన పిల్లల భవిష్యత్తుకు ఒక దిశా నిర్దేశం(విజన్ డాక్యుమెంట్), దీని పేరు తెలంగాణ రైజింగ్ 2047. గత కొన్ని వారాలుగా, పెట్టుబడిదారుల సదస్సులలో, ప్రణాళికా బోర్డులలో ఈ విజన్ డాక్యుమెంట్ గురించి మాట్లాడే అవకాశం తనకు లభించింది అని భట్టి విక్రమార్క వివరించారు. ఆర్థికశాస్త్ర విద్యార్థిగా తాను ఉత్పాదకత అంతరం గురించి మాట్లాడాను. ప్రపంచ సమాజానికి ఆతిథ్యమిచ్చే వ్యక్తిగా మన "తెలంగాణ ఆతిథ్యం" గురించి తాను మాట్లాడాను అని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047పై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. 1991 నుండి ప్రతి దశాబ్దంలో మనప్రాంతం స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జిఎస్‌డిపి) రెట్టింపు అయింది. ఈ రోజు మనం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్నాము. కానీ తనను వెంటాడుతున్న, ఈ సభలోని >>2

అసెంబ్లీ నిరవధిక వాయిదా 2



## రా.. వచ్చి పట్టుకో, నీకోసం ఎదురుచూస్తా

### ట్రంప్‌కు గుస్తావో పెట్రో సవాల్

### అమెరికా దాడి చేస్తే ఆయుధాలు చేపడతాం

### కొలంబియా అధ్యక్షుడు గట్టి హెచ్చరికలు

5

## గ్రీన్‌ల్యాండ్ ఆక్రమణ నాటో అంతమే!

### అయినా ఆ అధికారం అమెరికాకు లేదు: డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్‌సన్



5

## ఇరాన్‌పై ట్రంప్ కన్ను

### నాయకత్వ మార్పుపై ఊహాగానాలు

### టెహ్రాన్‌లో కొనసాగుతున్న ఆందోళనలు

### సుప్రీం లీడర్ ఖమేనీ అదృశ్యం

### దేశం వీడి వెళ్లాలని వ్యూహాలు

### పరిస్థితిని గమనిస్తున్న అగ్రరాజ్యం



5



## ఫాల్కన్ సిఎండి అరెస్టు

### ముంబయి విమానాశ్రయంలో అమర్‌దీప్‌ను అదుపులోకి తీసుకున్న సిఐడి

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** మాదాపూర్ కేంద్రంగా ఏర్పాటై నాలుగు వేల మందికి పైగా అమాయకులను బురిడి కొట్టించి 4215 కోట్ల రూపాయలతో ఉడాయించిన క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అలియాస్ ఫాల్కన్ అనే కంపెనీ సిఎండి అమర్ దీప్ కుమార్ ఏడాది తరువాత పోలీసులకు పట్టుబడ్డాడు. గత ఏడాది ఫిబ్రవరి నెలలో వెలుగు చూసిన ఈ స్కాం అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం రేపడం >>2

## హైదరాబాద్ మరో ఢిల్లీ కావద్దు.. అందుకే 'హిల్ట్'

### పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలే ముఖ్యం

### కాలుష్య కారకాలు ఓఆర్ఆర్ లోపల ఉండొద్దనేదే లక్ష్యం

### అసెంబ్లీలో పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, జనవరి 6,ప్రభాతవార్త:** పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలే ముఖ్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్‌పాలసీ తీసుకువచ్చామన్నారు. మంగళవారం అసెంబ్లీలో హిల్ట్‌పాలసీపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఈ హిల్ట్‌పాలసీ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టాలంటూ ప్రతిపక్షాలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కావాలనే ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలపై మండిపడ్డారు. స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వలేని నాగరికత.. అసమర్థ నాగరికతే అవుతుందని అభివర్ణించారు. అభివృద్ధి పేరిట పర్యావరణ విధ్వంసం జరుగుతోందంటూ ఆయన హెచ్చరించారు. అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదని..పిల్లలకు ఆస్తులు కాదు.. శుభ్రమైన వాతావరణం ఇవ్వడమే నిజమైన వారసత్వమని అభిప్రాయపడ్డారు. ఇంకా చెప్పాలంటే బంగారు గిన్నెలో విషం పెట్టినట్లవుతోంది మన పరిస్థితంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి నాశనమైతే తిరిగి రాదని మంత్రి హెచ్చరించారు. ఢిల్లీలో నివాసాల మధ్యనున్న 168 పరిశ్రమలను.. తరలించాలని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. చైనాలో బ్లూ స్కై విధానం ద్వారా..భారీ పరిశ్రమలను నగరం అవతలికి తరలించారని వివరించారు. కాలుష్య కారక పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదనే హిల్ట్‌పాలసీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2013లోనే రెడ్‌అండ్ ఆరెంజ్ పరిశ్రమలను.. ఓఆర్ఆర్ అవతలికి తరలించాలని జీఓ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రజల భవిష్యత్ దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలన్నారు. ప్రజలను కాలుష్యం నుంచి రక్షించాలనే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. హిల్ట్‌పాలసీ బయటకు రాకముందే ప్రభుత్వ భూములు అడ్డగోలుగా ఇస్తున్నారని మాట్లాడుతున్నారని.. అయితే కనీస సమాచారం తెలియకుండానే బీఆర్ఎస్, బీజేపీలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ హిల్ట్‌పాలసీపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామన్నారు. ఈ పాలసీ పారిశ్రామికవేత్తలకు 6 నెలల గడువు ఇస్తామని ..స్వచ్ఛందంగా ముందు కొస్తేనే భూములు కన్వర్ట్ చేస్తామని మంత్రిస్పష్టం చేశారు.పారిశ్రామికవేత్తల భూములు.. ప్రభుత్వానివి అంటూ ప్రచారం చేస్తున్నారని దశాబ్దాల కిందటే గత >>2

## పాలన చేతగాక మాపై నిందలు

### అడ్డిమారి గుడ్డిసూటిలా సిఎం అయిన రేవంత్

### ఇక మూడేళ్లే ఆయన ముఖ్యమంత్రి

### బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**జనగామ, జనవరి 6, ప్రభాత వార్త ప్రతినిధి:** కేసీఆర్‌ను మల్ల మొలకెత్తనియ్యనని సీఎం రేవంత్‌రెడ్డి శపథం చేయడంపై... తెలంగాణను మొలకెత్తనివ్వమని విర్రవీగిన కాంగ్రెస్ పార్టీ మెడలువంచి తెలంగాణను మొలిపించిన మొగోడు.. మొనగాడు కేసీఆర్ అని బీఆర్ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరయ్యారు. జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యుల అభినందన సభ మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరై సీఎం రేవంత్‌రెడ్డిపైన, రాష్ట్ర ప్రభుత్వంపై మరోసారి తీవ్రవిమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి >>2



## తండ్రి రాసిన మరణశాసనం

### భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం

### ఇద్దరు పిల్లలకు విషమిచ్చి ఆపై కాల్వలో తోసేసి..

### తండ్రి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

### నారాయణపేట జిల్లా మరికల్‌లో ఘటన

**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 6, ప్రభాత వార్త:** భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెందిన భర్త తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపి తాను కూడా పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ హృదయ విదారక ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. >>2

## ప్రమాదపు అంచుల్లో వేప




### వైరస్‌తో ఎండిపోతున్న చెట్లు

### ఫోమోప్సిస్ అనే శిలీంధ్రం వ్యాప్తి

సహజ సంజీవని అయిన వేప నేడు ప్రకృతి వైపరీత్య ప్రమాదపు అంచుల్లో చిక్కుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొంతకాలంగా వేపకు వైరస్ సోకుతుండడంతో జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో చెట్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. చెట్టంతా నిలువెల్లా ఎండిపోతూ ఆకులన్నీ రాలిపోతున్నాయి.

7

## మామిడికి వైరస్



### రాలిపోతున్న పూత

### భారీగా తగ్గనున్న దిగుబడి

వాతావరణంలో వచ్చిన మార్పులు మామిడి రైతులకు శాపంగా మారాయి. పొగమంచు, ఉష్ణోగ్రతల మార్పులతో మామిడి చెట్లకు పూత రావడం లేదు. కొన్నింటికి పూత వచ్చినప్పటికీ ఎక్కువ భాగం రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో మామిడి తోటలకు వైరస్ వ్యాపించింది.

## వరంగల్ కోట భూములను పురావస్తు శాఖకు చెందినవిగా గుర్తించాలి



### ఆ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి6:** వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం ఓ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించడం >>2



ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో బుధవారం ఓటర్ల జాబితాలో తమ పేర్లను తనిఖీ చేసుకుంటున్న ప్రజలు

## సోనియాకు అస్వస్థత

>> నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు చికిత్స అందిస్తోంది. ఢిల్లీలో గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం చాలా ఘోరంగా ఉంది. దీని కారణంగానే ఆమె అనారోగ్యానికి గురైనట్టు వైద్యులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గతంలో కూడా ఆమె శ్వాసకోశ సమస్యలతో బాధపడ్డారు. గత డిసెంబర్ లో సోనియా 79వ పుట్టినరోజును జరుపుకున్నారు. మరోవైపు, సోనియా ఆసుపత్రిలో చేరారన్న వార్తతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంకోవైపు, సోనియా ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. వయోభారంతో ఉన్న సోనియా తరచూ ఆసుపత్రికివెళ్లి పరీక్షలు చేయించుకుంటున్న సంగతి తెలిసిందే. గతంలో రెండు పర్యాయాలు కూడా సంపూర్ణ ఆరోగ్య పరీక్షలుచేయించుకన్నారు. అప్పట్లోకూడా ఈ వార్తలు వైరల్ కావడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి.

## సోనియా ఆరోగ్య పరిస్థితిపై పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి6:** కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతోండటంతో ఆమెను వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఈ నేపథ్యంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరా తీశారు. ఏఐసీసీ పెద్దలకు ఫోన్ చేసి సోనియా గాంధీ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సోనియా ఆరోగ్యం నిలకడగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ఫిబ్రవరి 1న బడ్జెట్

>> ఉన్నాయి. 2025లో బడ్జెట్‌ను శనివారం నాడు ప్రవేశపెట్టారు. అంతకుముందు దివంగత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2015 ఫిబ్రవరి 28 (శనివారం), 2016 ఫిబ్రవరి 28 (ఆదివారం) తేదీల్లో బడ్జెట్‌ను సమర్పించారు. పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం నాడు కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సరైన సమయంలో తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. 2017కు ముందు కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి పనిదినాన ప్రవేశపెట్టేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. కొత్త ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) ప్రారంభమైన తర్వాత కూడా కొన్ని నెలల పాటు బడ్జెట్ ఆమోదం పొందకపోయేది. ఈ సమయంలో ప్రభుత్వ ఖర్చుల కోసం పార్లమెంట్ ఓట్ ఆన్ అకౌంట్ ను ఆమోదించాల్సి వచ్చేది. ఈ జాప్యాన్ని నివారించడానికి 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తోంది. ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలు కూడా ఉన్నాయి.

## తండ్రి రాసిన మరణశాసనం

>> వివరాల్లోకి వెళ్తే నారాయణపేట జిల్లా తీలేరు గ్రామానికి చెందిన శివరాములుకు రిత్విక (8) చైతన్య (5) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో భార్యవిడాకులు తీసుకుని వెళ్లిపోవడంతో పిల్లలను తన వద్ద ఉంచుకొని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య తిరిగి కాపురానికి రావడంలేదని మనస్థాపానికి గురై మానసిక ఒత్తిడికి లోనై తన ఇద్దరు చిన్నారులకు విషం తాగించినట్లు తెలుస్తుంది. అయితే విషం తాగించినప్పటికీ వారు మృతి చెందకపోవడంతో సమీపంలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు కాలువ వద్దకు తీసుకెళ్లి చిన్నారులను కాలువలో తోసి చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన కాల్వ వద్దకు చేరుకుని ఇద్దరు చిన్నారులంతదేహాలను వెలికి తీసి అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారులను కాలువలతో చేసిన అనంతరం శివరాములు కూడా అదే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటికి తాను మృతి చెందలేదని గుర్తించి కరెంటు ట్రాన్స్ఫార్మర్ ను తాకి ప్రాణాలు తీసుకునేందుకు ప్రయత్నం చేసినట్లు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ప్రస్తుతం శివరాములు తీవ్రంగా గాయపడి దవఖానలో చికిత్స పొందుతున్నాడు. అభం శుభం తెలియని చిన్నారులపై కర్కశత్వం ప్రదర్శించడానికి తండ్రికి చేతులు ఎలా వచ్చాయని గ్రామస్తులతో పాటు విషయం తెలిసిన వారంతా మండిపడుతున్నారు. ఈ మేరకు మరికల్ ఎస్సై రాము కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## రెవెన్యూ డివిజన్ల పునర్విభజన!

>> ప్రకటించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి గండేడ్, మహమ్మదాబాద్ మండలాలను విడదీసి పరిగి నియోజకవర్గంలోని ప్రస్తుత వికారాబాద్ జిల్లాలో విలీనం చేయాలనే ప్రతిపాదన ప్రభుత్వం దగ్గర ఉందా? అని సభ్యులు డాక్టర్ టి రాంమోహన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాలను మహబూబ్‌నగర్ జిల్లా నుంచి తొలగించి వికారాబాద్ జిల్లాల్లో కలిపే ఆలోచన లేదన్నారు. అలాగే నల్గొండ జిల్లాలో అమ్మనబోలును మండలంగా, నకిరేకల్‌ను రెవిన్యూడివిజన్‌గా మార్చాలని ఎమ్మెల్యే వేముల వీరేశం, కాగజ్‌నగర్ మండలాన్ని కాగజ్‌నగర్ రూరల్‌గా, టౌన్‌గా మార్చాలని బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు కోరారు. ఇందుకు మంత్రి సమాధానమిస్తూ గత పాలకుల హయాంలో అశాస్త్రీయంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మండలాల ఏర్పాటు మొదలుకొని జిల్లాల పునర్వ్యవస్థీకరణ వరకు ఇష్టానుసారంగా, ఎవరి అభ్యర్థనలను పట్టించుకోకుండా చేశారని విమర్శించారు. ప్రజల విజ్ఞప్తులను పక్కనబెట్టి.. కేవలం రాజకీయ ప్రయోజనాలు, అదృష్ట సంఖ్యల ఆధారంగా మండలాలను, డివిజన్లను ఏర్పాటు చేశారని విమర్శించారు.
ఈ లోపాలను సరిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సమగ్ర పునర్వ్యవస్థీకరణ చేపడతామని మంత్రి తెలిపారు. అధికారుల నుంచి నివేదికలు తెప్పించి.. శాసనసభలో చర్చించిన తర్వాతే అందరి ఆమోదంతో శాస్త్రీయంగా కొత్త జిల్లాల మార్పులు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఫాల్కన్ సిఎండి అరెస్టు

>> తెలిసిందే. అ ధిక వడ్డీతో పాటు స్వల్ప వ్యవధిలో భారీ లాభాలు ఇస్తానని హామీ ఇచ్చిన ఫాల్కన్ కంపెనీ దేశ వ్యాప్తంగా 4065 మంది డిపాజిటర్లను నిండా ము ంచింది. డిపాజిటర్లు అప్పట్లో లక్షలాది రూపాయలను ఈ కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టారు. అంతకు రెండేళ్ల క్రితం అంటే 2023లో ఈ కంపె నీ ఏర్పాటయ్యింది.
మాదాపూర్‌లో బడా భవనంలో పదుల సంఖ్యలో ఉద్యోగులతో ఏర్పాటైన ఈ కంపెనీ హైదరాబాద్ వాసులను కూడా ఆకట్టుకు ంది. అందరిని ముంచిన ఫాల్కన్ కంపెనీపై మొదట సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేయగా ఆ తరువాత దీనిని సిఐడికి బదలా యించారు. ఈ కేసులో ఇప్పటి వరకు కంపెనీ అధికారులు, కీలక పదవుల్లో వున్న వారు 11 మంది అరెస్టయ్యారు. అయితే సిఎండి అమర్‌దీప్ కు మార్ మాత్రం విదేశాలకు పారిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న సిఐడి అధికారులు అతని కోసం లుకవుట్ నోటీసులు జారీ చేశారు. దీని ఆధారంగా అమర్‌దీప్ కుమార్ ఇరాన్‌లో వున్నట్లు తేలగా అతన్ని పట్టుకునేందుకు సిఐడి అధికారులు అక్కడి అధికారుల సహకారం కోరారు.
దీని ఆ ధారంగా సోమవారం రాత్రి అమర్‌దీప్ కుమార్ ఇరాన్ నుంచి ముంబాయి రాగా ముందుగానే దీనిపై సమాచారం అం దుకున్న సిఐడి అధికారులు అ తన్ని విమానాశ్రయంలోనే అరెస్టు చేశారు. అనంతరం అతన్ని హైదరాబాద్‌కు తరలించి మంగళవారం నాడు ఇక్కడి కోర్టులో హాజరు పరిచి రిమాం డుకు తరలించారు. కాగా ఈ కేసులో ఫాల్కన్ కంపెనీ 4215 కోట్ల రూపాయలను అమాయకుల నుంచి దోచుకోగా సిఐడి నిందితుల నుంచి నగ దు, నగలు, ఖరీదైన కార్లు, ఇతర స్థిరాస్తులు మొత్తం 43 కోట్ల రూపాయల ఆస్తులను జప్తు చేసింది. ఈ కంపెనీ దోచుకున్న మిగతా సొమ్ము ఎక్క డ వుందనే దానిపైనా దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై సిఐడి అదనపు డిజి చారు సిన్హా నేతృత్వంలో విచారణ జరుగుతుంది.

### వారం - వర్జ్యం

07-01-2026, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
చవితి ఉ.6.53, పంచమి తె.6.22
మఖ, మ.12.00
వర్జ్యం : రా.8.09-9.47
దు.ఉ.11.51-12.36
శుభసమయం : ఉ.8.00-9.00,
సా.6.30-7.15
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం :** ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఏర్పడినా అధిగమిస్తారు. మిమ్మల్ని మాయ మాటలతో మోసగించాలనుకునే వారు భంగపడతారు.

**వృషభం:**ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు అవసరం. సహనాన్నీ, ఓర్పును కలిగి ఉండండి. శ్రమ అధికం.

**మిథునం:**ముఖానికి చిరునవ్వు ఇచ్చిన అందం, చికాకు ఇవ్వదు. బంధువులతో ఇష్టాగోష్ఠులు సాగిస్తారు.

**కర్కాటకం :** అర్థం లేని రాజకీయాలు చోటు చేసుకుంటాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**సింహం:** విరుద్ధమైన ఆలోచనలు మానసిక సంతోషానికి గురిచేస్తాయి. కీలక వ్యవహారాలు పూర్తి చేస్తారు.వస్త్రలాభం.

**కన్య:**సన్నిహితులు నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**తుల:**ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉ ంటుంది. దూర ప్రాంతాల నుండి శు భవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** తండ్రి తరపు నుండి ఆస్తిలాభం పొందుతారు. కోర్టు వివాదాలు పరిష్కార మవుతాయి.క్రయ విక్రయాలలో లాభాలు.

**ధనుస్సు:** దీర్ఘకాలిక ఋణాలు కొంత వరకు తీరుస్తారు. ఆదాయ, వ్యయాలు సరిసమానంగా ఉంటాయి.

**మకరం:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. కార్యాలయంలో ప్రతికూల వాతావరణం నెలకొంటుంది.

**కుంభం:** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలుకువ అవసరం.

**మీనం :** క్రమశిక్షణకు ప్రాధ్యాన్యతనిస్తారు. సంతానంలో వస్తున్న మార్పులు ఆలోచింపచేస్తాయి.ధనలాభం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హైదరాబాద్ మరో ఢిల్లీ కావద్దు.. అందుకే 'హిల్ట్'

>> ప్రభుత్వాలు వారికి భూములు అమ్మేశాయని గుర్తు చేశారు. ల్యాండ్ కన్వర్షన్‌పై బలవంతం ఏమీలేదని పారిశ్రామికవేత్తలకు ఇష్టమైతేనే ల్యాండ్ కన్వర్షన్ చేస్తామని తెలిపారు.
గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డ మంత్రి ఇప్పటికైనా పర్యావరణ విధ్వంసం ఆగాలన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు అపార్ట్‌మెంట్స్ పక్కనే ఉన్నాయని.. పరిశ్రమలు, రెసిడెన్షియల్ ప్రాంతాల మధ్య బఫర్‌జోన్లు లేవన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం వల్లే.. గతంలో విశాఖపట్నంలో ఎల్జీ పాలిమర్స్, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో గ్యాస్ వంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. పారిశ్రామిక రసాయనాల వల్లే భూగర్భ జలాలు విషపూరితం అవుతాయని తెలిపారు. ఇప్పటికైనా మేల్కోకపోతే హైదరాబాద్ కూడా.. ఢిల్లీ పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందంటూ శ్రీధర్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు.
**పరిశ్రమలను మూసివేసేలా హిల్ట్ పాలసీ: మహేశ్వర్‌రెడ్డి**
జీవో 27 చాలా వివాదాస్పదంగా పరిశ్రమలను మూసి వేసేలా ఉందని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటిమహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. హిల్ట్ పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. జీవో లీక్ కావడంపై ప్రభుత్వంలో ఆందోళన ఉందన్నారు. టౌన్‌షిప్, అపార్ట్‌మెంట్‌లు ఉండాలని జీవో 27లో ఉంది. అతితక్కువ ధరకు భూములు ఇచ్చారు. హిల్ట్ పాలసీకి సంబంధించి సబ్ కమిటీ నిర్ణయాలను బయటపెట్టలేదు. 22 పారిశ్రామిక వాడలను అన్యాక్రాంతం చేస్తున్నారు. ఫార్మాసిటీ కోసం రైతుల నుంచి సేకరించిన భూములను ఫోర్త్ సిటీకి ఉపయోగిస్తున్నారు. ఆ భూములపై హైకోర్టు ఆఫిడవిట్ అడిగింది. పరిశ్రమలను మూసివేసేలా ప్రస్తుత పాలసీ ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసే అధికారం ప్రస్తుత ప్రభుత్వానికి ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలో తప్పులు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల భూములను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 43,342 జీవోలు దాచి పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం 19,064 జీవోలు ఇస్తే.. 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్లో ఉన్నాయి" అని ఆరోపించారు.
**హిల్ట్‌పాలసీని స్వాగతిస్తున్నా: దానం నాగేందర్**
హిల్ట్‌పాలసీని స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. హైదరాబాద్ పరిసరాల్లో ఉన్నా పరిశ్రమల వల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయని గతంలో ట్యాంక్‌బండ్‌లో చేపలు పట్టేవారని తాముసైతం ఈతకొట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. కానీ ఇప్పుడు అక్కడి నుంచి వెళ్లాలంటేనే ముక్కుమూసుకునే పరిస్థితి ఉందన్నారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాలని సీఎం సంకల్పించారన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాలు.. 500 ఎంజీడీ ద్వారా కూడా తీరట్లేదని దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి ఒక విజన్ ఆలోచన ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ 2047లక్ష్యం కాస్తా ఆలస్యం కావచ్చు.. కానీ జరగడం పక్కా అని దానం నాగేందర్ పేర్కొన్నారు.
**కాలుష్యరహిత నగరానికి ప్రభుత్వం కృషి: నవీన్‌యాదవ్**
హైదరాబాద్ నగరం విస్తృతంగా పెరుగుతోదని గతంలో 50 లక్షల జనాభా ఉంటే ఇప్పుడు కోటి మందికిపైగా జనాభా ఉంది జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. హిల్ట్‌పాలసీపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జనసముద్రంగా మారింది గతంలో మూసీ నదిలోని నీటిని తాగేవారు ప్రస్తుతం మూసీనదిలో కాలుష్య కారకాలు పెరిగాయన్నారు. హైదరాబాద్‌లో అనేక కంపెనీలు వచ్చాయని దీంతో కాలుష్యం పెరుగుతుందన్నారు. హిల్ట్‌పాలసీవల్ల హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా ఉంచడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని నవీన్‌యాదవ్ పేర్కొన్నారు.

# సమగ్ర అభివృద్ధికి 'క్యూర్, ప్యూర్, రేర్'

>> ప్రతి సభ్యుడిని వెంటాడాల్సిన ప్రశ్న ఏమిటంటే? తర్వాత ఏమి జరుగుతుంది? మనం ఏమీ చేయకపోతే ..మనం "యథావిధిగా" కొనసాగితే 2047 నాటికి మనం సహజంగానే 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. అది గౌరవప్రదంగానే అనిపిస్తుంది. కానీ ఈ రాష్ట్రంలోని ప్రతి రైతును, ప్రతి దళితుడిని, ప్రతి గిరిజనుడిని మరియు ప్రతి మహిళను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అది సరిపోదు అన్నారు.ఆ 1.2 ట్రిలియన్ డాలర్ల సహజ వృద్ధికి మరియు మనం ఆశించే 3 ట్రిలియన్ డాలర్ల గమ్యానికి మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడానికి, మనకు గతం నుండి ఒక నిర్మాణాత్మక విరామం అవసరం అన్నారు. ఈ పేపర్ ఆ విరామం యొక్క విధానాలను వివరిస్తుంది అని తెలిపారు.ఈ దార్శనికత వ్యక్తిగత వృద్ధి నమూనా యొక్క కఠినమైన సూత్రాలపై ఆధారపడి ఉంది, ఈ లక్ష్యాన్ని సాధించడానికి, మనం కేవలం ఎక్కువ మంది కార్మికులను చేర్చితే సరిపోదని ఇది చెబుతుంది అని వివరించారు. మనకు ఒక "ఉత్పాదకత షాక్" అవసరం, మేము మాకు ఒక కఠినమైన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాము, మా పెట్టుబడి రేటును జిఎస్‌డిపిలో 52శాతం కి పెంచడం. దీని కోసం మనం మూలధనాన్ని నియంత్రించే రాష్ట్రం నుండి దానిని ఉత్ప్రేరకపరిచే రాష్ట్రంగా మారాలి అని తెలిపారు. దేశీయ పొదుపులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మరియు మొదటిసారిగా, మా స్టార్టప్‌ల కోసం ఆవిష్కరణలలోని నష్టాన్ని తగ్గించడానికి ఒక ప్రత్యేక ఫండ్ ఆఫ్ ఫండ్స్ మిశ్రమం ద్వారా మేము దీనిని సమీకరిస్తున్నాము అని డిప్యూటీ సీఎం వివరించారు. క్యూర్ ప్యూర్ రేర్: చాలా కాలంగా, భారతదేశంలో అభివృద్ధి అంటే "నిరక్ష్య సముద్రంలో శ్రేష్ఠత ద్వీపాలు" అని అర్థం. హైదరాబాద్ అభివృద్ధి చెందుతుండగా, మారుమూల జిల్లాలు పైనుండి కిందకు వచ్చే ఆర్థిక ప్రయోజనాల కోసం ఎదురుచూడటం మనం చూస్తున్నాము. ఈ పత్రం ఆ నమూనాను పక్కకు పెడుతుందని పేర్కొన్నారు.సియుఆర్ఈ(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ): ఓఆర్ఆర్ లోపల, మేము నికర-జీరో, సేవల ఆధారిత మహానగరాన్ని నిర్మిస్తాము అన్నారు. ఇక్కడ 30,000 ఎకరాల అద్భుతం అయిన భారత్ ఫ్యూచర్ సిటీ ఉంది, ఇది ఏఐ నగరం, ఆరోగ్య నగరాన్ని కలిగి ఉంటుంది అన్నారు.పియుఆర్ఈ (పెరిఅర్బన్ రీజియన్ ఎకానమీ): ఓఆర్ఆర్...రీజినల్ రింగ్ రోడ్ మధ్య, మేము తయారీ ఇంజిన్‌ను నిర్మిస్తాము. ఇక్కడే కర్మాగారాలు, లాజిస్టిక్స్ హబ్‌లు, బ్లూకాలర్ ఉద్యోగాలు వృద్ధి చెందుతాయి అన్నారు.ఆర్ఏఆర్ఈ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ): రీజినల్ రింగ్ రోడ్ దాటి, వ్యవసాయాన్ని జీవనాధార కార్యకలాపంగా పరిగణించడం మానేస్తాము, మేము దానిని అధిక విలువైన బయోఎకానమీగా పరిగణిస్తాము, ఆహార ప్రాసెసింగ్ మరియు పర్యావరణ పర్యాటక రంగంపై దృష్టి సారిస్తామన్నారు. తెలంగాణలో ఎక్కడ ఒక బిడ్డ జన్మించినా, అవి ప్రపంచ ఆర్థిక కేంద్రానికి 180 నిమిషాలలోపు ఉంటాయి అన్నారు.మానవ మూలధనం: జర్మన్ మోడల్, భవనాలు దేశాలను నిర్మించవు, ప్రజలు అలా చేస్తారు. పరిశ్రమ నిరంతరం తమకు ఉద్యోగాలు ఉన్నాయని చెబుతుంది, కానీ మన యువతకు ఆ ప్రత్యేక నైపుణ్యాలు లేవు. ఈ పత్రం ఒక సమూల మార్పును ప్రతిపాదిస్తోంది అన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయంతో, మేము జర్మన్ డ్యూయల్‌సిస్టమ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్‌ను అవలంబిస్తున్నాము అన్నారు. విద్యార్థులు తరగతి గదుల్లో కూర్చోవడం మాత్రమే కాదు వారు 3 నుండి 4 రోజులు షాప్ ఫ్లోర్‌లో, 1 నుండి 2 రోజులు తరగతిలో గడుపుతారు. మేము డిగ్రీలు నుండి కాంపిటెన్సీకి మారుతున్నాము అని డిప్యూటీ సీఎం వివరించారు. ఇంకా, ఆరోగ్య ఖర్చును జిఎస్‌డిపిలో 8శాతంకు పెంచడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఎందుకంటే అనారోగ్య శ్రామిక శక్తి 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థను నిర్మించదు అన్నారు. ఈ పత్రం యొక్క ప్రధాన ఉద్దేశం కోటి మంది మహిళలను కోటీశ్వరులు గా మార్చడం. మేము స్వయం సహాయక బృందాలకు రుణాలు ఇవ్వడం మాత్రమే కాదు; మేము ఆ సంఘాలను కార్పొరేట్ సంస్థలుగా మారుస్తున్నాము అన్నారు. వారికి వ్యక్తిగత క్రెడిట్ స్కోర్‌లను అందించడానికి మేము వారి తిరిగి చెల్లింపు చరిత్రను డిజిటలైజ్ చేస్తున్నాము, మారుమూల గ్రామంలోని ఒక మహిళ బంజారా హిల్స్‌లోని వ్యాపారవేత్త లాగా మూలధనాన్ని పొందేందుకు వీలు కల్పిస్తుంది అన్నారు. సబ్సిడీ ద్వారా కాకుండా, ఎంటర్‌ప్రైజ్ ద్వారా కోటి మంది మహిళలు లక్షాధికారులు కావాలని మేము కోరుకుంటున్నాము అన్నారు.2047 విజన్ డాక్యుమెంట్ పై చర్చించడానికి ప్రతిపక్ష సభ్యులను, నా సహచరులను ఆహ్వానిస్తున్నాను. మీరు ఆలోచన చేయండి, విశ్లేషించండి, మెరుగైన సూచనలు సలహాలు ఇవ్వండి అన్నారు. తాను గ్లోబల్ సమ్మిట్ లో చెప్పినట్టుగా ఇది ఒక స్థిరమైన ప్రభుత్వ ఉత్తర్వు కాదు,ఇది ఒక సజీవ వేదిక అన్నారు.2014లో సోనియా గాంధీ మార్గదర్శకత్వంలో రాజకీయ తెలంగాణ కలను సాకారం చేసుకున్నాము. 2024లో సంపన్న తెలంగాణ కోసం మనం ఒప్పందంపై సంతకం చేద్దాం ముందుకు సాగుదాం అని ప్రసంగం ముగించారు.




న్యూఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోవడంపై బుధవారం ఆందోళన జరిపిన ఆప్ నేతలు

## పురావస్తు శాఖకు చెందినవిగా గుర్తించాలి

>> గురించి ఈ లేఖలో ప్రస్తావించారు. దాదాపు 250 సంవత్సరాలపాటు కాకతీయుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం,సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు (వరంగల్) పట్టణం తెలంగాణ వారసత్వ సంపదకు నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోట అని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని ఆ లేఖలో కిషన్‌రెడ్డి వెల్లడించారు.
పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఉన్న వరంగల్ కోట పరిరక్షణకు, నిర్మాణాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ వరంగల్ కోటకు చుట్టూ ఉన్న 7 ప్రాకారాల్లో ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు.
ఈ 3 ప్రాకారాలతో పాటు ఇతర ప్రాకారాలను కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూముల్లో అనేక అక్రమ కట్టడాలు నిర్మించారని వెల్లడించారు. వరంగల్ కోట ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్న ఒక స్మారక ప్రదేశమని, దీనికి సంబంధించిన భూములను ఆక్రమించడం, అందులో అక్రమంగా నిర్మాణాలను నిర్మించడం చట్టరీత్యానేరమని చెప్పుకొచ్చారు. వెంటనే ఆక్రమించిన భూములను ఖాళీ చేయాలని కోరుతూ ఎఎస్ఐ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఎఎస్ఐ అధికారులు 04.11.2022న అలాగే, ఇటీవల 01.12.2025న వరంగల్ జిల్లా కలెక్టర్‌కి పలుమార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. తాను లేఖ రాసిన కోట భూములను పరిరక్షించటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. అంతేకాకుండా, రెవెన్యూ రికార్డులలో కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవి అని పేర్కొన్నారు. దీనితో ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంలో భారత పురావస్తుశాఖకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ ఆక్రమణలు మరింత పెరగకుండా, కోట భూములు భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించడం కోసం ఎస్ఐఐ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో కోట భూములను పరిశీలించాలని సంబంధిత అధికారులకు తగిన మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరుతూ 15.10.2025న కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎఎస్ఐ అధికారులు వరంగల్ జిల్లా కలెక్టరుకు లేఖ రాశారని పేర్కొన్నారు.వరంగల్ కోటకు చుట్టూ మట్టి గోడ, రాతి గోడ ఉన్నాయి. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కొత్త నిర్మాణాలను చేపట్టడానికి వీలుగా ఇటీవల మట్టి గోడలోని కొంత భాగాన్ని ఆక్రమించారు. వారసత్వ ప్రదేశాలను ధ్వంసం చేసి, వరంగల్ కోట భూముల్లో చట్టవిరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించడంలో తగిన సహకారాన్ని అందించి, పురావస్తు శాఖ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎఎస్ఐ అధికారులు ఇటీవల 03.12.2025న జిల్లా కలెక్టరుకు మరో లేఖ రాశారని తెలిపారు. 2025 నవంబర్‌లో తానువరంగల్‌లో పర్యటించినప్పుడు ఎఎస్ఐ అధికారులు ఈ విషయాలన్నింటినీ తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. కాబట్టి, మీరు ప్రత్యేక చొరవ తీసుకుని, వరంగల్ కోట పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించి, వాటిని తొలగించడం, ఆక్రమణకు గురైన కోట భూములను ఆక్రమణదారుల నుంచి విడిపించి తిరిగి ఎఎస్ఐకి స్వాధీనం చేయడం, ఆక్రమణదారుల మీద కఠిన చర్యలు తీసుకోవడం వంటి చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు.న భారత పురావస్తుశాఖ చట్టం ప్రకారం, వరంగల్ కోట భూములను ఎఎస్ఐ చెందినవిగా గుర్తించి రెవెన్యూ రికార్డులను సరిదిద్ది భూ ఆక్రమణ సమస్య పరిష్కరించాలని.. అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని, చారిత్రక, వారసత్వ సంపద పరిరక్షణలో ఎస్ఎఐ కి అవసరమైన సంపూర్ణ సహకారాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం తరఫున కోరుతున్నట్లు పేర్కొన్నారు.

## చేతగాక మాపై నిందలు

>> పాలన చేతగాక బీఆర్ఎస్ మీద నిందలు వేస్తున్నాడని ఆరోపించారు. ఏదో అడ్డిమారి గుడ్డిసూటిల సీఎం అయిన రేవంత్రెడ్డి.. మూడేళ్ల టైంపాస్ చేసిపోక అవాకులు, చెవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి రైతులకు యూరియా ఇయ్య చేతగాదుగానీ అబద్ధాలు మాత్రం అనర్గళంగా వస్తయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను మల్ల మొలకెత్తనియ్యను అంటూ సీఎం రేవంత్‌రెడ్డి శపథం చేయడంపైనా కేటీఆర్ ఫైరయ్యారు. నువ్వేంది కేసీఆర్‌ను మొలకెత్తనియ్యకపోయేది అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్‌పార్టీ 60ఏండ్లు తెలంగాణను తొక్కిపట్టిందని, తెలంగాణను మొలకెత్తనివ్వమని విర్రవీగిందని, అలాంటి కాంగ్రెస్‌పార్టీ మెడలు వంచి తెలంగాణను మొలిపించిన మొగోడు.. మొనగాడు కేసీఆర్ అని, అందుకే ఆయన తన తండ్రి అని గర్వంగా చెప్పుకుంటానని కేటీఆర్ అన్నారు. అలాంటి మొనగాడిని సవాలుచేస్తున్న రేవంత్ రెడ్డి అనేటోడు ఆయన చెప్పు ధూళికి కూడా సరిపోడని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్ పెడితేనే రేవంత్‌రెడ్డి ఆగమాగం అవుతున్నాడని, ఇక ఆయన అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే అక్కడే గుండె ఆగి చస్తాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, యూరియా కోసం రైతులు చలిలో క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎనకటి రోజులు తీసుకొస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, మళ్లీ అదే పరిస్థితులను తీసుకవస్తున్నారన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిద్దామని, ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న ఆలోచనతోనే ఓటువేసి ఆయనను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రతీఒక్క సర్పంచి మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, నన్నపునేని నరేందర్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాకేష్‌రెడ్డి బీఆర్ఎస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## కవిత రాజీనామా ఆమోదం

>> ప్రెసిడెంట్ కెటిఆర్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు టార్గెట్ గా కవిత సంచలన ఆరోపణలు చేస్తున్నారు. మరికొంత మంది బిఆర్ఎస్ నేతలపై కూడా ఆమె తీవ్ర విమర్శలు చేశారు. దీంతో కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## అసెంబ్లీ నిరవధిక వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి6:** తెలంగాణ అసెంబ్లీ,శాసనమండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఐదు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. అసెంబ్లీలో మొత్తం 40 గంటల 45 నిమిషాల పాటు సభ్యులు చర్చ చేశారు. ఆమోదం పొందిన బిల్లుల్లో మున్సిపాలిటీ సవరణ బిల్లు, జిహెచ్ఎంసీ సవరణ బిల్లు, రెండో సవరణ బిల్లు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల బిల్లు, తెలంగాణ మోటారు వాహనాలపై పన్ను విధింపు సవరణ బిల్లు, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ తదితర బిల్లులు ఉన్నాయి. కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉపాధి హామీ, హిల్ట్ పాలసీ, తెలంగాణ రైజింగ్ విజన్ 2047పై స్వల్పకాలిక వ్యవధి చర్చలు సాగాయి.

## ప్రమాదంలో మరణించిన హోంగార్డు కుటుంబానికి

# రూ.38 లక్షల చెక్కు అందజేత

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** మల్కాజిగిరి కమిషనరేట్ (పూర్వపు రాచకొండ)లో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు కుటుంబానికి పోలీసు శాఖ బీమా పథకంలో భాగంగా 38 లక్షల రూపాయల చెక్కును అందజేసింది. భువనగిరికి చెందిన ఉపేంద్ర చారి ఇటీవల వి ధుల్లో వుండగా రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేబట్టారు. మరోవై పు హోంగార్డులు విధి ని ర్వహణలో చనిపోతే నష్ట పరిహారం అందించేందుకు యాక్సిస్ బ్యాంకు నుంచి బీమా పథకం వుంది. ఇందుకుగానూ హోంగార్డుల వేతనం నుంచి ప్రతీనెల కొంత వేతనం మినహాయిస్తారు. విధి నిర్వహణలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబాలకు బీమా పథకం నుంచి 38 లక్షల రూపాయలను అందజేస్తారు. ఇంతకు ముందు అనేక మంది హోంగార్డులకు దీనిని వర్తింప చేయగా తాజాగా ఉపేంద్రచారికి కూడా దీనిని వర్తింప చేశారు. ఉపేం ద్ర చారి కుటుంబీకులకు యాక్సిస్ బ్యాంకు నుంచి అందిన 38 లక్షల చెక్కును హోంగార్డుల అదనపు డిజి స్వాతి లక్రా మంగళవారం డిజిపి కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి వి.హనుమంతరావు

## '19వ రాజీవ్‌గాంధీ అండర్-19 ట్వంటీ-20లీగ్ క్రికెట్ ఛాంపియన్ షిప్-2026' పోటీలు

### నేటి నుంచి ఆరంభం : మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 6, ప్రభాతవార్త:** ఈ నెల 7వ తేదీ బుధవారం నుంచి 10వ తేదీ వరకు అండర్-19 రాజీవ్‌గాంధీ ఆల్ ఇండియా క్రికెట్ ఛాంపియన్‌షప్ పోటీలు హైదరాబాద్ నగరంలో జరుగుతాయని క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తెలిపారు. గత 18 సంవత్సరాలుగా మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జ్ఞాపకార్థం ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో అండర్-19, ఛండిఘడ్‌లో అండర్-17, చెన్నైలో అండర్-15 క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లు నిర్వహిస్తునా న్నమని ఆయన చెప్పారు. ఇది 19వ టోర్నమెంట్‌అని, ఈ టోర న్మెంట్‌లో 4 దేశాలు, పలు రాష్ట్రాలకు చెందిన క్రికెట్ టీమ్‌లు పాల్గొంటున్నాయని మంగళవారం ఎల్‌బి స్టేడియంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరించారు. 7వ తేదీన అంబర్‌పేటలోని వాటర్ ఫాల్స్ గ్రౌండ్‌లో జరిగే ఈ క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రాంభిస్తారని, ఆతరువాత అత్తాపూర్‌లోని విజయానంద్‌గ్రౌండ్‌లో కూడా టోర్నమెంట్ జరుగుతాయని, ఫైనల్ మ్యాచ్ 10వ తేదీన ఎల్‌బిస్టేడియంలో జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేస్తారన్నారు.

## కాసుల కోసం కన్నతండ్రి హత్య

### మద్యానికి బానిసై.. మానవత్వం మరిచి..

**పాపన్నపేట, జనవరి 6, ప్రభాతవార్త:** డబ్బు కోసం కన్న తండ్రినే కర్రతో మోది అంతమొందించిన సంఘటన పాపన్న పేట మండల పరిధిలోని సీతానగరంలో సోమ వారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో లంగిడి లక్ష్మయ్య (48) బార్య శేఖమ్మ లకు ఇరువురు కుమారులు శ్రీకాంత్, శివలు కాగా పెద్దకుమారుడు శ్రీకాంత్



లక్ష్మయ్య (ఫైల్)

వివాహం చేసి ఉన్న రెండు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలోవ్యవసాయం తోపాటు ఎలక్ట్రిషన్ గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా పెద్ద కుమారుడు శ్రీకాంత్ త్రాగుడుకు బానిసై పని బాట చేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి డబ్బులు కోసం తరచు తండ్రి తో గొడవ పడేవాడు. అయితే సోమవారం రాత్రి శ్రీకాంత్ అతిగా మద్యం సేవించి మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తండ్రి లక్ష్మయ్యతో గొడవ పడి మృతుడు డబ్బులు లేవని తెలుపడంతో కోపాద్రికుడైన తనయుడు అక్కడే ఉన్న కర్రతో తలపై మోదడంతో తీవ్ర రక్త స్రవం కావడంతో కుటుంబీకులు వెంటనే అపస్మారక స్థితిలో ఉన్న మృతుడిని అంబులెన్స్ లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షి ంచిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించడంతో కుటుంబీకులు పాపన్న పేట పోలీసులకు సమాచారం అందించడం తో పాపన్న పేట పోలీసులు హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి ఎలాంటి గొడవలు జరగకుండా గస్తీ ఏర్పాటు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి భార్య శేఖమ్మ, ఇరువురు కుమారులు ఉన్నారు.


ఫారం నెం.14 (33(2) నిబంధన చూడండి)
రికవరీ ఆఫీసర్- I/II యొక్క కార్యాలయం
ఋణాల రికవరీ ట్రిబ్యునల్ హైదరాబాద్ (DRT 1)
3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500 001.
డిమాండ్ నోటీస్
1961, ఆదాయపు పన్ను చట్టానికి రెండవ షెడ్యూల్ యొక్క నిబంధన 2 మరియు ఋణాల యొక్క రికవరీ & దివాళా చట్టం 1993 యొక్క సెక్షన్‌లు 25 To 28 క్రింద ప్రకటన

RC/306/2024 — స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెర్సస్ శ్రీ విజయ్ కుమార్ సత్యాలయ — 29-12-2025

వీరికి
(CD-1) శ్రీ విజయ్ కుమార్ సత్యాలయ, S/o S. ఇజ్రాయెల్, ఇం.నం.4-21, సోమరాజుపేట గ్రామం, మగ్గం పోస్ట్, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్-533201.
OA No.: 343/2023 లో ఋణాల రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT1) ప్రిసైడింగ్ ఆఫీసర్ ద్వారా జారీ అయిన ఉత్తర్వులు అనుసరణలో జారీ అయిన రికవరీ సర్టిఫికేట్ ప్రకారం రూ.30,87,581/- (రూపాయలు ముప్పై లక్షల ఎనభై ఏడు వేల అయిదువందల ఎనభై ఒకటి మాత్రమే) తేది: 05.12.2023 నుండి ప్రభావితముగు @12.20% చొప్పున నిలిచి పోయిన మరియు భవిష్యత్ వడ్డీతో సహా, ఋణము తీరే వరకు మరియు రూ.48,725/- (రూపాయలు నలభై ఎనిమిది వేల ఏడు వందల ఇరవై అయిదు మాత్రమే) యొక్క ధరలు మీరు బకాయి పడినట్లు (జాయింట్‌గా మరియు విడివిడిగా/పూర్తిగా/పరిమితంగా) ఇందుమూలముగా ప్రకటించడమైనది.
2. కావున ఈ నోటీస్ స్వీకరణ నుండి 15 రోజులలోపుగా పైన తెలిపిన మొత్తాన్ని చెల్లించవలసినదిగా ఇందుమూలముగా మిమ్మల్ని ఆదేశించడమైనది. విఫలమైతే 1993, బ్యాంక్‌లు మరియు ఆర్థిక సంస్థల చట్టం మరియు దాని క్రింద నిబంధనలు అనుసరిస్తూ ఋణబకాయిల రికవరీ చేయబడుతుంది.
3. కావున తదుపరి హియరింగ్ యొక్క తేదీన లేదా అంతకుముందు మీ ఆస్తుల యొక్క పూర్తి వివరాలతో ఒక అఫిడవిట్ ప్రకటించవలసినదిగా ఇందుమూలముగా మిమ్మల్ని ఆదేశించడమైనది.
4. తదుపరి చర్యల నిమిత్తం ఈ క్రింది సంతకందారుని ఎదుట 27.01.2026 ఉ.10.30గం. వద్ద హాజరు కావలసినదిగా మిమ్మల్ని ఇందుమూలముగా ఆదేశించడమైనది.
5. పైన పేర్కొనబడిన మొత్తానికి అదనంగా మీరు ఇవి కూడా చెల్లించవలసిన బాధ్యత ఉన్నది. (ఎ) సర్టిఫికేట్/అమలు చేయుప్రొసీడింగ్స్ యొక్క ఈ నోటీస్ తర్వాత వెనువెంటనే ప్రారంభమయ్యే కాలానికి చెల్లించవలసిన అటువంటి వడ్డీలు. (బి) బకాయి మొత్తం వసూలు చేసుకొనుటకు అన్ని ఇతర ప్రొసీడింగ్స్ చేపట్టుటకు మరియు ఇతర ప్రొసెస్‌లు, వారెంట్లు మరియు ఈ నోటీస్ సర్వీస్‌కు సంబంధించిన అయిన అన్ని ఛార్జీలు, ధరలు మరియు వ్యయములతో చెల్లించవలెను.
29.12.2025: ఈ తేదీన ట్రిబ్యునల్ యొక్క సీల్ మరియు నా సంతకం క్రింద జారీ చేయడమైనది.
సం/-. రికవరీ అధికారి,
ఋణాల రికవరీ ట్రిబ్యునల్, హైదరాబాద్ (DRT 1)



pnb Housing Finance Limited — Ghar Ki Baat
అనుబంధం-IV-A ఇ-వేలం-స్థిరాస్తులు యొక్క బహిరంగ అమ్మకపు ప్రకటన
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ...
నమోదిత కార్యాలయం: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22 కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూఢిల్లీ- 110001, ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com
B.O.: బంజారాహిల్స్ : 4వ అంతస్తు ... రోడ్ నం.2, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034
[illegible]

| [illegible] | [illegible] | [illegible] | రిజర్వు ధర (RP) (E) | బయానా (RP యొక్క 10%) (F) | బిడ్ సమర్పించు చివరి తేదీ (G) | బిడ్ ఇంక్రిమెంట్ | తనిఖీ తేదీ మరియు సమయం | వేలం తేదీ మరియు సమయం | తెలిసిన ఋణభారాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| HOU/HYD/0623/1125413 | [illegible] | 91,75,523.04 తేది 8-11-2024 | రూ. 85,59,000 | రూ. 6,55,900 | 27-01-2026 | రూ. 20,000 | 16-01-2026, ఉ.11 గం. ... | 28-01-2026, మ.02 గం. ... | తెలియదు |

[illegible]
ఇతర వివరాల కొరకు M/s. Foreclosureindia.com ... info@bankauctions.in ... మొబైల్ నంబర్: 9948562888/9392320800/8790120868/7428193765 టోల్ ఫ్రీ నెం.- 1800 120 8800.
స్థలం: హైదరాబాద్, తేది: 07.01.2026 — సం/- అధీకృత అధికారి, PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.


# పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పనకే విబి జి రామ్ జి

### ఎన్ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ జనరల్ డా.నరేందర్‌కుమార్

### విబి జి రామ్ జి చట్టంపై వార్తలాప్ వర్క్‌షాప్

**హైదరాబాద్(అత్తాపూర్) జనవరి 6, ప్రభాతవార్త:** గ్రామీణ స్థాయిలో ఉపాధి, పాఠశాల, అంగన్ వాడీ, ఆస్పత్రుల బలోపేతంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే విబి- జి రామ్ జి చట్టం లక్ష్యంగా పెట్టుకుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ డైరెక్టర్ జనరల్ డా.నరేందర్ కుమార్ పేర్కొన్నారు. సమాచార,ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఐసిఎఆర్-నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ మేనేజ్‌మెంట్‌లో వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్(గ్రామీణ్) విబి-జి రామ్ జి చట్టంపై ఒకరోజు వార్తలాప్ మీడియా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ డైరెక్టర్ జనరల్ డా.నరేందర్ కుమార్, నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్ డా.గోపాల్ లాల్ ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వికసిత్ భారత్‌గా మారాలనే దేశం ఆకాంక్షకు అనుగుణంగా విక్షిత్ భారత్-2047 జాతీయ దార్శనికతను సాధించాడానికి విబి-జి రామ్ జి చట్టం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందిస్తుందని అన్నారు. గ్రామీణ పంచాయతీలను జాతీయ అభివృద్ధి ప్రాధాన్యతలతో అను సంధా నించడం ద్వారా, విజి - జి రామ్ జి చట్టం ఉపాధిని సృష్టించడంలో, స్థిరమైన సమ్మిళిత గ్రామీణ అభివృద్ధిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్ గోపాల్ లాల్ మాటా డుతూ...సంస్థాగత సంస్కరణలను హైలెట్ చేస్తూ, ఈ చట్టం పంచాయతీ రాజ్ సంస్థల మూడు అంచెలను అధికారికంగా చేర్చడం ద్వారా వికేంద్రీకృత ప్రణాళిక , పర్యవే క్షణను బలోపేతం చేస్తుందని




సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ డైరెక్టర్ జనరల్ డా.నరేందర్ కుమార్ తదితరులు

కన్వరెన్స్, నాణ్యత జవాబుదారీతనాన్ని నిర్ధారించడానికి మెరుగైన జిల్లా స్థాయి పర్యవేక్షణలో ఉందని ఈ చట్టం రాష్ట్రాలకు నియమ ఆధారిత నియమబద్ధ కేటాయింపులను కూడా పరిచయం చేస్తుంది. పిఐబి డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణ కాంత్ ఖచ్చితమైన సమాచారాన్ని వ్యాప్తి చేయడంలో జర్నలిస్టుల పాత్రను నొక్కి చెప్పారు.

విబి- జి రామ్ జి మునుపటి ఎంజిఎన్ఆర్ఈజిఎ చట్టాన్ని పలుచన చేయడం కాదని, మెరుగైన ఫలితాల కోసం ఉద్దేశించిన కోర్సు దిద్దుబాటు ,మెరుగుదలని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో జర్నలిస్టులు, నార్మ్ ఎం,సిట పిఐబి గాయత్రి, సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మైనస్ 1.16 శాతం ద్రవ్యోల్బణం

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** తెలంగాణలో ద్రవ్యోల్బణం రేటు మైనస్ 1.16 శాతంగా నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా వినియోగదారుల ధరల సూచిక మేరకు భారతదేశ జాతీయ రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 వద్ద ఉంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ ఒక ప్రత్యేకమైన ధోరణిని ప్రదర్శించింది. తాజా డేటాలో రాష్ట్రం ద్రవ్యోల్బణ రేటు 1.16 (ప్రతి ద్రవ్యోల్బణం)ను నివేదించింది. ఇటీవలి నెలల్లో అనేకసార్లు ప్రతి ద్రవ్యోల్బణ జోన్‌లోకి ప్రవేశించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రికార్డయింది. జూన్‌లో 0.93 తో ప్రారంభమైన ప్రతి ద్రవ్యోల్బణ దశ, జూలైలో 0.44 తో కొనసాగింది, ఆగస్టులో 0.94 ద్రవ్యోల్బణంతో స్వల్ప కోలుకుంది. అయితే సెప్టెంబర్‌లో మళ్ళీ 0.15 ప్రతి ద్రవ్యోల్బణానికి పడిపోయింది. ప్రధానంగా గ్రామీణ తెలంగాణలో 0.29 ప్రతి ద్రవ్యోల్బణం నమోదైంది, అయితే పట్టణ తెలంగాణలో అది 0.05 నమోదైంది, రెండూ జాతీయ సగటు కంటే చాలా తక్కువ (ఈ నెల భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం 1.54)గా ఉంది. ఈ విధంగా రాష్ట్రంలో ప్రతి ద్రవ్యోల్బణం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో దాని ప్రభావం ఆర్థిక వత్తిడిపై చూపుతుందనే ఆందోళన ఆర్థిక శాఖ అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది.

## కొత్తగా యూరియా కార్డు

### యాప్‌కు ప్రత్యామ్నాయ చర్యలు

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** యూరియా సరఫరా విషయంలో వ్యవసాయ శాఖ మరో కొత్త విధానాన్ని తెరముందుకు తెస్తోంది. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన అధికారులు, దాంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో దానికి ప్రత్యామ్నాయంగా మరో కొత్త పద్ధతిని తీసుకొస్తోంది. కొత్తగా పంటల నమోదు, సమగ్ర ఎరువుల యాజమాన్య పత్రం ద్వారా యూరియా అందచేయాలని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ కార్డు ఉంటేనే రైతులకు యూరియాను అందచేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యం లోనే రాష్ట్రంలోని సిద్దిపేట్ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా చేసుకుని యూరియా కార్డులను రైతులకు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు యూరియా కార్డులు ఇస్తున్నారు. ఈ కార్డుతో పాటు, పాస్ పుస్తకం, ఆ ధార్ కార్డు తీసుకొచ్చినట్లయితేనే యూరియా ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఇప్పుడు యూరియా కార్డుల కోసం రైతులు అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు. ప్రతీ క్లస్టర్ వద్ద బారులు తీరుతూ యూరియా కార్డుల కోసం పడిగాపులు పడుతున్నారు. రైతుల పేరు, ఫోన్ నెంబరు, ఊరు పేరు, ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకం నెంబరు, సాగు విస్తీర్ణం తదితర వివరాలను తీసుకుని, వాటి ప్రకారం సంబంధిత రైతుకు ఏ మేరకు యూరియా ఇవ్వాలనేది అధికారులు నిర్ణయిస్తున్నారు. ఒకసారి యూరియా తీసుకుంటే మళ్లీ పదిహేను, ఇరవై రోజుల తర్వాతే రెండోసారి తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు.

## గంజాయి స్మగ్లింగ్ చేస్తూ ఈగల్ పోలీసులకు పట్టుబడిన బాలుడు.. పది కిలోల గంజాయి జప్తు



బాలుడి నుంచి జప్తు చేసిన గంజాయి.

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** డ్రగ్స్ స్మగర్లు తమ దందాలో మైనర్లను వాడడం మరింత పెరిగింది. రైళ్లలో, బస్సుల్లో పెద్ద వారు డ్రగ్స్ త రలిస్తున్న తరుణంలో పట్టుబడుతున్న ఉదంతాలు ఎక్కువవుతుండడంతో స్మగ్లర్లు ఇందులో తరచూ బాలలను దించుతున్నారు. ఇలాంటి ఘటనే మ రొకటి హైదరాబాద్‌లో వెలుగు చూసింది. మహారాష్ట్రలోని థానే జిల్లా భివాండి కామత్‌ఘర్‌కు చెందిన 17 ఏళ్ల బాలుడు అదే ప్రాంతంలో టెంపో క్లీ నర్‌గా ముంబాయికి చెందిన హాజి షఫియుల్లా షేక్ అనే వవ్యక్తి దగ్గర పనిచేస్తున్నాడు. ఇతని ఆర్థిక పరిస్థితి బాగాలేదు. కుటుంబ పోషణ కష్టంగా వుండడంతో తన యజమాని షేక్ సూచనల మేరకు గంజాయి స్మగ్లర్‌గా మారాడు. ఈ క్రమంలో షేక్ తన అత్త అయిన కాలాతో పాటు తనకు తెలిసిన మెహ్ఫూజ్ అనే మరో వ్యక్తితో కలిసి ఒడిషా నుంచి భారీగా గంజాయిని పలుమార్గాలలో ముంబాయికి తరలిస్తున్నాడు. తాజాగా ఈ గోల్‌మా ల్ దందాలో తన వద్ద క్లీనర్‌గా పనిచేస్తున్న బాలుడిని రమ్మన్నాడు. రెండు రోజుల పాటు తనతో వస్తే 1500 రూపాయలు ఇస్తానని చెప్పాడు. ఇం దులో భాగంగా సోమవారం సాయంత్రం షేక్ బేగంపేట్ సమీపంలోని నేచర్ క్యూర్ ఆసుపత్రి రైల్వే స్టేషన్ వద్దకు ఆ బాలుడిని రమ్మని పిలవగా అ తను వచ్చాడు. ఈ సమయంలో షేక్ తన వద్ద వున్న పది కిలోల గంజాయి ప్యాకెట్లను అతనికి ఇచ్చి రైల్లో ముంబాయికి వెళ్లి అక్కడ తన మనుషులకు దీనిని అప్పగించాలని కోరాడు. ఇందుకు సదరు బాలుడు అంగీకరించాడు. అయితే ఈగల్ పోలీసులు దీనిపై పక్కా సమాచారం అందుకుని ఇదే రైల్వే స్టేషన్‌లో గంజాయితో వున్న బాలుడిని పట్టుకుని అతని వద్ద వున్న గంజాయిని, ఒక సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. దీని విలువ ఐదు లక్షల రూపాయలుగా తేలింది. ఈ సమయంలో షేక్ పారిపోయాడు. అతని కోసం అతనితో పాటు వున్న మిగతా ఇద్దరి కోసం ఈగల్ పోలీసులు గాలిస్తున్నారు.

## సైబర్ నేరాలను నివారించిన సైబర్ వారియర్లకు సన్మానం

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలలో సైబర్ నేరాల నివారణకు కృషి చేయడంతో పాటు బాధితులకు అండగా నిలిచినందుకు జిల్లాల స్థాయిలో వుండే సైబర్ క్రైం పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న 22 మంది పోలీసులను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టి జిసిఎస్‌బి) మంగళవారం సన్మా నించింది.

డిజిపి కార్యాలయంలో ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఏడాది మూడు నెలలకు ఒకసారి సైబర్ పోలీసు స్టేషన్లలో పనిచేసే అధికారులు, సిబ్బందిని టిజిసిఎస్‌బి సన్మానించడం రెం డేళ్లుగా జరుగుతోందని, ఇందులో భాగంగా గత ఏడాది చివరి త్రైమాసికానికి సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరచిన 22 మందిని సన్మానించామ ని ఆయన తెలిపారు. వీరంతా తమ తమ ప్రాంతాలలో సైబర్ నేరాల నివారణకు విశేషంగా కృషి చేశారని, దీంతో పాటు ఎన్‌సిఆర్‌పి పిటిషన్ల ప రిష్కారంలో చొరవ చూపారని ఆమె తెలిపారు.



దీంతో పాటు సైబర్ నేరగాళ్లపై వున్న వారంట్ల అమలుకు కృషి చేశారని ఆయన తెలిపారు. సన్మానాలు అందుకున్న వారు భవిష్యత్తులో మరింతగా కష్టపడి పోలీసు శాఖ పేరు ప్రతిష్టలను పెంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిజిసిఎస్ బి డైరక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జనసేన కమిటీల రద్దు

### వీటి స్థానంలో అడ్ కమిటీల ఏర్పాటు

### త్వరలో సంస్థాగతంగా పార్టీ బలోపేతం

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త :** తెలంగాణలో జనసేన పార్టీ అధిష్టానం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం పార్టీకి సంబంధించిన ఉన్న జనసేన, వీరమహిళ, యువజన, విద్యార్థి కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో రద్దు చేసిన కమిటీల స్థానంలో అడ్ హాక్ కమిటీలను నియమిస్తూ అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించి జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు పవన్ కల్యాణ్ సూచనల మేరకు కమిటీల్లో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. కాగా ఐదుగురు సభ్యులతో అడ్‌హాక్ కమిటీను ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. అలాగే జీహెచ్ఎంసీ, వీరమహిళ, యువజన, విద్యార్థి విభాగ కమిటీలను రద్దుచేసి, వాటి స్థానంలో కొందరు సభ్యులతో తాత్కాలికంగా అడ్ హాక్ కమిటీలను నియమిస్తున్నట్లు వెల్లడించింది. ఈ అడ్ హాక్ కమిటీలు 30 రోజులపాటు పని చేస్తాయని, ప్రతి నియో జకవర్గం, జీహెచ్ ఎంసీ పరిధిలో ఉన్న 300 వార్డుల్లో కమిటీలు పర్యటించి ఐదుగురు సభ్య లతో జాబితాను సిద్ధం చేసి పార్టీ కార్యా లయం దృష్టికి తీసుకు రానున్నట్లు వివరిం చింది. త్వరలోనే పార్టీని సంస్థా గతంగా బలోపేతం చేసేలా నూతన కమిటీలను ప్రకటిస్తామని పేర్కొంది. జనసేన తీసుకున్న ఈ నిర్ణయంతో తెలంగాణలో కొత్త జోష్ వస్తుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. పవన్ నాయకత్వంలో తెలంగాణలో జనసేన పార్టీ మరింత చురుకుగా ముందుకు సాగుతుందని కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం
ఫారం-VII
(చట్టం -30/2013 యొక్క సెక్షన్-19(1) మరియు నిబంధన-25 యొక్క ఉప-నిబంధన (1) చూడండి)
లేదా
కలెక్టర్/జాయింట్ కలెక్టర్/స్పెషల్ కలెక్టర్ (LA)/SDC (LA)
ప్రకటన

గెజిట్ నెం. GHMC-53 — తేది: 19.12.2025
నెం. B/464/2024 — తేది: 19.12.2025

ఇది ఇలా ఉండగా హైదరాబాద్ జిల్లా, షేక్‌పేట్ మండలం, మరియు షేక్‌పేట్ గ్రామంలోని-8225.99చ.గజాల మొత్తం భూమి ప్రతిపాదిత 100'-00" మరియు 120'-0" వెడల్పు రోడ్, రోడ్ నం.12, బంజారాహిల్స్ జంక్షన్ 1 & 2 నుండి (విరించి ఆసుపత్రి) KBR పార్క్ వయా వెంకట్ పోస్ట్ జుబ్లీ హిల్స్‌కు అవసరమైఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/స్పెషల్ కలెక్టర్, LA మరియు కమిషనర్ GHMC హైదరాబాద్ వారు భావించారు.
అందువలన హైదరాబాద్ జిల్లా, షేక్‌పేట్ మండలం మరియు షేక్‌పేట గ్రామంలోని పైన పేర్కొనబడిన ప్రాజెక్ట్ కొరకు ప్రామాణిక కొలత యొక్క 8225.99చ.గ. ఎక్కువ లేదా తక్కువ భూమి ప్రకటించబడింది. సేకరణ నిమిత్తం ప్రతిపాదించబడిన సవివర వివరణ ఈ క్రింది విధంగా ఉంది.

| క్ర. సం. | TS నం. | వార్డ్ | బ్లాక్ | టైటిల్ యొక్క రకం | భూమి యొక్క రకం | విస్తీర్ణం చ.గ. లలో | ఆసక్తి గల వ్యక్తి యొక్క పేరు మరియు చిరునామా | సరిహద్దులు: ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు: రకం | సంఖ్య | నిర్మాణములు: రకం | ప్లింత్ ఏరియా |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 1/5 | G | 9 | ప్రభుత్వ | బంజారా హిల్స్ గుట్ట | 227.11 | దొరస్వామి 8-2-293/82/JIII/565/D | రోడ్ | యజమాని భూమి | 8-2-293/82/JIII 565/C | ప్లాట్ నం. 560/A | - | - | షెడ్ | - |
| 2–36 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| 37 | 2/3 | C | 9 | ప్రభుత్వ | బంజారా హిల్స్ గుట్ట | 387.66 | ఎస్.బాలకృష్ణ ప్లాట్ నం. 1355 | యజమాని భూమి | రోడ్ | రోడ్ | పొరుగు వారి భూమి | | | కట్టడాలు | |
| 38 | 2/4 | C | 9 | ప్రభుత్వ | బంజారా హిల్స్ గుట్ట | 274.55 | ఎ.సుధాకర్ ప్లాట్ నం. 1354 | రోడ్ | పొరుగు వారి భూమి | రోడ్ | యజమాని భూమి | | | బహిరంగ భూమి | |
| 39 | 10/2 | H | 10 | ప్రైవేట్ | [illegible] | 130.55 | హితేష్ ప్లాట్ నం. 23 | యజమాని భూమి | రోడ్లు | రోడ్ | పొరుగు వారి భూమి | | | బహిరంగం మరియు కట్టడాలు | |
| | | | | మొత్తం | 8225.99 | | | | | | | | | | |

చట్టం నం.30/2013 యొక్క 15 సెక్షన్ క్రింద ఏర్పాటు ప్రకారం ఆసక్తి గల వ్యక్తుల అభ్యంతరాలు విన్న తర్వాత మరియు తగిన విచారణ తర్వాత ఈ ప్రకటన చేయడమైనది. భూసేకరణ కారణంగా పునరావాసం పొందవలసిన కుటుంబాల సంఖ్య - నిల్ -
బొగ్గు, ఇనుప-రాయి, పలక గనులు లేదా సదరు భూమి క్రింద వున్న ఇతర ఖనిజాలు లేదా సదరు భూమి యొక్క ఏ ప్రత్యేక భాగమైనా, త్రవ్వవలసిన లేదా తొలగించవలసిన అవసరం వున్న గనులు మరియు ఖనిజాలు యొక్క అటువంటి భాగాలు తప్ప లేదా దేనికైతే భూమి సేకరించబడుతోందో ఆ ప్రయోజనం కొరకు ప్రాజెక్ట్ నిర్మాణ దశలో ఉపయోగించినవి తప్ప అవసరం లేదు.
భూమి యొక్క ప్లాన్‌ను, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA) యొక్క కార్యాలయంలో, GHMC 6వ అంతస్తు, GHMC ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్ వద్ద ఏ పని రోజునైనా పని వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును.
గమనిక: వర్గీకరణగా ప్రభుత్వ భూమి అయినా, ప్రభుత్వం క్రింది Go లను అనుసరించి ఈ ప్రభుత్వ భూమిని కేటాయించింది.
i) Go Ms. No.: 147 ప్రకారం, షేక్‌పేట్ గ్రామం యొక్క సర్వే నం: 403లో భూమి యొక్క 1195 ఎకరాల విస్తీర్ణం మరియు హకీంపేట గ్రామం యొక్క సర్వే నం. 102లో 203 ఎకరాల యొక్క విస్తీర్ణం, ఎకరం ఒక్కంటికి రూ.200/- వద్ద మార్కెట్ విలువ చెల్లింపుపై జూబిలీ హిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకు రెవిన్యూ డిపార్ట్‌మెంట్ తేది: 31.01.1964 కేటాయించింది.
ii) ఆతర్వాతదిగా, GO RT No: 41 ప్రకారం, హౌసింగ్, మునిసిపల్, మరియు అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ తేది: 9-3-1979, జూబ్లీ హిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ యొక్క మిగులు భూమిని 1) జర్నలిస్ట్ సొసైటీ: 25 ఎకరాలు 2) లేజిస్లేచర్స్ యొక్క కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ : 100 ఎకరాలు 3) ఫిల్మ్‌నగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ : 100 ఎకరాలు బదిలీ చేయవలసినదిగా ప్రభుత్వం సూచించింది.
తదుపరి సొసైటీచే ఆస్తుల యొక్క బదిలీ నిర్వర్తించబడింది మరియు పై పార్టీలకు అనుకూలంగా కేటాయించబడ్డమైనది.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, LA, GHMC, హైదరాబాద్ — సం/-. స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్
DIPR RO.NO: 992/LA/PP/Advt/Agency/2025-26


జ్ఞాపకాలతో బతికేవాడు వృద్ధుడైపోతాడు, భావి పథకాలతో జీవించేవాడు యువకుడిగానే ఉంటాడు.

-హాబ్స్

# వరిసాగులో రారాజు మనమే

వరి సాగులో భారత దేశం చైనాను దాటేసింది. వరి ధాన్యం ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే నంబర్ 1స్థాయిని సాధించింది. దీంతో భారత్ ప్రపంచ ఖ్యాతిని అర్జించినట్లయింది. మొత్తంగా100 కోట్ల టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తితో ఘనత సాధించింది. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఎంతో గర్వంగా వెల్లడించారు నూతన వంగడాల ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఈ విషయా న్ని ప్రకటించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అధ్వర్యంలో రూపొందించిన 25 పంటలకు సంబంధించి 154 రకాల అధిక దిగుబడి విత్తనాలను ఆయన విడుదల చేశారు. ఆహార కొరతతో ప్రారంభమైన భారత దేశ ధాన్య సమీకరణ ప్రపంచానికే ఆహారమం దించే స్థాయికి చేరింది. "వరి ఉత్పత్తిలో భారత్, చైనాను అధిగమించింది. ప్రపంచంలోనే అత్యధిక వరి ఉత్పత్తి దారుగా ఎదిగిన వైనాన్ని ఆయన విశదీకరించారు. చైనా 14.52 కోట్ల టన్నుల వరిని ఉత్పత్తులను సాధించగా చేయగా,భారత్ 15.01 కోట్ల టన్నులను ఉత్పత్తి చేసింది అంతర్జాతీయ మార్కెట్లకు భారత్ నుంచి బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నాం. దేశంలో సమృద్ధిగా బియ్యం నిల్వలు ఉన్నాయి.ఈ కొత్త విత్తనాలతో దిగుబడులను మరింతగా పెంచుకోవాలని భారత వరి పరిశోధకుల తాపత్రయం. భారత్‌లో దాదాపు 60 వేల వరి రకాలున్నాయని ప్రతీతి. ఇంత వరకు 7205 రకాల విత్తనాలు రూపొందించినట్లు లెక్కలు నమోదైనాయి. 1969 నుంచి 2014 వరకు 3,963 విత్తనాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం హయాంలోనే 3236 అధిక దిగుబడి విత్తనాలను మార్కెట్ కు విడుదల చేశారు. 2024 -25లో బియ్యం ఉత్పత్తి బాగా పెరిగింది. కానీ ఇప్పుడు బియ్యం ఉత్పత్తిలో 152 మిలియన్ మెట్రిక్ టన్నుల దిగుబడులను సాధించి చైనాను వెనక్కి నెట్టిందన్న విషయం ఎంతో గర్వంగా ఉంది. ఇదే సమయంలో చైనా 146 మిలియన్ మెట్రిక్ టన్నుల వద్దే ఆగిపోయింది. దీంతో ప్రపంచ ఉత్పత్తిలో భారత్ 28 శాతం వాటా సాధించినట్లయింది. 172 దేశాలకు భారత్ బియ్యం ఎగుమతి అవు తున్నది. బాసుమతి, బాసుమతేతర బియ్యాన్ని భారత్ ఉత్పత్తి చేస్తోంది. భారత్ అత్యధిక బియ్యం ఉత్పత్తిలో చైనాను దాటడం వెనుక తైవాన్ వంగడాల పాత్ర కూడా ఉందని స్పష్టంగా చెప్పుకోగలం. చైనాకు ప్రధాన శత్రువు తైవాన్ సహకారం భారత్ తీసుకోవడం ఆ దేశానికి ఆగ్ర హానికి కారణమైంది. ఉంది. ఏదిఏమైనా జీరోనుంచి ప్రపంచ రికార్డు స్థాయిలో అత్యధిక ఉత్పత్తి సాధించడం భారత్ కు గర్వ కారణమే! స్వాతంత్రం వచ్చినప్పుడు భారత్ అమెరికా వద్ద గోధు ములు పీఎల్ 480 పథకం క్రింద దిగుమతి చేసుకునేది.మొదటి హరిత విప్లవంతో ఆహార భద్రతను సాధించిన ఇండియా అనేక వ్యవసాయ సంస్కరణలతో ఇప్పుడు మిగులు బియ్యం ఉత్పత్తి చేయగలుగుతోంది. తొలినాటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికే పెద్దపీట వేసారు. రెండో ప్రణాళికలోపారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత కల్పించారు. కాని మూలధనం కొరత తదితర అంశాల వల్ల అది అనుకున్న లక్ష్యాలను సాధిం చలేదు.అలాగే వ్యవసాయ ఉత్పత్తి కూడా ఆశించినంతగా పెరగలేదు.దాంతో మళ్లీ వ్యవసాయానికిమూడో పంచవర్ష ప్రణాళిక లో ప్రాధాన్యత ఇచ్చారు. భారీ నీటి పారుదల ప్రాజెక్టులు నాగార్జునసాగర్, భాక్రానంగల్ ప్రాజెక్టులు నెలకొల్పారు.దాంతో సాగునీటి పారుదలపెరిగి పంటలు వేసే విస్తీర్ణం పెరిగింది. సాంప్రదాయ సాగు నుండి రైతు సేంద్రీయ సాగు వరకు ఎన్నో మజిలీలు దాటాడు.లాల్ బహదుర్ శాస్త్రి హయాంలో కూడాఆహార కొరత తీవ్రంగా ఉండేది.పాకిస్తాన్ యుద్ధం కూడా భయపెట్టింది. అప్పట్లో ప్రజలను చైతన్యం చేయడానికి జైజవాన్, జై కిసాన్ అనే నినాదంతో అటు సైనికులకు, మరో వైపు అన్నదాతలకు స్ఫూర్తినిచ్చారు. వ్యవసాయ విధానం ప్రయోగశాలలకే పరిమితమైంది.అధిక దిగుబడుల నిచ్చేవంగడాల కోసం పరిశోధనలు ప్రారంభమైనాయి. ప్రధానిగా శ్రీమతి ఇందిరా గాంధీ పాలనలో వ్యవసాయ ఉత్పత్తులను పెంపు స్వయం సంవృద్ధి లక్ష్యాలసాధనకు అవసరమైన చర్యలు చేపట్టారు. వ్యవసాయ పరిశోధనలకు, వరి,ఇతర పంటల అధిక దిగుబడినిచ్చే వంగడాల రూపకల్పనకు ప్రోత్సాహం కల్పించారు. రసాయనిక ఎరువులు,పురుగు మందుల ఉత్పత్తి మనమే చేరుకోగలిగాము. ప్రయోగాత్మకంగా అధిక దిగుబడినిచ్చే వంగడాలను సాగు చేసారు.అదే హరిత విప్లవానికి శ్రీకారం చుట్టింది. రైతులకు సహకార సంఘాలు ద్వారా స్వల్పకాలిక రుణాలు,భూమి మరమ్మతు చేయడానికి దీర్ఘకాలిక రుణాలు మంజూరు ప్రారంభించారు. దాంతో భారత్ క్రమంగా ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించడం ప్రారంభించింది. భారత ఆహారసంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో లెవీ ద్వారా రైతులనుంచి వరి,ఇతర ఆహారధాన్యాలు సేకరించి నిల్వ చేయడంలో ఆహారసమృద్ధి సాధించాము. మూడేళ్ల పాటు ధాన్యాలను నిర్వహించే ప్రక్రియకు అంకురార్పణ జరిగింది. దేశంలో ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినా తట్టుకునే స్థాయికి దేశం చేరుకుంది. గత ఏడాది భారత్ రూ.4.5 లక్షలకోట్ల ఆహారం ఉత్పత్తులను ఎగుమతి చేసింది. భారత్ దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వర్గాలకు నెలకు ఐదు కిలోల ఉచిత బియ్యం సరఫరా చేయగలుగు తోంది.భారత్ అత్యధిక బియ్యం ఉత్పత్తిలో మొదటి స్థానం సాధించింది సరే! మరి అన్నదాత సంక్షేమంలో ఎందుకు అంతంత మాత్రంగానే ఉంది. ఇప్పుడున్న ' రైతు భరోసా'లన్నీ రైతును ఆత్మహత్యల వైపు మరలకుండా ఆపగలిగితే అంతే చాలు.

అదను తెలిసి వ్యవహరించటమంటే ఎంతో శ్రమను, సమయాన్ని, వ్యయాన్ని ఆదా చేయటమే.



ఆస్కార్ వైల్డ్

ఏదైతే మిమ్మల్ని శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా బలహీనులుగా చేస్తుందో దాన్ని విషంలాగా వదలిపెట్టండి.



స్వామి వివేకానంద

# ప్రజావాక్కు



### మందుల ధరలు తగ్గించాలి

రోగం మనిషిని శారీరకంగా మాత్రమే కాకుండా ఆర్థికంగా కూడా దెబ్బతీస్తుంది. ఆ బలహీనతనే లాభంగా మార్చుకునే వ్యవస్థలు ఉన్నంతకాలం ఆరోగ్యం అనే భావన మాటలకే పరిమితం అవుతుంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఔషధ వ్యాపారంలో అక్రమ లాభాల వ్యవహారం కొన్ని మందులపై వెయ్యి ఎనిమిది వందల శాతం వరకు లాభం వసూలు చేస్తున్నారన్న వాస్తవం మన ఆరోగ్య వ్యవస్థలోనిదోపిడీని బయటపెట్టింది.ఔషధధరల నియంత్రణకు చట్టాలు ఉన్నప్పటికీ అవి ప్రజల రక్షణకు సరిపడేలా అమలవడం లేదు.ధరల నియంత్రణ,లాభాల పరిమితి, పంపిణీ పర్యవేక్షణ అన్నీకాగితాలకే పరిమితమయ్యాయి. తయారీదారుడి నుంచి చిల్లర విక్రేత వరకు ప్రతి దశలోలాభాలు పెంచుకుంటూ చివరికి రోగిజేబుపై భారాన్ని మోపుతున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

ఇటీవలి కురిసిన భారీ వర్షాలకు గ్రామీణ ప్రాంత రోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో పొలాల నుండి భారీగా కురిసిన వర్షపునీరు రోడ్లపై నుండి ప్రవహించి రోడ్లుకోతకు గురైయ్యాయి.ఈపరిస్థితుల్లో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి.అదేవిధంగా రోడ్ల వెంట కంపచెట్లుపెరిగివాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు గ్రామీణ ప్రాంతాలలో ప్రమాదకరంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలి.

- టి. యోగేందర్, మిర్యాలగూడ, నల్గొండ జిల్లా

### ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలఈమధ్య తమసీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. తక్కువ జీతంలో కొత్త వారిని తీసుకుంటున్నారు. దాదాపు మధ్య వయసునకు చేరిన వీరికి మరల ఉద్యోగాలు దొరకడం బహు దుర్లభం.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

### అమెరికా గొంతులో వెలక్కాయ

అమెరికాకు ఆధిపత్యం కావాలి. తన తరవాతి లక్ష్యం మెక్సికో నమిబియా క్యూబాలే ఎందుకు?అవి వామపక్ష భావజాలం కలిగిన ప్రభుత్వాలు నడుపుతున్నాయి.హ్యూగో చావేజ్ పరిపాలనలో వెనిజులాలోసంస్థలన్నింటిని జాతీయం చేయడం అమెరికాకు రుచించలేదు. ఎందుకంటే అమెరికా సంస్థలు ఆ దేశాలపైన ఆధిపత్యం చూపించలేకపోతున్నాయి. అమెరికాకు 30300 కోట్ల బ్యారెల్ ఆయిల్ వెనిజులాలో ఉంది. ఇక అంత మాత్రమే కాదుబంగారం సహజవాయువు నిక్షేపాలుకూడా అక్కడ ఉన్నాయి. కాబట్టి అవన్నీ వాళ్ళకు కావాలె ఎట్లాగయితే హ్యూగో చావేజ్ పరిపాలన సాగిందో అదే విధంగ మదురో పాలన కూడా సాగడం అమెరికాకు గొంతులో వెళక్కాయ పడినట్టు అయింది. ఇప్పుడు మధురోను ఎత్తుకెళ్ళి దేశాన్ని అస్థిరపరిచి తమ చెప్పు చేతలో పెట్టుకోవడం వెనుక ఇలాంటి నేపథ్యమే.

- భారత అవినాష్, జనగామ

### నైతిక విలువలను కాపాడాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరవతరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు వచ్చే విద్యాసంవత్సరంలో మారనున్నాయని పత్రికల్లో ప్రకటనలు వస్తున్నాయి. పాఠ్యాంశాలు ఆర్ఎస్ఎస్, బిజెపి భావజాలాలకు అనుకూలంగా ఉండేలా ఉంటాయని వదంతులు వినిపిస్తూ ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో ప్రభుత్వం నడిపే ప్రతిపాఠశాలలో భగవద్గీతను ఒక పాఠ్యాంశంగా ప్రవే శపెట్టాలని అనుకుంటున్నట్టుగా వదంతులు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతూ ఉన్నాయి. అనైతిక లక్షణాలు కలిగిన పాలకులు చెప్పేవి పిల్లలపైప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. నైతిక ప్రవర్తన ప్రజలు ఎన్నుకున్న పరిపాలకులది బాగుంటే అసలు అలాంటి పాఠ్యాం శాలు అవసరమే ఉండదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### భవిష్యత్తుకు ప్రమాదం

భారత ఐటీ రంగం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, వీసాలపై అధికఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభను ప్రదర్శించి స్థానిక స్థాయిలో స్టార్ట్ అప్స్‌ను స్థాపిస్తే, దేశీయ ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మన స్థానం బలపడుతుంది.

-సి.హెచ్.సాయిరిత్విక్, నల్గొండ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రమాదాలూ, పరిహారాలూ!

**ఢిల్లీ హైకోర్టు మోటారు యాక్సిడెంట్ క్లయిమ్స్ వార్షిక డిపాజిట్ మోడల్ ప్రకారం పోలీసు, హాస్పిటళ్లు, బ్యాంకుల అనుసంధానం వల్ల త్వరితగతిన సాంకేతిక నిపుణులతో పరిహారాలు చెల్లించబడుతున్నాయి. ఇది పరిగణనలోకి తీసుకొని ఒకే విధమైన ప్రణాళిక ఈ ప్రమాదాల చెల్లింపు విషయంలో ప్రభుత్వాలు అమలు చేస్తే బాగుంటుంది. ఆలోచించే విషయంగా ఈ సూచన పరిగ ణనలోకి తీసుకోవాలి. ఏదిఏమైనా ఈ మధ్యన ప్రమాదాలు అటు రోడ్లపై కానీ, రైల్వే మార్గాలలో కానీ ఆకాశయానంలో కాని విరివిగా జరుగుతుండటం వల్ల ప్రాణనష్టంతోపాటు బాధితులకు అనేక రకాల నష్టాలు సంభవిస్తున్నాయి. అందుకనే కనీసం వారి నష్టాలను పరిగణనలోకి తీసుకొని పరిహారాలు సమ్యక్ దృక్పథంతో చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఇన్సూరెన్స్ వ్యవస్థలకూ ఉంది.**



రావులపాటి సీతారామారావు

ఒక మహాకవి ప్రతి చావూ నాలో ఒక అణువును చంపేసినట్లుగానే భావిస్తాను అని అనడం వెనుక విషాదంతోపాటు జీవిత పరమార్థం ఉంది. అకస్మాత్తుగా మనుషుల మరణాల వెనుక రోడ్డు ప్రమాదాలు ఒక ముఖ్య కారణంగా ప్రతి సంవత్సరం గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి. చట్టాలూ, న్యాయస్థానాలూ ఇన్సూరెన్స్ కంపెనీలు ఆ చావుల విలువను రూపాయిల్లో లెక్కించి పరిహారం రూపంలో ఆ మృతుల కుటుంబాలకు ఇవ్వటం ఒక ఆనవాయితీగా గుర్తించదగ్గ ప్రక్రియగా మారిపోయింది. రోడ్డు ప్రమాదాల్లో మరణించేవారికి పరిహారం రైల్వే ప్రమాదాల మరణాలు, విమాన ప్రమాదాల్లో సంభవించే వారి మరణాలతో పోలిస్తే చాలా తక్కువగా దక్కుతుంది. రైల్వే విమానాలు, రోడ్డు ప్రమాదాలను పోల్చడం ఎందుకంటే మరణించేవారు కానీ గాయపడ్డవారు కానీ మనుషులే!. మనుషులంతా ఒకటే. అందరి హక్కులూ సమానమే అని రాజ్యాంగం చెబుతున్నప్పుడు ఎందుకు రాజ్యాంగపరంగా ఉద్ఘాటించిన హక్కుల ప్రకారం అందరికీ సమానంగా ఈ ప్రమాదాల్లో పరిహారం దక్కటంలేదని చర్చనీయాంశంగా మారటమే కాదు సమస్య కొన్ని చోట్ల ప్రశ్నించటం, కోర్టులకు వెళ్లుంటాయి. సెక్షన్ 168 మోటార్ వెహికల్స్ యాక్ట్ 1988, ట్రిబ్యునల్స్‌కు పరిహారం నిర్ణయించే అధికారం ఇచ్చింది. న్యాయంగా తోచిన పరిహారం ఇవ్వమని ఆ అధికారం చెబుతుంది. సుప్రీంకోర్టు, నేషనల్ ఇన్సూరెన్స్‌పై కొందరు వ్యాజ్యాలు వేసిన సందర్భంగా మల్టి ప్లైయర్ విధానాన్ని అనుసరించి పరిహారం ఇవ్వాలని సూచించింది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు చట్టం, ఆదాయం ఏమిటో, పరిహారం ఇవ్వటానికి లెక్కలోకి తీసుకొని జీవితానికి వెలకట్టి ఈ ఫార్ములా ప్రకారం బాధితుడు మరణించిన వారి వార్షిక ఆదాయం మల్టీప్లై చేయబడి (వయసు ఆధారంగా) పరిహారం స్థిరీకరించబడుతుంది. కొన్ని స్టాండర్డ్స్ కాటగిరీస్‌గా బాధితులు విభజింపబడిన తర్వాత ఈ లెక్కించిన పరిహారం ఇవ్వబడుతుంది. అయితే చిక్కు సమస్యలు ఈ లెక్కల్లో తలెత్తక తప్పదు. బాధితుడికి వార్షిక ఆదాయం లేకపోతే ఊహాత్మక ఆదాయం ప్రకారం ట్రిబ్యునల్స్ మొక్కుబడి పరిహారం ఇవ్వటం సరికాదని చాలా మంది ఆలోచనాపరుల వాదన! అది నిజమేగా! అందరూ సమానమే అన్న రాజ్యాంగ మౌలిక సిద్ధాంతం ఒప్పుకున్నప్పుడు మరణాలు సంభవించినప్పుడు ఒక్కొక్కరికి ఒక్కొక్క లెక్క చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించడం ఎంతవరకు సబబు? సుప్రీంకోర్టు కూడా ఒక కేసులో ఇంటి చాకిరిని నిజమైన కూలిపనిగా గుర్తించి ఈ హెచ్చుతగ్గులను సరిచేసే ప్రయత్నం చేసింది. వ్యవస్థలు ఒక్కొక్కప్పుడు లెక్క ప్రకారం ఇచ్చే పద్ధతిని మూలసూత్రంగా పరిగణించి కూలి పని వారికి, కట్టడాల పనివారికి చదువుచెప్పే వారికి, ధనికులు ఆదాయ లెక్కలను పరిగణనలోకి తీసుకొని తక్కువ పరిహారం చెల్లించడం చేస్తున్నాయి. ఇన్సూరెన్స్ వారు కూడా



పొంతన లేని లెక్కలతో ఎక్కువ మందికి ఇలాంటి మరణాలు ముఖ్యంగారోడ్డు మీద మరణాలు సంభవించినప్పుడు చాలా తక్కువ పరిహారం దాదాపు పరిగణనలోకి తీసుకోటానికి పనికిరాని విధంగా చెల్లిస్తుండటం పెక్కు విమర్శలకు దారి తీస్తున్నది. ఆ విధంగా చేయటం సమానత్వం, గౌరవానికి భంగం కలిగించటమే! రాజ్యాంగ మౌలిక సూత్రం మానవులందరికీ సమాన హక్కులున్నాయని చెప్పటాన్ని ఉల్లంఘించటమే! రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పినప్పుడు ఎక్కువ జీతాలు ఉన్నవారికి ఎక్కువగా స్వయం ఉపాధి కల్పించుకున్న వారికి జీతభత్యాలు లెక్కలో ఉండని దినసరి కూలీకి ఇలాంటి సంఘటనలలో తక్కువగా పరిహారం ఇవ్వటం అందరూ చట్టం ముందు సమానులే అన్న రాజ్యాంగ సూత్రాన్ని ఏ విధంగా సమర్థించుకోగలం. జరుగుతుంది. ఆర్టికల్ 21 గౌరవ ప్రదంగా జీవించే హక్కును అందరికీ ప్రసాదించినప్పుడు ఈ విధమైన భేదపూరితమైన పరిహారాల నిర్ణయాలు ఎంతవరకు సమంజసం? పరిహారాన్ని ఆదాయంతో లెక్కిస్తే అందరూ చట్టం ముందు సమానులే అన్న సూత్రం కాగితాలకే పరిమితం కాక తప్పదు. ఇది ఒకటయితే, రైల్వే యాక్ట్ 1989 ప్రకారం మరణించిన ఏ ప్రయాణీకుడికైనా 8 లక్షలు ఇస్తుంటారు. క్యారేజ్ బై ఏర్ యాక్ట్ 1972 ప్రకారం ఎయిర్‌లైన్స్ చనిపోయిన ప్రతి ప్రయాణికుడిని సమానంగా పరిహారం చెల్లిస్తుంది. దురదృష్టవశాత్తు బాగా ఎక్కువగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో చిక్కిన వారికి మాత్రమే ఆదాయం పరిహారం విలువ అంచనా వేసే ముందు లెక్కలోకి తీసుకుంటుంటారు. మనిషిని మనిషిగా లెక్కించటం జరుగుతున్నప్పుడు రోడ్డా, విమానమా అన్నది పరిగణనలోకి తీసుకోకుండా సమానంగా ఒకే తీరున పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉందని అనుకోవటంలో తప్పులేదు. చట్టాల మాటున న్యాయాన్ని దాటేయడం కుదరదు. ప్రతి జీవితానికి గౌరవప్రదమైన విలువకు అర్హత ఉంది. పరిహారం చెల్లించటం మరణాల్లోనూ గాయాలు సంభవించినప్పుడు సమానంగానే ఉండాలి. వేరే విధంగా ఆదాయం, ధనిక జీవితాలను బట్టి లెక్కలు వేస్తే రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే అన్న దృఢమైన వైఖరి వ్యవస్థలు తీసుకొనేలా ప్రభుత్వపరంగా నిర్ణయాలు చట్టాల రూపంలో తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేగాకుండా ప్రమాదాల్లో డామేజీలకు కూడా సముచిత రీతిలో పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది. ద్రవ్యోల్బణం సామాజిక ఆర్థిక ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో సంభవించే ఎత్తుపల్లాలు కూడా సహజంగానే ఇలాంటి పరిహారాలు ఇవ్వాల్సి వచ్చినప్పుడు లెక్కలోకి తీసుకోక తప్పదు. కానీ అందరికీ చెల్లింపు మాత్రం సమానంగానే ఉండాలన్న ఏకైక మౌలిక సూత్రానికి తూట్లు పొడవకూడదు. ఢిల్లీ హైకోర్టు మోటారు యాక్సిడెంట్ క్లయిమ్స్ వార్షిక డిపాజిట్ మోడల్ ప్రకారం పోలీసు, హాస్పిటళ్లు, బ్యాంకుల అనుసంధానం వల్ల త్వరితగతిన సాంకేతిక నిపుణులతో పరిహారాలు చెల్లించబడుతున్నాయి. ఇది పరిగణనలోకి తీసుకొని ఒకే విధమైన ప్రణాళిక ఈ ప్రమాదాల చెల్లింపు విషయంలో ప్రభుత్వాలు అమలు చేస్తే బాగుంటుంది. ఆలోచించే విషయంగా ఈ సూచన పరిగణనలోకి తీసుకోవాలి. ఏదిఏమైనా ఈ మధ్యన ప్రమాదాలు అటు రోడ్లపై కానీ, రైల్వే మార్గాలలో కానీ ఆకాశయానంలో కాని విరివిగా జరుగుతుండటం వల్ల ప్రాణనష్టంతోపాటు బాధితులకు అనేక రకాల నష్టాలు సంభవిస్తున్నాయి. అందుకనే కనీసం వారి నష్టాలను పరిగణనలోకి తీసుకొని పరిహారాలు సమ్యక్ దృక్పథంతో చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఇన్సూరెన్స్ వ్యవస్థలకూ ఉంది. ●

# డ్యుయల్ డిగ్రీల్లో నైపుణ్యాలు ఏమేరకు?

ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి

నిన్నటి కంప్యూటర్ నానోయుగం దాటుతూ నేడు డిజిటల్ ఏఐయుగంలోకి వేగంగా అడుగులు వేస్తూ ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చాం. అంతర్జాల సంకేతాలుఅందని ప్రపంచ నరుడు కనిపించడంలేదు. వసుధైక కుటుంబ భావనలు విస్తరిస్తున్నాయి. యువత నైపుణ్య రెక్కలతో ప్రపంచమంతటా ఎగురుతున్నారు. ఒకే సబ్జెక్టను ఎంచుకొని చదవడానికి బదులుగా ఏకకాలంలో సమాంతరంగా రెండులేదా అంతకన్న ఎక్కువ కోర్సులు చేయడం సర్వసాధారణమైంది. విద్యా సంస్థల్లో సాంప్రదాయ కోర్సులు చేయడంతో పాటు ఆన్‌లైన్ కోర్సులు, ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రాల్లో కోర్సులు చేస్తూన్న నవ యువత తక్కువ సమయంలో ఎక్కువ కోర్సులుచేయడానికి యూజీసీ కూడా వెసులుబాటు కల్పించడం హర్షదాయకం. ఒకనాడు ప్రతి విద్యార్థి సీనియర్ సెకండరీ దశ తర్వాత తను ఎంచుకున్న సబ్జెక్ట్‌లో డిగ్రీ, పీజీ, పిహెచ్‌డి వరకు పూర్తి చేసి ఉద్యోగ ఉపాధులు పొందారు.నేటి పోటీ ప్రపంచంలో అదనపు అర్హతలు, అవసర నైపుణ్యాలు, విభిన్న అంశాల్లో పరిజ్ఞానాలు పొందడం లాంటి అవకాశాలకు రెక్కలు తొడుక్కుంటూ ఆకర్షణీయ ఉద్యోగ అవకాశాలను చేజిక్కించుకుంటున్నారు. కామర్స్ విద్యార్థి డాటా అనాలిసిస్, ఆర్ట్స్ విద్యార్థి డిజిటల్ నైపుణ్యాలు, ఇంజినీరింగ్ విద్యార్థి ఫైనాన్స్ మెనేజ్‌మెంట్ కోర్సులను ఏకకాలంలో చేయడం సర్వసాధారణం అయింది.ఏకకాలంలో రెండు లేదా అంతకన్న ఎక్కువ కోర్సులను చేయడాన్ని 'డ్యుయల్ డిగ్రీ' పద్ధతిగా యూజీసీ అనుమతించడం జరిగింది. యూజీసీ నియమనిబంధనల ప్రకారం ఏకకాలంలో రెండు ఫుల్‌టైమ్ కోర్సులు(వేరు వేరు టైం టేబుల్‌లతో) లేదా ఒక ఫుల్‌టైం కోర్సులతో పాటు మరో ఆన్‌లైన్/దూరవిద్య కోర్సు లేదా రెండు ఆన్‌లైన్/దూరవిద్య కోర్సులను చేయడానికి వెసులుబాటు కలిగింది. యూజీసీ అనుమతించడంతో నేడు డ్యుయల్ డిగ్రీ కోర్సులు చేయడం సర్వసాధారణం అయింది. డ్యుయల్ డిగ్రీ కోర్సులు చేయడం వల్ల తక్కువ కాలంలో ఎక్కువ జ్ఞానాన్ని లేదా అవసర నైపుణ్యాలను పొందడంతో యువత విజ్ఞాన సముపార్జనకు వైవిధ్యభరిత దారులు తెరుచుకున్నాయి. డ్యుయల్ డిగ్రీ కోర్సులు చేయడం వల్ల యువతకు ఉజ్వల ఉద్యోగ అవకాశాలు పెరగడం,అదనపు నైపుణ్యాలను సొంతం చేసుకోవడం, ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగాలు పొందడం, కెరీర్



భద్రతకు డోకా లేకపోవడం, సమయాన్ని అద్భుతంగా సద్వినియోగం చేసుకోవడం, మన అవసరాలకు అనుగుణంగా కోర్సులు ఎంపిక చేసుకొని ఏకకాలంలో పలు కోర్సులు చేయడం లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి.డ్యుయల్ డిగ్రీ పద్ధతిలో మనం చేయవలసిన డిగ్రీ కోర్సులను ఎంపిక చేసుకోవడం అత్యంత ప్రధానమని తెలుసుకోవాలి. సైన్స్ విద్యార్థి తను చేస్తున్న డిగ్రీతోపాటు డాటా సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, సాటటిస్టిక్స్, పర్యావరణ విజ్ఞానం, అదనపు స్కిల్స్ పొందడం లాంటివి చేయవలసి వస్తున్నది. కామర్స్ విద్యార్థి ఎకనమిక్స్, ఫైనాన్స్, బిజినెస్ అనాలిసిస్, ఎంబిఏ, కార్పొరేట్, బ్యాంకింగ్ లాంటి కోర్సులు చేయడం కనీస అర్హత అవుతున్నాయి. హ్యూమానిటీస్ విద్యార్థి ఏకకాలంలో జర్నలిజం, పబ్లిక్ పాలసీ, సైకాలజీ, డాటా అనాలిసిస్,డిజిటల్ మీడియా లాంటి డ్యుయల్ డిగ్రీ కోర్సులు చేస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు మేనేజమెంట్, ఎకనమిక్స్, ఎంబిఏ, ఎంటర్‌ప్రెనర్‌షిప్, ఐపి కోర్సులు, హెచ్‌ఆర్/లీడర్‌షిప్ కోర్సులు చేయడం సాధారణంఅయింది. మనం చేస్తున్న ప్రధాన కోర్సుతో పాటు తత్సమాన స్కిల్ ఆధార కోర్సులు, టెక్నికల్ కోర్సుతో మేనేజ్‌మెంట్ కోర్సులు, థియరీ కోర్సులతో అప్లికేషన్‌ఆధార కోర్సులు చేయడం నేడు పెరిగిపోయింది. నేడు వివిధ యూనివర్సిటీలు, సంస్థలు ఆఫ్‌లైన్,ఆన్‌లైన్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ పద్ధతులు నవ యువతకు వరంగా మారాయి. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పలు డ్యుయల్ డిగ్రీ కోర్సులను చేస్తున్న యువత తమ ఉద్యోగ అవకాశాలను పలు రెట్లు పెంచుకుంటున్నారు.నేడు అత్యున్నత ఐఐటీల నుంచి సాధారణ యూనివర్సిటీలు లేదా ఓపెన్ యూనివర్సిటీల వరకు అన్నిసంస్థలు డ్యుయల్ డిగ్రీ కోర్సులను యువతకు అందుబాటులో ఉంచాయి. నేడు డ్యుయల్ డిగ్రీ వేదికగా లీడర్‌షిప్, కన్సల్టేషన్, ఫైనాన్స్,టెక్నాలజీ, పబ్లిక్ పాలసీ లాంటి రంగాలతో ఆకర్షణీయ ఉద్యోగఅవకాశాలు పెరిగాయని గమనించాలి. మనం చేస్తున్న కోర్ సబ్జెక్ట్ కోర్సులతో పాటు సమాంతరంగా మనకు అవసరమైన మరో కోర్సును ఎంపిక చేసుకొని పూర్తిచేయాలని నిపుణులు సూచిస్తున్నారు.బిటెక్‌తో బిబిఏ/బిఏ, బికామ్‌తో సిఏ, బిఏతో సైన్స్ లేదా కామర్స్ కోర్సులు, ఎల్ఎల్‌బితో బిబిఏ/బికామ్, కోర్ డిగ్రీతో పాటు ఎంబిఏ చేయడానికి యువత ముందుకు రావాలి.మన కెరీర్ ముందుకు సాగడానికి, మన ప్రతిభను సానబెట్టుకోవడానికి, ఉద్యోగాలు చేస్తూనే అదనపు అర్హతలు పొందడానికి,నూతన టెక్నాలజీ లేదా నైపుణ్యాలను పొందడానికి, ప్రపంచపోటీని తట్టుకొని సగర్వంగా నిలవడానికి డ్యుయల్ డిగ్రీ కోర్సులు ఉపయోగపడతున్నాయని గమనించి, ఆ దిశగా వడివడిగా అడుగులు వేయాలని కోరుకుందాం. ●

# అగ్రదేశానికి నిగ్రహం నేర్పగలమా?



ఐ.ప్రసాదరావు

అగ్రదేశం అమెరికా నిజ స్వరూపం మరలా ప్రపంచ దేశాలు చవిచూస్తున్నాయి.తాజాగా వెనిజులా అధ్యక్షుడుని నిర్బంధించి అమెరికాకు తరలించడం ద్వారా అమెరికా సామ్రాజ్యవాద ధోరణి ట్రంప్ ద్వారా మరోసారి ప్రత్యక్షం అయింది. అమెరికాకు ధీటుగా ఏ దేశమైనా నిలబడినా, అమెరికాకు వ్యతిరేకంగా మాట్లాడినా, ఏ కార్యక్రమాలు చేపట్టినా ఇసుమంతైనా తట్టుకోలేక ఈర్ష్య భావంతో, ఏదో ఒకసాకుతో ఆయా దేశాలపై దురాక్రమణ చేసి వశపరచుకోవడం అమెరికా నైజం. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటివరకూ ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాలపై అమెరికా సుమారు 700సార్లు దాడులు చేసి, ఆయా చిన్న దేశాలను దురాక్రమణ చేయడం,వారికి అనుకూలమైన ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం, తత్ ద్వారా అక్కడ ఉన్న విలువైన వనరులను చమురు, ఖనిజాలు, ప్రకృతి వనరులు దోపిడీ చేసి తరలించుకుపోవడం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. తన చర్యలను సమర్థించు కోవడానికి కొన్ని సాకులు చెప్పడం జగమెరిగిన సత్యం. గత మూడు దశాబ్దాలుగా పరిశీలిస్తే జీవాయుధాలు తయారు చేస్తుందని ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని పడదోసి, ఆక్రమించింది. తదుపరి లిబియాపై దాడి చేసి, కల్నల్ గడాఫీ ప్రభుత్వాన్ని పడదోసి ఆక్రమించింది. ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా సహకరించి పాలస్తీనా గాజాపై దాడులు చేయించడం జరిగింది. రష్యాను ఒంటరి చేయడానికి ఉక్రెయిన్‌కు ఆర్థిక సైనిక సహకారం అందిస్తూ, త్వరలో ఉక్రెయిన్ కూడా తన చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇరాన్ పై దాడులు చేసి దాదాపు కోలుకోలేని దెబ్బ తీసింది.త్వరలో కొలంబియా, గ్రీన్ లాండ్, మెక్సికో, క్యూబా పై దాడులు తప్పవు అని ట్రంప్ అనడం ఎంత బరితెగించిన నియంత పోకడో అర్థం చేసుకోవాలి. గతంలో వియత్నంపై దాడులు చేసింది. ఇక క్యూబా పై అనేక సార్లు దాడులు జరిపింది. ముఖ్యంగా చిన్నచిన్న దేశాలపై అందునా చమురు ఖనిజాలు ప్రకృతి వనరులు ఉన్న దేశాలపై ఏదో ఒక కారణంతో దాడులు చేయడం, అక్కడ ఉన్న సంపద దోచుకోవడం అమెరికాకు గత శతాబ్దాలుగా అలవాటుగా మారుతుంది.1990 వరకూ రష్యా బలమైన దేశంగా ఉండుట వలన కొంత మేరకు నియంత్రణలో ఉన్నపరిస్థితి. నేడు దాదాపు అన్ని దేశాలు ఏదో ఒక సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో అమెరికా ఇతర దేశాలను ఆక్రమణకు సిద్ధం అవుతోంది.



ఈ పరిణామాలు ఇతర ప్రపంచ దేశాలకు, వాటి సార్వభౌమత్వానికి సవాల్‌గా మారింది.ఇటువంటి ఒరవడే రష్యా, చైనా వంటి దేశాలు కూడా ఇకపై ఆచరణలో పెడితే, ఇక భూమండలపై కేవలం ఐదు లేదా ఆరు దేశాలుగా మిగులుపోతాయి. అనగా చిన్నచిన్న దేశాలు, ఆర్థికంగా రాజకీయంగా స్థిరత్వం లేని దేశాలు అన్నీ అగ్రదేశాల ఆక్రమణలు ద్వారా కనుమరుగైపోతాయి. ఇప్పటికే ప్రపంచ దేశాలకు రక్షణ భద్రత కల్పించవలసిన ఐక్యరాజ్యసమితి ఉత్సవ విగ్రహంగా మారిపోయింది. అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ధిక్కరిస్తూ ఆక్రమణలు,యుద్ధాలు చేస్తున్న అగ్రదేశాలను నియంత్రణ చేసే అంతర్జాతీయ సంస్థలు, అభివృద్ధి చెందిన దేశాలు కళ్లు మూసుకుని ఉండిపోవడంతో దాదాపు ప్రపంచంలోని మిగిలిన చిన్నచిన్న దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల భవిష్యత్తుకు, సార్వభౌమత్వం ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో మిగిలిన దేశాలు ఐక్యతతో ఒక త్రాటి పైకి వచ్చి, అగ్రదేశాలకు చెక్ పెట్టాలి. ముఖ్యంగా అలీన దేశాలు, జి20 దేశాలు, ఆఫ్రికన్ దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు, యస్.సి.ఓ దేశాలు ఒకటిగా నిలబడి ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద ధోరణిన్ని నియంత్రణ చేయాలి.లేకపోతే చిన్న చిన్న దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలు సామ్యవాద/ కమ్యూనిస్టు దేశాలు అగ్ర రాజ్య అధికార దాహానికి ఆహుయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా చైనా,రష్యా ఇండియా, బ్రెజిల్ వంటి దేశాలు సమష్టిగా నిలబడి అమెరికా ఏకపక్ష ధోరణికి, అక్రమాలపైకొరడా ఝులిపించాలి. ప్రపంచంలో ప్రతీదేశం తమ తమ దేశాలకు ఎన్నో త్యాగాలు చేసి స్వాతంత్ర్యం సాధించుకోవడం జరిగింది. అటువంటి దేశాల భవిష్యత్తుకు భంగం కలిగించే విధంగా, ఆయా దేశాల అంతర్గత సమస్యలు సాకుగాచూపి అమెరికా ఆక్రమణలు చేయడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలను ధిక్కరించడమే. ఇది ఏమాత్రం సమంజసం కాదు అని తెలిపాలి. దాదాపు అన్ని దేశాలు ఒకటై, అమెరికా ఒంటెద్దు పోకడలపై పట్టు సాధించాలి. ఐక్యరాజ్యసమితికి వెన్నుదన్నుగా నిలవాలి. లేకపోతే ఏదో ఒక కారణంతో దాడులు చేసి అమెరికా దాదాపు అన్ని దేశాలను ఆక్రమించి, ఈ భూమిపై ఏకధ్రువ ప్రపంచంగా అవతరిస్తుంది. దీంతో మరల మధ్యయుగ కాలం ఆవిర్భావిస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ పోయి, బానిస వ్యవస్థ ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో అగ్రదేశాలను అదుపు చేయడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలు, సామ్యవాద, ప్రజాస్వామ్య దేశాలు నడుంబిగించాలి. అంతర్జాతీయ సంస్థలకు ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయస్థానానికి వెన్నుదన్నుగా నిలవాలి. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కీలక పాత్ర పోషించాలి. ప్రపంచ దేశాల్లో ఉన్న సమస్త మానవాళికి మానవ హక్కుల పరిరక్షణకు, వివిధ దేశాల సార్వభౌమత్వానికి రక్షణ కోసం ప్రతీ వ్యక్తి, సంస్థలు పనిచేయాలి. సర్వేజనా సుఖినోభవంతు అనే భావన సాధనకు కృషి చేయాలి. అగ్రదేశాల అక్రమాలపై కొరడా ఝులిపించాలి. ●

# రా..వచ్చి పట్టుకో, నీకోసం ఎదురు చూస్తా

## ట్రంప్‌కు కొలంబియా అధ్యక్షుడు సవాల్

## అమెరికా దాడి చేస్తే ఆయుధాలు చేపడతాం

## గుస్తావో పెట్రో గట్టి హెచ్చరికలు



**బొగోటా,జనవరి 6:** వాషింగ్టన్, బొగొటా మధ్య ఉద్రిక్తతలు శరవేగంగా పెరుగుతున్నాయి. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఇప్పుడు కొలంబియా వంతు వచ్చిందన్నట్లుగా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యలకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఏకంగా నన్ను వచ్చి పట్టుకో. నేను ఇక్కడే ఎదురుచూస్తున్నా అంటూ బహిరంగ సవాల్ విసిరారు. గత వారాంతంలో మదురో అరెస్ట్‌ను ఓ పెద్ద విజయంగా అభివర్ణించిన ట్రంప్, ఇప్పుడు తనదృష్టిని కొలంబియా వైపు మళ్లించారు. కొలంబియా కూడా చాలా అనారోగ్యంతో ఉందని, కొకైన్ తయారుచేసి అమెరికాకు అమ్మే ఓ అనారోగ్యకర వ్యక్తి దేశాన్ని నడిపిస్తున్నారని పెట్రోను ఉద్దేశించి తీవ్రంగా విమర్శించారు. అతనికి కొకైన్ మిల్లులు, ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇదంతా ఎక్కువ కాలం సాగదని ట్రంప్ హెచ్చరించారు. కొలంబియాలో కూడా అమెరికా ఆపరేషన్ ఉంటుందా అని విలేకరులు అడగ్గా, నాకు ఇది మంచి ఆలోచనలాగే ఉందని బదులిచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలపై పెట్రో సోషల్‌మీడియాలో ఘాటుగా స్పందించారు. కొలంబియా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ చర్చలు, సహకారం, పరస్పర గౌరవం ఆధారంగా ఇతర దేశాలతో సంబంధాలు కోరుకుంటున్నట్లు తెలిపింది. ఈ పరిణామాలపై వైట్‌హౌస్ ప్రతినిధి అన్నా కెల్లీ స్పందించారు. ఈ ప్రాంతంలో అమెరికా పట్టు బిగించి, వలసలను, డ్రగ్స్ ప్రవాహాన్ని అరికట్టే భద్రతా ప్రణాళికలో ఈ చర్యలు భాగమేనని తెలిపారు. ప్రతి ఏటా వేలాది మంది అమెరికన్ల మరణానికి కారణమవు తున్న మాదకద్రవ్యాల నుంచి మాతృభూమిని రక్షించుకోవడానికి అధ్యక్షుడి వద్ద అనేక మార్గాలున్నాయని ఆమె పేర్కొన్నారు. గత అక్టోబర్‌లోనే డ్రగ్స్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలతో ట్రంప్ పెట్రో, ఆయన కుటుంబంపై ఆంక్షలు విధించారు. అయితే పెట్రో ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తన హయాంలో ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద కొకైన్ స్వాధీనం జరిగిందని స్పష్టం చేస్తున్నారు. వెనిజులాలో జరిగిన ఆపరేషన్ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు కొలంబియాలో కూడా అలాంటి పరిస్థితి వస్తుందేమోనన్న ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

# గ్రీన్‌ల్యాండ్ ఆక్రమణ నాటో అంతమే!



## అయినా ఆ అధికారం అమెరికాకు లేదు: డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్‌సన్

**వాషింగ్టన్, జనవరి 6:** గ్రీన్‌లాండ్‌పై అమెరికా నియంత్రణ ఉండాలన్న తన ఆకాంక్షను ట్రంప్ వ్యాఖ్యలపై డెన్మార్క్, గ్రీన్‌లాండ్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ తమ జాతీయ భద్రతకు సంబంధించి గ్రీన్‌లాండ్ చాలా ముఖ్యమైనదని, అక్కడ రష్యన్, చైనా నౌకలు తిష్టవేయడం ఆందోళనకరమని అన్నారు. రక్షణ అవసరాల కోసం గ్రీన్‌లాండ్ అమెరికాకు కావాలని ఆయన చెప్పారు.కొలంబియా చాలా బలహీనంగా ఉందని,కొకైన్ తయారుచేసి అమెరికాకు అమ్మడానికే అనారోగ్యంతో బాధపడుతున్న ఆ దేశ అధ్యక్షుడు ఇష్టపడుతున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన ఇక ఎంతో కాలం ఆ పనిచేయలేరని హెచ్చరించారు. గ్రీన్‌లాండ్ తమకు కావాలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై డెన్మార్క్ ప్రధాని మెట్టే ఫ్రెడరిక్సన్ తీవ్రంగా స్పందించారు. గ్రీన్‌లాండ్‌ని అమెరికా తీసుకోవడం అనే ఆలోచనే అసంబద్ధమైందని ఆమె అన్నారు. డానిష్ రాజ్యంలోని ఏ భూభాగాన్ని స్వాధీనం చేసుకునే అధికారం అమెరికాకు లేదని ఆమె హెచ్చరించారు. తనకు అత్యంత సన్నిహిత మిత్రదేశానికి హెచ్చరికలు జారీచేయడాన్ని ట్రంప్ మానుకోవాలని ఆమె సూచించారు. తమ భూభాగం అమ్మకానికి లేదని గ్రీన్‌లాండ్ ప్రజలు ఇప్పటికే స్పష్టం చేశారని ఆమె ట్రంప్‌నకు గుర్తు చేశారు. అదేజరిగితే నాటో అంతం తప్పదని ఆమె హెచ్చరించారు. ఇదిలా ఉండగా వెనిజులాలో అమెరికా సైనిక చర్యను గ్రీన్‌లాండ్‌తో ముడిపెడుతూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను మోసపూరితం, అమర్యాదకరంగా గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడెరిక్ నీల్సెన్ అభివర్ణించారు. భయపడాల్సిన అవసరం లేదని ఆయన దేశ ప్రజలకు ధైర్యం చెప్పారు. స్వతంత్ర ఎన్నికలతో గ్రీన్‌లాండ్ ఓ ప్రజాస్వామిక సమాజమని, అంతర్జాతీయ చట్టాల మార్గదర్శనలో బలమైన వ్యవస్థలు ఉన్నాయని, గుర్తింపు పొందిన ఒప్పందాలు అమెరికాతో సైతం ఉన్నాయని ఆయన చెప్పారు. జాతీయ భద్రత, ఖనిజ వనరులు, ఆర్కిటిక్ ప్రాంత రష్యాచైనా కార్యకలాపాలు వంటి విషయాలను ఆయన గుర్తు చేశారు. వెనిజులాను తాము ఆక్రమించుకోలేదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చెపుతూ ప్రస్తుత పరిస్థితిలో అమెరికా చర్యలను దురాక్రమణగా భావించకూడదని చెప్పారు. ప్రతి పరిస్థితిని ఎదుర్కొనేందుకు అధ్యక్షుడు ట్రంప్ వద్ద వేర్వేరు ప్రత్యామ్నాయాలు ఉంటాయని చెప్పారు. వెనెజులా భూభాగాన్ని అమెరికా ఆక్రమించుకునే పరిస్థితి లేదని ఆయన చెప్పారు. ఈ నెల 3న వెనెజులాను అమెరికా ఆక్రమించుకున్నట్లు సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ వెల్లడించిన విషయం తెలిసిందే. వెనెజులా కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని,ఆ బృందంలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీటే హ్యాగ్‌సెథ్, తదితరులున్నట్లు చెప్పారు. ఈ బృందం వెనెజువెలాలో శాంతి భద్రతలను అమలు చేయడంలో, ప్రభుత్వ సంస్థల నిర్వహణలో, చమురు, ఇంధనం, భద్రత వంటి కీలక రంగాలు సుస్థిరంగా కొనసాగడంలో తోడ్పడుతుంది. ఆర్కిటిక్ మహాసముద్రంలో ఉన్న గ్రీన్‌లాండ్ ద్వీపం వ్యూహాత్మకంగా అమెరికాకు ఎంతో ముఖ్యమైన ప్రదేశం. రష్యా, చైనా సైనిక కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ఈ ప్రాంతం అమెరికాకు ఎంతో ప్రధానం. ఈ ద్వీపంలో అత్యంత అరుదైన ఖనిజాలు, చమురు, గ్యాస్ వనరులుఅపారంగా ఉన్నాయి. భవిష్యత్తు ఆర్థిక, సాంకేతిక భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని అమెరికా భావిస్తున్నది. ఆర్కిటిక్ మంచు ఖండాన్ని మరింత కరిగించడం ద్వారా కొత్త నావికా మార్గాలను ప్రారంభించుకోవచ్చన్నది అమెరికా ఆలోచన. డెన్మార్క్, గ్రీన్‌లాండ్ డానిష్ రాజ్యంలో భాగంగా ఉన్నాయి. ఇవి నాటోకు చెందిన ఉమ్మడి రక్షణ వ్యవస్థ పరిధిలో ఉన్నాయి. నాటో వ్యవస్థాపక సభ్యదేశమైన డెన్మార్క్‌కు 1951లోనే అమెరికాతో రక్షణ ఒప్పందం ఏర్పడింది. గ్రీన్‌లాండ్‌పై అమెరికా సైనిక కార్యకలాపాలు సాగించుకోవచ్చన్నది ఈ ఒప్పందం సారాంశం.

# మదురో తరపున అమెరికా ఫేమస్ లాయర్ వాదనలు



**న్యూయార్క్, జనవరి 6:** అమెరికా చెరలో ఉన్న వెనిజులా దేశాధ్యక్షుడు నికోలస్ మదురో తరపున ఫేమస్ క్రిమినల్ లాయర్ బ్యారీ పొల్లాక్ వాదిస్తున్నారు. అమెరికాలో చాలా అనుభవం ఉన్న క్రిమినల్ లాయర్ ఆయన. మదురోపై మొత్తం నాలుగు కేసులు ఉన్నాయి. నార్కో టెర్రరిజం, కొకైన కుట్ర, మెషీన్ గన్నులు కలిగి ఉండడంతో పాటు అమెరికాకు వ్యతిరేకంగా ప్రవర్తించినట్లు కేసులు బుక్ చేశారు. గతంలో వికీలీక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజే తరపున వాదించిన బ్యారీ పొల్లాక్ ఇప్పుడు మదురో తరపున అమెరికా కోర్టులో వాదించనున్నారు. సోమవారం కోర్టుకు వచ్చిన మదురోను జిల్లా జడ్జి అల్విన్ హెల్లర్‌స్టీన్ ప్రశ్న వేశారు. పరిచయం చేసుకోవాలని కోరగా, ఆ సమయంలో మాట్లాడుతూ తాను వెనిజులా అధ్యక్షుడిని అని మదురో అన్నారు. యుద్ధ ఖైదీని అయినట్లు చెప్పారు. అయితే మార్చి 17వ తేదీన ఈ కేసులో తదుపరి విచారణ చేపట్టనున్నారు. క్రిమినల్ లాయర్ బ్యారీ జే పొల్లాక్‌కు సుమారు 30 ఏళ్ల అనుభవం ఉన్నది. హై ప్రొఫైల్ కేసుల్లో ఆయన టాప్ ఎగ్జిక్యూటివ్‌లు, గవర్నమెంట్ అధికారులు, దిగ్గజ సంస్థల తరపున కేసులను వాదించారు. అమెరికన్ కాలేజీ ఆఫ్ ట్రయల్ లాయర్స్, అమెరికన్ బోర్డ్ ఆఫ్ క్రిమినల్ లాయర్స్ సభ్యుడిగా ఉన్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ క్రిమినల్ డిఫెన్స్ లాయర్స్ సంఘానికి అధ్యక్షుడిగా చేశారు.తన కెరీర్‌లో ఎన్నో పెద్ద కేసుల్ని ఆయన వాదించారు. వికీలీక్స్ ఫౌండర్ జులియన్ అసాంజేకు బెయిల్ ఇప్పించారు. ఓ కేసులో ఎన్‌రాన్ ఎగ్జిక్యూటివ్‌ను నిర్దోషిగా తేల్చారు. మేరీల్యాండ్‌లో అసిస్టెంట్ ఫెడరల్ పబ్లిక్ డిఫెండర్‌గా చేశారు. జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో ఫెడరల్ చట్టాలను బోధిస్తున్నారు.

## 92 యేళ్ల న్యాయమూర్తి ముందుకు మదురో.. ఎవరీ అల్విన్?



**వాషింగ్టన్, జనవరి 6:** వెనిజులాపై దాడి చేసి ఆ దేశ నేత నికోలస్ మదురో, ఆయన భార్యను నిర్బంధించి తీసుకొచ్చిన అమెరికా.. వారిని కోర్టులో హాజరుపర్చింది. మదురో దంపతుల కేసును విచారించిన మన్‌హటన్ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి అల్విన్ హెల్లర్‌స్టీన్ వయసు 92 యేళ్లు. దీంతో ఆయన పేరు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ ఎవరీ అల్విన్..? అల్విన్ హెల్లర్‌స్టీన్ 1933లో న్యూయార్క్‌లో జన్మించారు. కొలంబియా యూనివర్సిటీ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయనతొలినాళ్లలో అమెరికా ఆర్మీలో లాయర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ప్రైవేటుగా ప్రాక్టీస్ మొదలు పెట్టారు. 1998లో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్. అల్విన్‌ను న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జిగా నామినేట్ చేశారు.

# ఇరాన్‌పై ట్రంప్ కన్ను, నాయకత్వ మార్పుపై ఊహాగానాలు

## టెహ్రాన్‌లో కొనసాగుతున్న ఆందోళనలు

## సుప్రీం లీడర్ ఖమేనీ అదృశ్యం

## దేశం వీడి వెళ్లారని వ్యూహాలు

## పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న అగ్రరాజ్యం



**టెహ్రాన్, జనవరి 6:** దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీచేసిన తర్వాత ఇరాన్‌లో నాయకత్వ మార్పుపై జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతొల్లా అలీ ఖమేనీ దేశం విడిచి పారిపోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు కథనాలు వస్తున్నాయి. దేశంలో అలజడి పెరిగిపోతే 20 మంది సన్నిహిత సహచరులు, కుటుంబ సభ్యులతో టెహ్రాన్ నుంచి పారిపోవడానికి ఖమేనీ సన్నాహాలు చేస్తున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ ది టైమ్స్ పత్రిక కథనాన్ని రాసింది. 1979నాటి ఇస్లామిక్ విప్లవం తర్వాత ఎనిమిదేండ్లకు ఇరాన్ నుంచి పారిపోయిన మాజీ ఇజ్రాయెలీ నిఘా అధికారి బెనే సబ్తీని ఉటంకిస్తూ ఖమేనీ మాస్కోకు పారిపోవచ్చని, ఆయనకు ప్రపంచంలో తలదాచుకోవడానికి మరో దేశం ఏదీ లేదని పత్రిక తెలిపింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌ని ఆరాధించే ఖమేనీ రష్యా తమకు సాంస్కృతికంగా చాలా సన్నిహిత దేశమని ఇరాన్ సుప్రీం నాయకుడు భావిస్తారని సబ్తీ వెల్లడించినట్లు ప్రచారం. టెహ్రాన్‌తోపాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఆదివారం వరుసగా 8వ రోజు కూడా ఖమేనీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. టెహ్రాన్‌లోని ప్రధాన బజారుతోపాటు ప్రధాన షాపింగ్ సెంటర్ల వద్ద భారీ స్థాయిలో భద్రతా దళాలను మోహరించారు. నగరంలో అనేక దుకాణాలు మూతపడ్డాయి. సాధారణ దుస్తులు ధరించిన భద్రతా ఏజెంట్లు ప్రధాన వీధుల్లో నిఘా వేసి తిరుగుతున్నట్లు ఇరాన్ ఇంటర్నేషనల్ తెలిపింది. టెహ్రాన్‌లోని జోంహోరీ వీధిలో నిరసనలు తెలియచేస్తున్న ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భద్రతా దళాలు బాష్పవాయు గోళాలను ప్రయోగించిన వీడియోలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. టెహ్రాన్‌కు పొరుగున ఉన్న నార్మక్, నజియాబాద్, హాఫీజ్ స్ట్రీట్‌తోపాటు సెమ్నన్ ప్రావిన్సులోని సంగ్సర్, ఫార్స్ సర్‌లోని నూరాబాద్ ఇమామ్‌సని వంటి అనేక నగరాలకు నిరసనలు విస్తరించాయి. దేశంలో దిగజారిపోతున్న ఆర్థిక పరిస్థితులపై ఆందోళన చెందుతూ ప్రజలు గత ఏడాది డిసెంబరు 28న ఇరాన్ పాలకులకు వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించడంతో దేశంలో అలజడి మొదలైంది. నిరసనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరిపి హతమారిస్తే అమెరికా నుంచి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో తాజాగా ఖమేనీ పరారీపై ఊహాగానాలు జోరందుకున్నాయి.

# ఇరాన్‌లో ఆందోళనలు.. అమెరికా జోక్యానికి ఛాన్స్



**టెహ్రాన్, జనవరి 6:** ఇరాన్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై ఇజ్రాయెల్‌కు చెందిన పత్రిక ది జెరూసలెం పోస్టు సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ దేశంలో కొనసాగుతున్న ఆందోళనల్లో అమెరికా, ఇజ్రాయెల్ జోక్యం చేసుకోవాలని చూస్తున్నట్లు పేర్కొంది. దీనికోసం ఇప్పటికే ఇరు దేశాల అధికారులు ఆప్షన్లు వెతుకుతున్నట్లు తెలిపింది. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ఇరాన్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ధరలు పెరిగిపోవడం, కరెన్సీ విలువ పడిపోవడంతో అనేకమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు తెలుపుతున్నారు. గతంలో కూడా ఇలాంటి నిరసనలు జరగ్గా.. ఇరాన్ అధికారులు వాటిని అణచివేశారు. ఈ తాజా ఆందోళనలపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించింది. మరోవైపు.. వెనిజులాపై సైనిక ఆపరేషన్ చేసి.. ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సంగతి తెలిసిందే. మదురోపై అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న చర్యలు ఇరాన్ నిరసనకారుల్లో ధైర్యాన్ని నింపిందని జెరూసలేం పేర్కొంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై బల ప్రయోగం చేస్తే తాము రంగంలోకి దిగుతామంటూ ట్రంప్ కూడా గతంలో ఇరాన్ అధికారులను హెచ్చరించారు. ఈ క్రమంలో అమెరికా జోక్యంపై వార్తలు రావడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### నెతన్యాహు హెచ్చరికలు

ఇరాన్ తన బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలు పునరుద్ధరించడాన్ని తాము అనుమతించమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. తమపై దాడి జరిగితే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆ దేశంలో కొనసాగుతున్న ఆందోళనల గురించి కూడా నెతన్యాహు మాట్లాడారు. స్వేచ్ఛ, న్యాయం కోసం ఇరాన్ ప్రజలు చేస్తున్న పోరాటానికి తాము మద్దతిస్తున్నట్లు తెలిపారు.

### నిరసనల్లో 35 మంది మృతి

ఇరాన్‌లో కొనసాగుతున్న నిరసనల్లో చెలరేగిన హింసలో దాదాపు 35 మంది ప్రాణాలు కోల్పోయారు. వారం రోజులకుపైగా కొనసాగుతున్న ఈ ఆందోళనల్లో 1,200 మందికిపైగా అరెస్టు చేశా రని మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీటి కారణంగా దాదాపు 250 మంది పోలీసు అధికారులు, మరికొందరు భద్రతాదళాల సభ్యులు గాయపడ్డారని పేర్కొంది.



# యుపి ఓటర్ల జాబితా నుంచి 2.89 కోట్ల మంది తొలగింపు

**లక్నో,జనవరి 6:** ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం యూపీలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) నివేదిక ఆధారంగా ఓటర్ల జాబితాపై ముసాయిదాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ జాబితాలో యూపీలో 2.89 కోట్ల ఓట్లను తొలగించారు. వీరిలో 46 లక్షల ఓట్లు మరణించినవారివి ఉన్నాయి. మిగిలిన ఓట్లలో 2.17 కోట్ల మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. 25.47 లక్షల మంది డూప్లికేట్ ఓట్లు కలిగి ఉన్నారు. యూపీలో తాజా జాబితా ప్రకారం 15,000 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయబోతున్నారు. తాజా జాబితాకు సంబంధించి అభ్యంతరాలున్నా తమ పేర్లు లిస్టులో లేకున్నా ఫిబ్రవరి 6 వరకు ఫిర్యాదుచేయవచ్చు. ఫాం 7, 8లలో స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు, పరిశీలన అనంతరం తుది జాబితాను మార్చి 6న విడుదల చేసే అవకాశం ఉంది. ఈ అంశాల్ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి నవదీప్ రిన్వా మంగళవారం వెల్లడించారు. ఈ జాబితాను రాష్ట్రంలోని పార్టీలకు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. యూపీలో గతంలో 15.44 కోట్ల ఓట్లు ఉండగా తాజా ముసాయిదా ప్రకారం 12.56కోట్ల మంది ఓటర్లు మాత్రమే ఉంటారు. అంటే దాదాపు 18.7శాతం ఓట్లను తొలగించినట్లైంది. ఇంతకుముందు సర్ ఆధారంగా తమిళనాడులో 15 శాతం, గుజరాత్ లో 14.5 శాతం ఓట్లను ఎన్నికల సంఘం తొలగించింది. కేంద్ర ఎన్నికల సంఘం 12రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గతఏడాది సర్ నిర్వహించింది. ఇక యూపీలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. మరోవైపు సర్ పై కాంగ్రెస్‌సహా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తు న్నాయి. దొంగ ఓట్లను తొలగించే పేరుతో ఇం డియాకూటమి గెలిచిని నియోజకవర్గాల్లోనే ఓట్లను ఎక్కువగా తొలగిస్తున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



# భారత్-నేపాల్ సరిహద్దుల్లో ఘర్షణలు

## సరిహద్దులు మూసివేత

**డెహ్రాడూన్, జనవరి 6:** భారత సరిహద్దు దేశమైన నేపాల్ లో మత ఘర్షణలు చెలరేగుతున్నాయి. ఆ ఘర్షణ ప్రభావం ఇండియాపై పడకుండా భారత ప్రభుత్వం ఇరు దేశాల సరిహద్దును మూసివేసింది. భద్రతా కారణాల రీత్యా, ముందస్తుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నేపాల్ లోని పార్సా జిల్లా, బీర్గంజ్ పట్టణంలో నిరసనలు ఆందోళనకరంగా మారుతున్నాయి. ఇటీవల నేపాల్ లోని ధనుషా జిల్లా, కమలా మున్సిపాలిటీకి చెందిన హైదర్ అన్సారీ, అమానత్ అన్సారీ అనే ఇద్దరు ముస్లింలు సోషల్ మీడియాలో ఒక మతాన్ని కించపరుస్తూ, రెచ్చగొట్టేలా వీడియో విడుదల చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో ఆ మతానికి చెందిన వారు ఆందోళన చేపట్టారు. దీంతో ధనుషా, పార్సా జిల్లాలో ఆందోళనలు పెరిగాయి. స్థానికులు ఆ ఇద్దరినీ పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇదే సమయంలో కొందరు కమలా ప్రాంతాంలోని ఒక మసీదును ధ్వంసం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ క్రమంలో కొందరు పోలీసు స్టేషనుపై కూడా దాడి చేసి, రాళ్లు విసిరారు. ఈ దాడుల్ని అణిచివేయడానికి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. నేపాల్ లోని హిం దు వులు ఈఘర్షణల్లో అధికంగా పాల్గొం టున్నారు. తమ దేవతల్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేస్తున్నారు. ప్రస్తుతం పార్సా జిల్లాలోని బీర్గంజ్ ప్రాంతంలో ఆందోళనలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో అధికారులు అక్కడ కర్ఫ్యూ విధించారు. ఈ ప్రాంతం బీహార్ లోని రాక్సాల్ జిల్లాకు దగ్గరగా ఉంటుంది. అందువల్ల అక్కడి ప్రభావం మనపై పడకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. నేపాల్‌భారత్ సరిహద్దుల్ని పూర్తిగా మూసేసి, రాకపోకల్ని నిషేధించారు. అత్యవసర సేవల్ని కూడా నిలిపివేశారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మరోవైపు ఘర్షణల నేపథ్యంలో అక్కడ ఉంటున్న భారతీయులు ఎక్కువగా తిరిగి ఇండియా వచ్చేస్తున్నారు.

# ఆపరేషన్ సిందూర్ నిలిపివేతకు యుఎస్‌తో పాక్ లాబీయింగ్

**న్యూఢిల్లీ,జనవరి 6:** ఆపరేషన్ సింధూర్ సమయంలో భారతీయ రక్షణ దళాల దూకుడును అడ్డుకునేందుకు అగ్రరాజ్యం అమెరికా సహాయాన్ని పాకిస్థాన్ కోరింది. దీని కోసం ఆ దేశం తీవ్రంగా ల్యాబీయింగ్ చేసినట్లు తాజా ఆధారాలు బయటపడ్డాయి. వాషింగ్టన్‌లో అమెరికా పెద్దలను కలిసేందుకు పాకిస్థాన్ తీవ్ర ప్రయత్నం చేసింది. దౌత్యపరమైన రీతిలో అమెరికా సహాయాన్ని కోరింది. పాకిస్థానీ దౌత్యవేత్తలు, రక్షణ దళ అధికారులు ఇండియాను శాంతింపచేయడానికి అమెరికా హెల్ప్ కోరారు. సుమారు 50 సార్లు మీటింగ్‌లు నిర్వహించినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ చేపట్టే విధంగా పాకిస్థాన్ అధికారులు అమెరికాను వేడుకున్నట్లు కథనం వెలుగులోకి వచ్చింది. పెహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత భారతీయ సైనిక దళాలు ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. అమెరికా ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్టులో దాఖలైన రికార్డుల ఆధారంగా పాకిస్తాన్ అధికారులు సుమారు 60 సార్లు అమెరికా అధికారులతో భేటీ అయినట్లు తెలుస్తున్నది. పాకిస్తాన్ అంబాసిడర్‌తో పాటు రక్షణాధికారులు ఈమెయిల్, ఫోన్లు, వ్యక్తిగతంగా అమెరికా అధికారులను కలిసినట్లు తెలుస్తోంది. భారత్ తన దాడిని ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని అమెరికాను పాక్ కోరినట్లు ఆ డాక్యుమెంట్లతో తెలిసింది. అమెరికా ఉభయసభలు, పెంటగాన్, జర్నలిస్టులను పాక్ అధికారులు కలిశారు. కశ్మీర్, ప్రాంతీయ భద్రత, అరుదైన ఖనిజాలు, ద్వైపాక్షిక బంధాలు, మీడియా సంస్థలతో పాక్ చర్చించింది. ఆపరేషన్ సింధూర్ సమయంలో లాబీయింగ్ కోసం పాకిస్థాన్ ఎక్కువగా ఖర్చు చేసినట్లు తెలిసింది. ఆరు లాబీయింగ్ సంస్థలతో పాకిస్తాన్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆంగ్లపత్రిక కథనంలో ఉటంకించింది. సీడెన్ లా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాతే పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్‌మార్షల్ అసిమ్ మునీర్‌తో ట్రంప్ భేటీ అయినట్లు తెలుస్తోంది. తాము వాణిజ్య బెదిరింపులకు పాల్పడితేనే ఆపరేషన్ సింధూర్‌ను ఇండియా ఆపినట్లు ట్రంప్ పలుమార్లు చెప్పారు.

# సంక్షిప్తంగా..

## హెచ్-1బి వీసా పెంపుపై విచారణ వేగవంతం





**వాషింగ్టన్, జనవరి 6:** హెచ్-1బి వీసా ఫీజును పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న నిర్ణయాన్ని సమర్థిస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును యుఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అప్పీల్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ విచారణను వేగవంతం చేయాలని తాజాగా ఛాంబర్ చేసిన అభ్యర్థనకు న్యాయస్థానం అంగీకరించింది. ఈ యేడాది హెచ్-1బి వీసాల కార్యక్రమంలో కంపెనీలు పాల్గొనాలా,వద్దా? అనేది ఈ కోర్టు తీర్పుపైనే ఆధారపడి ఉంటుదని ఛాంబర్ ఆఫ్ కామర్స్ తన అభ్యర్థనలో పేర్కొంది. విచారణ వేగవంతంగా జరపాలనే అభ్యర్థనను ట్రంప్ ప్రభుత్వం తరఫు న్యాయబృందం కూడా వ్యతిరేకించలేదు. ఫిబ్రవరిలో దీనిపై వాదనలు వింటామని కోర్టు పేర్కొంది.

## పాక్‌కు గూఢచర్యం..15 యేళ్ల బాలుడి అరెస్ట్



**అమృత్‌సర్, జనవరి 6:** పాక్ కోసం గూఢచర్యం వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంచలనం రేపు తోంది. తాజాగా ఓ బాలుడు అరెస్ట్అయ్యాడు. పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నాడనే ఆరోపణలపై 15యేళ్ల బాలుడిని పఠాన్‌కోట్ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. ఆ యువకుడు పాక్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధం ఉన్నహ్యాండ్లర్లతో టచ్‌లో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకు న్నట్లు పోలీసులు తెలిపారు. జమ్ములోని సాంబా జిల్లాకు చెందిన బాలుడు దాదాపు ఏడాదిగా భారత్ సైనిక స్థావరాలు,ఇతర సున్నితమైన సమాచారాన్ని ఐఎస్ఐ ఏజెంట్లతో పంచుకుంటున్నట్లు గుర్తించామన్నారు. దీంతో ముందుజాగ్రత్తగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు స్టేషన్లను అధికారులు అప్రమత్తం చేశారు.

## శిల్పాశెట్టి దంపతులకు పిఎంఎల్‌ఏ కోర్టు సమన్లు



**ముంబయి,జనవరి 6:** బాలీవుడ్ స్టార్ నటి శిల్పాశెట, ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రాకు మరోషాక్ తగిలింది. బిట్‌కాయిన్ స్కామ్ కేసులో రాజ్ కుంద్రాకు ముంబైలోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టు తాజాగా సమన్లు జారీ చేసింది. రాజ్ కుంద్రాతో పాటు దుబాయ్‌లో ఉండే మరో వ్యాపారవేత్త రాజేశ్ సతీజాకు కూడా సమన్లు పంపింది. జనవరి 19న కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే గతేడాది అక్టోబర్‌లో రాజ్‌కుంద్రా ఆస్తులను కూడా ఈడీ అటాచ్ చేసింది. ముంబైలోని జుహు ప్రాంతంలో ఉన్న ఇల్లు, పావ్నా సరస్సు సమీపంలో ఉన్న ఫామ్‌హౌస్‌ను ఖాళీ చేయాలని ఈడీ నోటీసులు పంపింది. అయితే, ఆ కేసుతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ శిల్పా శెట్టి దంపతులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు.

## కేంద్రమాజీ మంత్రి సురేష్ కల్మాడి కన్నుమూత



**పుణె, జనవరి 6:** సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర మంత్రి, భారత ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు సురేశ్ కల్మాడీ (81)కన్నుమూశారు. పుణెలో ఆయన తుది శ్వాసవిడిచారు. సుదీర్ఘకాలం నుంచి ఆయన తీవ్ర అనారోగ్యంగా ఉన్నారు. పుణెలోని దీనానాథ్ మంగేస్కర్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందారు. ఏషియన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కూడాచేశారు. ఐఏఏఫ్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నారు. భారత్‌లో అత్యంత శక్తివంతమైన క్రీడా నిర్వాహకుడిగా ఆయనకు గుర్తింపు ఉన్నది.



## టివికె విజయ్‌కు సిబిఐ నోటీసులు

**చెన్నై, జనవరి 6:** కరూర్ తొక్కిసలాట కేసుదర్యాప్తులో నిందితుడిగా ఉన్న తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్‌కి సీబీఐ సమన్లు జారీచేసింది. ఈనెల 12న తమ ముందు విచారణకు హాజరు కావాలని నోటీసులలో ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలోని సీబీఐ హెడ్ క్వార్టర్స్‌లో విజయ్‌ని విచారించనున్నట్లు తెలిపింది. కాగా గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడులోని కరూర్ పట్టణంలో విజయ్ ప్రచార ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 110 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది.

## చేతిలో తుపాకీలతో రైతుల గస్తీ

**అహల్యానగర్(మహారాష్ట్ర), జనవరి 6:** పంట చేలల్లో పనులు చేస్తున్న కూలీలకు ఓ రైతు తుపాకీతో కాపలా కాస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణంగా మారాయని స్థానికులు చెబుతున్నారు. ఊరు చివర్లో ఉన్న పంట పొలాల్లోకి తరచూ చిరుత పులులు వస్తున్నాయని, మనుషులపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా ఖుద్సర్, పాథ్రే, మైగావ్,మంజరి ప్రాంతాల్లో ప్రస్తుతం 20నుంచి 25 చిరుతలు స్వేచ్ఛగా తిరుగుతున్నాయని చెప్పారు.

# రాష్ట్రంలో కోటి 80 లక్షల వాహనాలు

## అందుబాటులో 550 పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్లు

## ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని 22,340 వాహనాలపై కేసులు నమోదు: సభలో మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా 1.80 కోట్ల వాహనా లున్నాయని, వాటికి పొల్యూషన్ టెస్టింగ్ చేయడానికి రాష్ట్రంలో 550 ఉన్నాయని, ఫిట్‌నెస్ లేని 22,340 వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో తెలిపారు. వాహన కాలుష్యానికి కారణమవుతున్న ఫిట్‌నెస్ లేని వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని మంగళవారం శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 15 సంవత్సరాలు పైబడిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయన్నారు. ఆర్‌టిసి వాహనాలు, ప్రభుత్వ వాహనాలు కూడా స్క్రాప్ చేస్తున్నామన్నారు. ప్రయాణికుల ప్రైవేట్ వాహనాలు గ్రీన్‌టాక్స్ పేరుతో కేంద్రం వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ వెసులుబాటు వల్ల కఠినంగా వ్యవహరించలేక పోతున్నామని.. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకుపోయామన్నారు. ఈ ప్రైవేట్ వాహనాల వెసులుబాటు కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉందని, ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ మొదటి దశలో 15 ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తంగా 37 స్టేషన్స్ ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో కచ్చితత్వం ఉంటుందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచడానికి చెక్ పోస్టులు ఎత్తివేశామని, సారథిలో చేరామని, వాహన్‌లో చేరుతున్నా మన్నారు. స్పీడ్ లిమిట్ తగ్గించడానికి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంక్ వాహనాలు పొగలు వస్తున్నాయని అది పొల్యూషన్‌కి కారణం అవుతున్నాయని, వాటర్ బోర్డుకు సంబంధించి వాహనాలు వాటి ఫిట్‌నెస్‌కి సంబంధించి నోటీసులు ఇస్తామన్నారు. స్కూల్ బస్సులు, ఐటీ, ఫార్మా కంపెనీల వాహనాలు కూడా పొల్యూషన్‌కి కారణమైతే వాటిపై చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో స్పష్టం చేశారు.

పిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. గత 24 నెలల్లో హైదరాబాద్ అర్బన్ ప్రాంతంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న 22,340 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. లాగే కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ లేకుండా తిరుగుతున్న 28970 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. పిట్‌నెస్ సర్టిఫికెట్ లేని వాహనాలపై రూ. 4.28 కోట్లు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేని వాహనాలపై రూ. 2.38 కోట్లు పెనాల్టీగా వసూలు చేయడం జరిగిందన్నారు.

# ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో బిల్లులు పెండింగ్‌లో లేవు

## రూ. 388.31 కోట్లు చెల్లించాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** 2014 కంటే ముందు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్స్ ఏవీ కూడా పెండింగ్‌లో లేవని రెవిన్యూ శాఖ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. 2014 సంవత్సరం కంటే ముందు నిర్మించిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసిందా? ఇంకా ఎంత మేరకు పెండింగ్ ఉందని సభ్యులు ప్రశ్నించారు.
ఇందుకు మంత్రి పొంగులేటి సమాధానమిస్తూ.. 2014 కంటే ముందు మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం పెండింగ్ బిల్లుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 388.312 కోట్లను క్లియర్ చేసిందన్నారు. జిల్లాల వారీగా 1,94,150 మంది లబ్ధిదారులకి పెండింగ్ బిల్లులను చెల్లించినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాన పథకంలో ఎటువంటి పెండింగ్ బిల్స్ లేవని మంత్రి పొంగులేటి సభకు స్పష్టం చేశారు.

# సింగరేణి ప్రాంతీయ ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టుల భర్తీ

## 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్‌లాబ్ ప్రారంభిస్తాం

## అసెంబ్లీలో డిప్యూటీసిఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలుచోట్ల ఉన్న సింగరేణి ఆసుపత్రుల్లో మార్చి నాటికి డాక్టర్లు ఇతర వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయనున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రానున్న 75 రోజుల్లోనే గోదావరిఖనిలో క్యాత్ లాబ్‌ను ప్రారంభిస్తామని అసెంబ్లీలో డిప్యూటీ సీఎం ప్రకటించారు. మంగళవారం అసెంబ్లీలో సింగరేణిపై ప్రశ్నోత్తరాలు సభ్యులు అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం సమాధానం ఇచ్చారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సింగరేణి పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో పెండింగ్‌లో ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను మార్చి నాటికి పూర్తిగా భర్తీ చేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రస్తుతం 11 మంది కాంట్రాక్ట్ డాక్టర్లు పనిచేస్తున్నారని, 32 మంది డాక్టర్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలోనే ఆ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. 176 పారామెడికల్ సిబ్బంది అంతర్గత నియామకం ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. రామగుండంలో క్యాత్ లాబ్ నిర్మాణం పిపిపి మోడల్‌లో చేపడుతున్నామని కాంట్రాక్ట్ అవార్డు కూడా పూర్తయిందని, 75 రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు సింగరేణి ఆసుపత్రుల్లో మందుల సౌకర్యం కల్పిస్తున్నామని, సిపిఆర్ఎంఎస్ పథకం అందుబాటులో ఉన్నదని వెల్లడించారు. రిటైర్డ్ ఉద్యోగులు రూ. 8 లక్షల వరకు మందులను తీసుకునే అవకాశం కూడా కల్పించామన్నారు. టెర్మినల్ బెనిఫిట్స్ కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాల్లో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఇండ్ల నిర్మాణం కొరకు స్థల కేటాయింపు అంశాన్ని బోర్డులో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని భట్టి సభ్యులు ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ సింగరేణి సంస్థ అని వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధుల అందరిపై ఉందన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ సవాళ్ల మధ్య సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాల వల్ల రాష్ట్రంలోని బొగ్గు గనులను నేరుగా సింగరేణికి కేటాయించకుండా వేలం నిర్వహిస్తున్నారని, దీనివల్ల ప్రైవేట్ ఏజెన్సీలు రంగ ప్రవేశం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వేలం ప్రక్రియలో పాల్గొనక పోవడం వల్ల సింగరేణి కొన్ని గనులను కోల్పో యిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక సింగరేణిని స్వయంగా వేలంలో పాల్గొనేలా ప్రోత్సహించి కొన్ని బొగ్గు బావులను దక్కించుకునేలా చేశామని వెల్లడించారు.
ప్రస్తుతం మార్కెట్లో సింగరేణి ఉత్పత్తి చేస్తున్న బొగ్గు ధర కంటే ప్రైవేట్ సంస్థలు తక్కువ ధరకే బొగ్గును సరఫరా చేస్తున్నాయని, వినియోగదారులు సహజంగానే తక్కువ ధర ఎక్కడ ఉంటే అక్కడ కొనుగోలు చేస్తారని భట్టి వివరించారు. ఈ పరిస్థితి సింగరేణి బొగ్గు అమ్మకాలపై ప్రభావం చూపుతుందన్నారు. సింగరేణి మనుగడ, కార్మికుల సంక్షేమం కొరకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలు ముగిసిన పది రోజుల్లోగా సింగరేణి పరిధిలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సంస్థ సీఎండీ, డైరెక్టర్లతో ఒక ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. కార్మికుల భద్రతకు భరోసా కల్పిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం లేదా సింగరేణి సంస్థపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా కేవలం బ్యాంకుల ద్వారానే కోటి రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వెల్లడించారు. సింగరేణిలో విజయవంతంగా అమలు చేస్తున్న కోటి రూపాయల బీమా పథకాన్ని, అదే తరహాలో విద్యుత్ శాఖలోని డిస్కంలలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పారు.

# కొత్తగా 58 అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

## గతేడాది 8,861 ప్రమాదాల్లో అసువులు బాసిన 163 మంది

## శాసనసభలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా 58 అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో ప్రకటించారు. మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల్లో భాగంగా రాష్ట్రంలో అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటుపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. రాష్ట్రంలో గత ఏడాది కాలంలో 8861 ఫైర్ యాక్సిండెట్ ఘటనలు జరిగాయని, వాటి వల్ల రూ. 879 కోట్ల ఆస్తులు నష్టం జరిగాయన్నారు. అగ్ని ప్రమాదాల మూలంగా 163 మంది చనిపోయారని తెలిపారు. సంగారెడ్డి దగ్గర సిగాచి అగ్నిప్రమాదం, చార్మినార్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకే ఇంట్లో 17 మంది చనిపోయారని మంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో 138 ఫైర్ స్టేషన్లు, 9 ఔట్ పోస్టులు ఉన్నాయన్నారు. 544 ఫైర్ సేఫ్టీ వాహనాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 58 అగ్నిమాపక కేంద్రాలు మంజూరు చేసినట్టు తెలిపారు. వాటిలో చర, దేవరకద్ర, కల్లూరు, గుండాల, బోథ్, కొంకచర్ల, రుద్రంగి, జయనాథ్ మండలం హెచ్ క్యు, బయ్యారం, తూప్రాన్, పాశమైలరం, జిన్నారం, బీబీ నగర్, ఉప్పల్ బగాయత్, బాచుపల్లి, ఘట్కేసర్‌లు తదితర ప్రాంతాలకు వచ్చాయన్నారు. వాటితోపాటు గౌలిగూడ, సికింద్రాబాద్, ఓల్డ్ మారేడు పల్లి, ఖైరతాబాద్, మియాపూర్ తదితర ప్రాంతాలలో అగ్నిమాపక కేంద్రాల స్థాయి పెంపు చేయడం జరుగుతుందన్నారు. పెరుగుతున్న హైరేజ్ బిల్డింగ్స్ నేపథ్యంలో 18 అంతస్తులు, 104 అంతస్తుల బిల్డింగ్‌కి సంబంధించి మిషనరీ ప్రాసెస్‌లో ఉన్నాయన్నారు. గేటెడ్ కమ్యూనిటీ, ఆసుపత్రులు పరిశ్రమలు, విద్యాలయాలు ఫైర్ సేఫ్టీపై 13658 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడడంతోపాటు ప్రమాదం నుండి ఎలా కాపాడుకోవాలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫైర్ సేఫ్టీ సిబ్బంది నియామకాలు ఎక్కడ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ లూస్ కేబుల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, వాటి ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని.. వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఫైర్ సేఫ్టీతో అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# కవిత కూడా కాంగ్రెస్‌లోకి వచ్చినా ఆశ్చర్యం లేదు

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 6:** కల్వకుంట్ల కవిత తన పొలిటికల్ కెరీర్‌పై దృష్టి సారించిన తరుణంలో.. ఆమె కాంగ్రెస్ గూటికి చేరుతారనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.. దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి నేతలు కాంగ్రెస్‌లోకి వస్తారని ఎవరూ ఊహించలేదని.. కానీ వారు వచ్చినట్లు వెల్లడించారు. అదే బాటలో కవిత కూడా కాంగ్రెస్‌లో చేరితే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. కవిత సొంత పార్టీ పెడతారనే ప్రచారం జరుగుతున్న వేళ.. అధికార పార్టీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మంత్రి పదవిని బలంగా ఆశిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి తన మనసులోని మాటను మరోసారి బయటపెట్టారు. తనకు మంత్రి పదవి దక్కకపోతే అది తనకంటే ఎక్కువగా పార్టీకే నష్టమని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు కోట్ల జనాభా ఉన్న రంగారెడ్డి జిల్లాకు ఇప్పటివరకు మంత్రి పదవి దక్కలేదని అన్నారు. పార్టీ పెద్దలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. జిల్లా పేరు మార్పు కేవలం ఊహాగానమేనని.. మున్సిపాలిటీలు పెరిగినా జిల్లా స్వరూపం మారకూడదని ఆయన స్పష్టం చేశారు.

# ఎక్కడా యూరియా కొరత లేదు

## రబీకి అవసరమైన దానికంటే అదనంగా నిల్వలున్నాయి

## 36 ఫెర్టిలైజర్స్ లైసెన్స్‌ల సస్పెన్షన్, 2 లైసెన్స్‌లు రద్దు

## శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రబీకి ఎరువుల కొరత లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రబీకి అవసరమైన దానికంటే అదనంగా యూరియా నిల్వలు ఉన్నాయని.. అవసరమైతే అదనంగా 60వేల మెట్రిక్ టన్నుల యూరియా తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో రైతులకు అసరమైన యూరియా ఉందా? లేకపోతే ఎంత కొరత ఉందని సభ్యులు కె మదన్ మోహన్ రావు ప్రశ్నించారు. ఇందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానమిస్తూ.. రాష్ట్రంలో యూరియాకి కొరత లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గత ఏడాది రబీలో ఈ కాలం నాటికి 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. అందులో జనవరి 5 నాటికి గత సంవత్సర విక్రమాల ప్రకారం 3,36,350 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని.. అయితే జనవరి 5 నాటికి రాష్ట్రంలో 6,19,486 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయబడిందని మంత్రి తెలిపారు. అందులో ఇప్పటి వరకు 4,51,601 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయన్నారు. ఇంకా 1,67,885 మెట్రిక్ టన్నుల యూరియా మిగుల లభ్యతలో ఉందన్నారు. మిగిలిన పరిమాణాన్ని జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో సరఫరా చేస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. జనవరి నెలకు అదనంగా 60వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు మంత్రి తెలిపారు. వ్యవసాయేతర అవసరాల కోసం యూరియా మళ్లింపును అరికట్టడానికి చర్యలు తీసుకుంటు న్నట్టు తెలిపారు. యూరియా అక్రమ మళ్లింపుల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇప్పటి వరకు 36 లైసెన్స్‌లు సస్పెండ్ చేశామని, 2 లైసెన్స్‌లను రద్దు చేసినట్టు తెలిపారు. 9 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా.. 14 మందిని అరెస్టు కూడా చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభకు తెలిపారు.

# ఎస్ఐఆర్‌పై అక్బరుద్దీన్ వర్సెస్ ఏలేటి డైలాగ్ వార్

## అసెంబ్లీలో ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్



**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** ఓవైసీ, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మధ్య మరోసారి డైలాగ్ వార్ నడిచింది. ఎస్ఐఆర్ విషయంలో ఇరు నేతల మధ్య వాగ్వాదంతో సభలో రాజకీయ వేడి రాజేసింది. మున్సిపాలిటీ సవరణ బిల్లు సందర్భంగా శాసనసభలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ బీహార్, బెంగాల్ లో మైనార్టీ ఓట్లు 50లక్షలు తొలగించారని మండి పడ్డారు. ఎస్ఐఆర్ బిహార్, యుపినే కాదు దేశం మొత్తం తెస్తు హిందూ ముస్లిం అంటూ తారతమ్యం చేస్తున్నారన్నారు. ఈసందర్భంగా అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ఓవైసీ ఇష్టారాజ్యాంగా మాట్లాడితే స్పీకర్ ఎందుకు అపడం లేదన్నారు. ఇవాళ సభలో జరుగుతున్న చర్చ ఏమిటి? అక్బరుద్దీన్ మాట్లాడుతున్నదే మిటన్నారు. ఎస్ఐఆర్ కావాలనుకుంటే ప్రత్యేక చర్చ పెట్టాలని అంతే తప్ప జరుగుతున్న చర్చను పక్కదారిపట్టించేలా చూడవద్దన్నారు.



ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియ కేంద్ర ఎన్నికల సంఘం చేస్తుందని అర్హులైన వారికి ఓటుహక్కు ఇవ్వాలని రాహుల్‌గాంధీ చెప్పారన్నారని ..ఓవైసి ఓట్ జోరి జరుగుతుందని చెప్పడం తప్పాఅని బిజెపి నేతలను ప్రశ్నించారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై ఐక్య ఉద్యమం

## యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సమావేశంలో తీర్మానం

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యారంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ ప్రకటించింది. యుఎస్‌పిసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సమావేశం మంగళవారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సిహెచ్ అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో టిఎస్ యుటిఎఫ్, టిపిటిఎఫ్, డిటిఎఫ్, ఎస్సీ ఎస్టీ టిఎఫ్, టిటిఎ, ఎస్సీ ఎస్టీ యుయస్, ఎంఎస్టీఎఫ్, బిటిఎఫ్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.
పెండింగ్‌లో ఉన్న 5 డిఎల గురించి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడటం లేదని, డిసెంబర్‌లో ఇస్తానన్న డిఎ ఇవ్వలేదని, వారంలో ఇస్తామన్న నగదు రహిత వైద్య పథకం మూడు నెలలు గడిచినా కార్యరూపం దాల్చలేదని స్టీరింగ్ కమిటీ నాయకులు మండిపడానదరు. 30 నెలలు గడిచినా పిఆర్‌సి నివేదికను తెప్పించుకోలేదని, రిటైరైన ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్ విడుదల చేయడం లేదన్నారు. విద్యారంగంలోని సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయన్నారు. ఎనిమిదేళ్ళయినా నూతన జిల్లాలు, మండలాలకు పర్యవేక్షణ అధికారుల పోస్టులు మంజూరు చేయలేదని సర్వీసు నిబంధనలు రూపొందించడంలో జాప్యం జరుగుతోందని యుఎస్‌పిసి నాయకులు విమర్శించారు.

# అసెంబ్లీ మీడియా పాయింట్

## ఉద్యోగస్తుల పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే ఆమరణ దీక్ష చేపడతా

## బిజెపి ఎమ్మెల్యే కోటిపల్లి వెంకటరమణారెడ్డి

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగుల గురించి జీరో అవర్లో మాట్లాడడం జరిగినా ప్రభుత్వం నుండి స్పందన లేదని బిజెపి ఎమ్మెల్యే కోటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. 'ఉద్యోగస్తుల సహకారం లేకుండా ఏ ప్రభుత్వం ముందుకు సాగదు. గత ప్రభుత్వం 15కి జీతాలు, రిటైర్డ్ అయిన వాళ్ళకి కొంతైనా బిల్లులు ఇచ్చింది. ఈ ప్రభుత్వం ఒకటవ తేదీన జీతాలు తప్ప ఏమీ ఇవ్వడం లేదు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల గురించి ఈ ప్రభుత్వానికి సోయి లేదు. గత ఏడాది మార్చి నుండి 20,500 మంది ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారు. ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన బెనిఫిట్లు, బిల్లులు ఇవ్వాల్సి ఉంది. ఎన్నికలు వస్తే విద్య, రెవెన్యూ, పోలీసు వ్యవస్థలు విపరీతంగా పనిచేస్తాయి. రిటైర్డ్ అయిన వాళ్లకు అలవెన్స్ లేవు, ఉద్యోగం చేస్తున్న వారికి లేవు. టి.ఏ., డీఏ మాట లేదు. పీఆర్సీ ఊసే లేదు. అసెంబ్లీ చుట్టూ పోలీసులు కాపలా కాస్తున్నారు. వారికి అలవెన్సులు లేవు. ఉద్యోగులు సొంతంగా జమ చేసుకున్న డబ్బులు కూడా ఇవ్వడం లేదు. రాష్ట్ర ఖజానాలో తప్పకుండా ఇవ్వాల్సిన బిల్లులు ఉంటాయి. ఉద్యోగులకు ఇచ్చిన తరువాతే సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఖర్చు చేయాలి. 750పైగా ఉద్యోగులు వారి పెండింగ్ బిల్లుల కోసం కోర్టుకు వెళ్లారు. అయినా ఇప్పటికీ ఇవ్వలేదు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 18 నెలలుగా మెయింటెనెన్స్ బిల్లులు లేవు. అధికారులు సొంతంగా ఖర్చు చేస్తున్నారు. ఉద్యోగులు చనిపోతే అంత్య క్రియలకు ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వడం లేదు. రిటైర్డ్ ఉద్యోగులు తమ బెనిఫిట్లు అందక మనోవేదనతో, గుండెపోటుతో మరణించారు. ఉద్యోగులకు హెల్త్ కార్డ్, ఆరోగ్య భద్రతను కూడా ఇవ్వనని పరిస్థితిలో ప్రభుత్వ ఉంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు తిరుగుతున్నారంటే పోలీసులు కారణం. కెసిఆర్ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వలేకనే రిటైర్మెంట్ వయస్సు పెంచారు. ఇప్పటికీ సుమారు 14 వేల కోట్ల రూపాయలు ఉద్యోగుల పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఆర్థిక శాఖ మంత్రి నెలకు 700 కోట్లు ప్రభుత్వ ఉద్యోగుల బిల్లులు విడుదల చేస్తామని ఇప్పటికి ఆరు నెలల గడుస్తున్నా, వెయ్యి కోట్లు కూడా విడుదల చేయలేదు! తమ రిటైర్మెంట్ బెనిఫిట్ల కోసం షుగర్, బీపీలతో నిన్న రిటైర్డ్ ఉద్యోగులు రోడ్డు ఎక్కారు!. మార్చి 1వ తేదీ లోపు ఉద్యోగస్తులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకపోతే మార్చి 2 తారీకు నుండి నేను నిరాహార దీక్షలో కూర్చుంటాను. నిరాహార దీక్షతో ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ నిరాహార దీక్ష కూర్చుంటాను. ఉద్యోగస్తుల పెండింగ్ బిల్లు చెల్లించే వరకు నేను శాసనసభకు రాను. ఉద్యోగస్తులు పెన్ డౌన్ చేసే పరిస్థితి వస్తే పాలనా వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది' అన్నారు.




**కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాలి: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్**




ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బిఆర్ఎస్ పార్టీపై చేసిన అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'బిఆర్ఎస్ నేతలు కృష్ణాజిల్లాపై తమ తప్పులు కప్పిపుచ్చుకునే ప్రయత్నం కూడా చేయలేక వెళ్లిపోయారు. సభకురాని బిఆర్ఎస్ నేతలు సభా హక్కుల గురించి ఏలా మాట్లాడుతున్నారు? భయపడి దాక్కొని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం చేసే తపన బి.ఆర్.ఎస్ పార్టీ నేతల్లో కనబడడం లేదు. వారి కుటుంబ సభ్యురాలు కవిత బి.ఆర్.ఎస్ పార్టీపై చేసిన అవినీతి ఆరోపణలకు సమాధానం లేదు! అంబేద్కర్ విగ్రహ నిర్మాణంలో అవినీతి జరిగింది అని కవిత చెపుతున్నది. అమరవీరుల స్మారక అమరజ్యోతి నిర్మాణంలో కూడా అవినీతి జరిగింది అని కవిత అంటున్నది! సమాధానం చెప్పండి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషివల్ల కృష్ణా జలాల దోపిడి కాకుండా ఆగిపోయింది. వాస్తవాలు బయటపడతాయని, అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేకనే బి.ఆర్.ఎస్ నేతలు అసెంబ్లీకి రావడం లేదు. స్పీకర్ గారిపై నిందారోపణలు చేస్తున్న బి.ఆర్.ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలి. ఉద్యోగ సంఘాలతో ఎప్పటికప్పుడు ప్రభుత్వం చర్చలు జరుపుతూ ఉంది. ఉద్యోగస్తుల ఆలోచనలకు అనుగుణంగా ఈ ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేస్తుంది" అన్నారు.

# మార్చికల్లా సమగ్ర సమాచారంతో భూభారతి కొత్త యాప్

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## రెవెన్యూశాఖ నూతన సంవత్సరం-2026 డైరీ ఆవిష్కరణ

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 6, ప్రభాతవార్త :** రానున్న కొద్దిరోజులు ఇప్పుడున్న భూభారతి యాప్‌ను పునరుద్ధరించి కొత్త యాప్‌ను తీసుకొచ్చే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టామని, మార్చి నెల నాటికి ఆ కొత్త యాప్ ప్రజోపయోగ సమగ్ర సమాచారంతో రాబోతుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ యాప్ ద్వారా రెవెన్యూ రికార్డులతోపాటు భూసర్వేకి సంబంధించిన వ్యవస్థ మ్యాపులతోసహా వ్యవసాయేతర భూములు ఏవైతే ఉన్నాయో అవి వ్యవసాయానికి యోగ్యంకాని భూములు కానీ, నివాసయోగ్యమైన భూములను ఒకే ఫ్లాట్‌ఫారంలోకి సింగిల్‌పేజీలోకి తీసుకొస్తున్నామని చెప్పారు. దీనివల్ల ఎక్కడా చిన్న తప్పులు, అవకతవకలు జరగకుండా పారదర్శకంగా రాష్ట్రంలో ఉండే ప్రజలకు వారి ఆస్తుల, ప్రభుత్వ ఆస్తుల భద్రతతోపాటు వారు ప్రపంచంలో ఎక్కడున్నా వారికి సంబంధించిన ఆస్తులు సరిగ్గా ఉన్నవీ లేనివీ చూసుకునేట్లు ఈ కొత్త యాప్ ఉంటుందన్నారు.
నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెస్సా) ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘ ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్, టీఎన్జీవో నాయకులు శ్రీనివాసరావు, నర్సింహారెడ్డి, రమణారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రాజకుమారి, చంద్రకళ తదితర ట్రెస్సా బాధ్యులతో కలిసి రెవెన్యూ శాఖ నూతన సంవత్సరం 2026 డైరీ ఆవిష్కరించి ప్రసంగించారు. గత 10సంవత్సరాల్లో ధరణి, దాంతో వచ్చిన ఇబ్బందులు, కష్టాలు, ఉద్యోగులతోపాటు భూములున్న ఆసాములకు వచ్చిన కష్టాలు, బాధల నుండి విముక్తి కలిగించే విధంగా ఆనాటి పెద్దలు భ్రష్టుపట్టించిన రెవెన్యూ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన ఎన్ని ఇబ్బందులొచ్చినా ఎదుర్కొని ఎన్నో సంస్కరణలు ప్రజాప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేయడమే కాకుండా చట్టంలోని లొసుగుల్ని సంస్కరణల రూపంలో సరిదిద్ది ప్రజలకు ఉపయోగకరరీతిలో మార్పులు చేశామన్నారు. అంతేకాక రాష్ట్రంలో రాష్ట్రంలో సర్వేయర్ల సంఖ్యను ప్రభుత్వపక్షాన పెంచుతూ అదేవిధంగా లైసెన్స్‌డ్ సర్వేయర్లను కూడా గతంలో 6వేల మందిని ఎంపికచేశామని, మరో 2500మందిని నాలుగైదు రోజుల్లో ఆర్డర్లు ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు. చివరిగా తమశాఖ ఉద్యోగుల కోర్కెలు, సమస్యలను సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందులు ఉద్యోగులకు, ఉద్యోగుల ఇబ్బందులు ప్రభుత్వానికీ తెలియనిది కాదని, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కొంతకాలం అటుఇటూ అయినా అన్నింటిని పరిష్కరిస్తామని ఉద్యోగులకు మంత్రి పొంగులేని శ్రీనివాసరెడ్డి హామీనిచ్చారు.

## త్వరలోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్!

### అత్యంత పకడ్బందీగా డివిజన్, వార్డు అభ్యర్థుల ఎంపిక

### సిఎం రేవంత్‌రెడ్డితో పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి 6:** త్వరలోనే మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. వారం,పది రోజుల్లో షెడ్యూల్ వెలువడొచ్చని సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ పార్టీ ముఖ్యనేతలను అలర్ట్ చేస్తున్నారు. షెడ్యూల్ లోపే పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాల్లో పెండింగ్ పనులను గుర్తించి పూర్తి చేసేలా నిధులు విడుదల చేయించాలని సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులను ఆదేశించినట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్ అయింది, మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. 2019 మున్సిపల్ చట్టంలో కీలక మార్పు చేస్తూ బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఓటర్ల జాబితా సవరణకు 60 రోజుల ముందే సమాచారం ఇవ్వాలన్న నిబంధన తొలగించారు. దీంతో భారత ఎన్నికల సంఘానికి ముందస్తు సమాచారం అవసరం ఇక లేదు. ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభం కాగా. ఈనెల 10న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. చట్ట సవరణతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వానికి పూర్తి వెసులుబాటు వచ్చింది. ఇదిలా ఉండగా, ఈనెల వారం,పది రోజుల్లో ఎన్నికలషెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని తెలుస్తోంది. తెలంగాణలో గడువు ముగిసిన 117 మున్సిపాలిటీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఇదివరకే నిర్ణయించిన సంగతి తెలిసిందే. కాగా, శాసనసభ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గంట పాటు సమావేశమయ్యారు. పార్టీ విషయంలో డివిజన్, వార్డ్ ఆభ్యర్థుల ఎంపికను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి వార్డు, డివిజన్‌ల నుంచి ఆరుగురు చొప్పున అభ్యర్థుల ప్రతిపాదనలను స్వీకరించి ఒక సర్వే నిర్వహించి సరైన అభ్యర్థులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను సాధించేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని చర్చించారు.

## 12 యేళ్ల తరువాత నెరవేరిన ఎల్ఐజి వర్గాల సొంత ఇంటికల

### పారదర్శకంగా లాటరీ..హౌసింగ్‌బోర్డు వైస్‌చైర్మన్ విపి గౌతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి 6:** నగరంలో అత్యంత డిమాండ్‌తో, ఖరీదైన ప్రాంతమైన గచ్చిబౌలిలో హౌసింగ్ బోర్డు 12 యేళ్ల తరువాత 111 ఎల్ఐజి ఫ్లాట్లను కేటాయించి అల్పాదాయ వర్గాల సొంత ఇంటి కలను నిజం చేసింది. మంగళవారం నాడు వీటికి సంబంధించిన లాటరీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా విజయవంతంగా నిర్వహించింది. అర్హులైన వారికే ఇవి కేటాయించేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని బోర్డు వైస్ ఛైర్మన్ విపి గౌతం తెలిపారు.



నిరుద్యోగులతో కలిసి వైద్య ఆరోగ్య శాఖా డైరెక్టరేట్ కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## ల్యాబ్‌టెక్నిషన్లకు పోస్టింగ్ ఇవ్వాలి

### వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ ముట్టడించిన నిరుద్యోగులు

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్య శాఖలో సెలెక్ట్ అయిన 1286 ల్యాబ్ టెక్నీషియన్స్ వెంటనే పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు మంగళవారం కోఠిలోని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. రాష్ట్రంలో 33 జిల్లాల నుంచి భారీ ఎత్తున గుంపులు గుంపులుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా నిరుద్యోగులతో కలిసి డైరెక్టరేట్ కార్యాలయం వద్ద బైఠాయించిన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఒకేసారి భారీ మొత్తంలో 5500 స్టాఫ్ నర్స్ పోస్టులను 1286 ల్యాబ్ టెక్నీషియన్స్ పోస్టులను భర్తీ చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ నరసింహాకు అభినందించారు. అయితే ఏడాది కాలంగా రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ జరిగింది. ఇప్పుడు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పోస్టింగ్స్ ఆర్డర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదల చేసిన మొదటి నోటిఫికేషన్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2 ఉద్యోగాలని,ఈ ప్రక్రియ ప్రారంభమై దాదాపు ఏడాది పాటు ఎమ్మెల్సీ ఎన్నికలని, ఉపఎన్నికలని, పంచాయతీ ఎన్నికలని..ఇలా ఎన్నో అవాంతరాలు దాటుకుని చివరకు ఎంపిక ప్రక్రియ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేశారన్నారు. నేడు ఆఖరి అడుగులో 'అపాయింట్మెంట్ లెటర్ల' కోసం నెలల తరబడి నిరీక్షి ంచాల్సి రావడం నిరుద్యోగుల తీవ్ర ఆవేదన కలిగిస్తోం దన్నారు.

## మామిడికి వైరస్.. రాలిపోతున్న పూత

### భారీగా తగ్గనున్న దిగుబడి, ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** వాతావరణంలో వచ్చిన మార్పులు మామిడి రైతులకు శాపంగా మారాయి. వడగండ్ల వర్షాలు, పొగ మంచు, ఉష్ణోగ్రతల మార్పులతో మామిడి చెట్లుకు పూత రావడం లేదు. కొన్నింటి పూత వచ్చినప్పటికీ ఎక్కువ భాగం రాలిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా తెలంగాణలో మామిడి తోటలకు వైరస్ వ్యాపించింది. దీంతో మామిడి చెట్లపై పూత లేకపోవడం, కాస్తో కూస్తో ఉన్న పూత రాలిపోతోంది. ప్రస్తుత వాతావరణ ప్రభావం, మంచు కారణంగా ఇప్పటికే మామిడి తోటలకు 15 శాతం కూడా పూత రాలేదు. దీనికి తోడు మామిడి చెట్లకు తామర పురుగు వైరస్ వ్యాపించడంతో పూత రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా అంతంత మాత్రంగా ఉన్న పూత కూడా రాలిపోతుందని చెబుతున్నారు. అంతేకాకుండా నెల రోజులుగా రాత్రి పూట ఉష్ణోగ్రత సాధారణం కన్నా దాదాపు ఏడు డిగ్రీల వరకూ నమోదు కావడం, ఉదయం పూట పొగ మంచు విపరీతంగా కురుస్తున్నందున మామిడి పూతపై నలుపు రంగు మచ్చలు సైతం ఏర్పడుతున్నాయి. మిరప రైతులను నట్టేట ముంచిన తామర పురుగు ఇప్పుడు మామిడి తోటలకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున పెట్టుబడులను నష్టపోయే అవకాశాలు ఉన్నాయని పలువురు రైతులు కన్నీటి పర్యాంతమవుతున్నారు. ఈ వైరస్ వ్యాపించడంతో మామిడి చెట్లకు పూత నిలవక పిందెలు కాక దిగుబడి భారీగా తగ్గుతుందని చెబుతున్నారు. సాధారణంగా మామిడి చెట్లకు డిసెంబర్ నెలలో పూత మొదలవుతుంది. అయితే ఆలస్యంగా ఈ నెలలో పూత రావడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరు నాటికి పూతతో మామిడి తోటలు కళకళలాడాల్సిన సుండగా, తామర పురుగుతో పూత రాలిపోతోంది. మరోపక్క మామిడికి ఇప్పటికే పలు ప్రారంతాల్లో తేనె మంచు పురుగు ఆశించి నల్ల మచ్చలు ఏర్పడి కాయ నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. రాష్ట్రం మొత్తం మీద 3.20 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. తద్వారా ఎకరానికి 4 వేల టన్నుల చొప్పున 12,70,364 టన్నుల మేర దిగుబడి వస్తోంది. మామిడిలో ప్రధానంగా బంగినపల్లి, చిన్న రసాలు, తోతాపురి, తెల్ల గులాబీ, పెద్ద రసాలు, సువర్ణరేఖ తదితర రకాలు ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లాలో 34 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఖమ్మంలో 33,800 ఎకరాలు, నాగర్ కర్నూల్‌లో 25,931 ఎకరాలు, రంగారెడ్డిలో 22,583 ఎకరాలు, మంచిర్యాలలో 18 వేల ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 15,863 ఎకరాల మేర తోటలు ఉన్నాయి.

# హిల్ట్ పాలసీతో రాష్ట్రానికి రూ.10,776 కోట్ల ఆదాయం

### 2014 నుంచి నేటీ వరకు అన్ని లావాదేవీలపై ఏ విచారణకైనా సిద్ధం

### సభలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 6** :పారదర్శకంగా అందరికీ ఒకే నిబంధనలు వర్తించేలా ఆరు నెలల కాలవ్యవధిలో అమలులోకి తీసుకువచ్చే విధంగా హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ ఫర్మేషన్ పాలసీ) ని ప్రభుత్వం తీసుకువచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అసెంబ్లీలో తెలిపారు. హిల్ట్ పాలసీ లేకపోతే ఎకరానికి రూ.12 లక్షలు మాత్రమే ఆదాయం వచ్చేది. కానీ ఈ రోజు కొత్త పాలసీ ద్వారా ఎకరాకు రూ.7 కోట్ల ఆదాయం రాబోతోందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఫ్రీ హోల్డ్, గ్రిడ్ పాలసీ ద్వారా రూ.574కోట్ల ఆదాయం వచ్చే చోట రూ.10,776 కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు వచ్చేలా హిల్ట్ పాలసీని రూపొందించామని ఆయన చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం తెచ్చే పాలసీపై అడ్డగోలుగా మాట్లాడుతూ విషం కక్కవద్దని ప్రతిపక్షాలకు డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్షాలకు ఎలాంటి అనుమానాలు ఉన్నా నివృత్తి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అనుమానాలు ఉన్న సభ్యులు ఎవరైనా ప్రభుత్వానికి లేఖ రాస్తే 2014 నుంచి నేటి హిల్ట్ పాలసీ వరకూ ఏ ఏజెన్సీ ద్వారా అయినా ఎలాంటి విచారణకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఒకపక్క కాలుష్యకారక పరిశ్రమలను రింగ్ రోడ్ బయటకు తరలిస్తూ నగరంలో డీజిల్ బస్సులను దశల వారీగా హైదరాబాద్ అవతలికి తరలిస్తూ.. ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నాం. ఎస్టీపీల ద్వారా డ్రైనేజీ కాలువల నీటిని శుద్ధి చేస్తున్నాం. ఈనగరాన్ని మాత్రమే కాకుండా రాష్ట్రాన్ని కాపాడేందుకు హిల్ట్ పాలసీ తీసుకువచ్చామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీ రాగానే రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం 5లక్షల కోట్ల కుంభకోణం జరుగుతోందని ప్రకటించారు. మరొకరు 9 వేల ఎకరాలను అమ్మకానికి పెట్టి అంతకన్నా ఎక్కువ స్థాయిలో కుంభకోణం అని ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాలు మర్చిపోయి బీఆర్ఎస్ నేతలు ప్రకటనలు చేశారు. గుడ్డ కాల్చి పక్కవాడి మీద వేసి మసి తుడుచుకోమన్నట్లు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కన్నా.. వ్యక్తిగత ప్రయోజనాలే వారికి ముఖ్యం అని డిప్యూటీ సీఎం దుయ్యబట్టారు. హైదరాబాద్ మహానగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. పరిశ్రమలు రావడంతోనగరం విస్తృత స్థాయిలో ముందుకు సాగుతోంది. రాచరికం నుంచి ప్రజాస్వామ్య ప్రభుత్వాల వరకు హైదరాబాద్ ను అభివృద్ధి చేశారు. 1927లో నిజాం కమిటీని వేసి 136 ఎకరా లభూమిని పరిశ్రమల కోసం కేటాయించారు. పరిశ్రమల భూముల్లో లీజులు, ప్రభుత్వం అమ్మిన భూములు, వ్యక్తిగత భూములపై పరిశ్రమలు పెట్టారు. పరిశ్రమల భూములపై హక్కులన్నీ పరిశ్రమల యాజమాన్యం వారిదే. వాటిపైన ప్రభుత్వానికి ఎటువంటి హక్కులు లేవు. ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన హిల్ట్ పాలసీ వల్ల రాష్ట్రానికి మేలు జరుగుతుంది. గత ప్రభుత్వం ప్రభుత్వ భూములను ప్రయివేటు వ్యక్తులకు ధారదత్తం చేస్తే.. మా ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు యాజమాన్య హక్కులు ఉన్నా.. వారి నుంచి కూడా ప్రభుత్వానికి ఆర్థిక లాభం చేకూరేలా నిర్ణయం చేశాం. మా ప్రభుత్వం రూపాయి రూపాయి కూడబెట్టి ప్రజలకు అందిస్తున్నాం. హైదరాబాద్ నగరంలో వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. పరిశ్రమలను నగరం నుంచి బయటకు తీసుకువెళ్లాలని 2012లోనే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ 2013లో ప్రభుత్వానికి ఒక నివేదిక ఇచ్చింది. గత ప్రభుత్వం పారిశ్రామిక పార్కులను ఐటీ పార్కులుగా మార్చాలని నిర్ణయం తీసుకుంది. అందులో బాగంగా 50 శాతం ఐటీ పార్కుల కోసం కేటాయించి.. మిగిలిన 50 శాతం భూమిని కమర్షియల్ గా మార్చుకునేలా అవకాశం కల్పించింది. గత ప్రభుత్వమే ఎస్ఆర్ఓ ధరపైన 30 శాతం అదనంగా కట్టి.. భూమిని కన్వర్ట్ చేసుకునే అవకాశం ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదు. మా ప్రభుత్వం హిల్ట్ పాలసీ తీసుకువచ్చింది. దీనికి సంబంధించి సీరియస్ గా కేబినెట్ సబ్ కమిటీని వేసిందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు.

# సామాజిక తెలంగాణ కోసం కలిసి నడుద్దాం

### మీరే నా బలం అంటూ కవిత భావోద్వేగం

### నివాసం వద్ద భారీ సంఖ్యలో అభిమానులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి 6:** సామాజిక తెలంగాణ సాధన కోసం కలిసి నడుద్దామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తెలంగాణ అస్తిత్వం కోసం పనిచేసే పార్టీ అవసరం ఉందని తెలంగాణ ఉద్యమ కారుల జెఎసి నాయకులు ప్రజా సంఘాలు, ఉద్యోగ, కుల సంఘాలు, వివిధ యూనివర్సిటీల విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు మంగళవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవితను కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కవితకు సంఘీభావం తెలిపేందుకు బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్దకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యమకారులు జాగృతి కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా కవిత తన ఇంటి బాల్కనీలో నిలబడి అందరికీ చేతులు జోడించి అభివాదం చేశారు. తర్వాత కిందకు వచ్చి ప్రతి ఒక్కరినీ పలకరించారు. 'ఎలా ఉన్నారు? ఇంట్లో అందరూ బాగున్నారా?' అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తన వెన్నంటి ఉండి, ఇప్పుడు కష్టకాలంలో కూడా మద్దతుగా నిలిచిన ఉద్యమకారులను చూసి కవిత భావోద్వేగానికి లోనయ్యారు. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె గొంతు కంపిస్తూ 'మీరు లేకపోతే నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. మీరు నా బలం' అంటూ మాట్లాడారు. ఈ సందర్భంలో అక్కడి పరిసర ప్రాంతాలు నినాదాలతో మారు మోగాయి. "జై తెలంగాణ... కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి... తెలంగాణ జాగృతి జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. "ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కవితకు అండగా ఉంటాం.



తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల కోసం పనిచేస్తాం" అని నినదించారు. ఈ సందర్భంగా వారందరికీ కవిత అభివాదం చేసి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ కోసం కవిత ఆధ్వర్యంలో రాబోయే పార్టీకి తమ మద్దతు ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. సింగరేణి కార్మికులు, హెచ్ఎంఎస్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, బిసి సంఘం, అన్ని యూనివర్సిటీల విద్యార్థి సంఘాలు, తొలి, మలి దశ ఉద్యమకారుల జెఎసి, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జెఎసి, తెలంగాణ పొలిటికల్ జెఎసి, ఆటో యూనియన్ నాయకులు, మహిళా సంఘాలు, కుల సంఘాల నాయకుల బాధ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కవితను కలిసిన వారిలో ఉన్నారు. తనపై నమ్మకంతో ఇంత దూరం వచ్చిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే నిరంతరం పోరాటం ఉంటుందని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నడిచే తమకు అందరూ మద్దతివ్వాలని కవిత కోరారు.

# ప్రమాదపు అంచుల్లో వేప

### వైరస్‌తో ఎండిపోతున్న చెట్లు

### ఫోమోప్సిస్ అనే శిలీంధ్రం వ్యాప్తి

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** సహజ సంజీవని అయిన వేప నేడు ప్రకృతి వైపరీత్య ప్రమాదపు అంచుల్లో చిక్కుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కొంతకాలంగా వేపకు వైరస్ సోకుతుండడంతో జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో చెట్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. చెట్టంతా నిలువెల్లా ఎండిపోతూ ఆకులన్నీ రాలిపోతున్నాయి. గత మూడేళ్లుగా వేపకు వైరస్ సోకుతున్నట్లు తెలుస్తోంది. కొంతకాలానికి కొన్ని చెట్లు విరిగి చిగురించగా, కొన్ని పూర్తిగా ఎండిపోయాయి. నేడు వేపకు అదే దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంల్లోని పలు గ్రామాల్లో వేపచెట్లు వైరస్ సోకి ఎండి పోతున్నాయి. ఆకులు, కొమ్మలు ఎండిపోవడం, కొన్ని చోట్ల గోధుమ వర్ణంలోకి మారడం కనిపిస్తోంది. ఇలా తెగుళ్లు సోకి మూడు నెలల్లోనే వేప చెట్టు నిర్జీవంగా తయారవుతోంది. ఈ వైరస్ వచ్చాక చెట్టు ఆకులు, చిగుళ్లు, కొమ్మల నుంచి ఎండిపోయినట్టుగా ముదురు ఇటుక రంగులో ఉంటూ కిందకు పాకు తుంది. అందుకే దీన్ని డై బ్యాక్ డిసీజ్ అని పిలుస్తారు. ఇది శిలీంధ్రం వల్లే వస్తుంది కానీ, మస్కిటో డీ బగ్ అనే ఒక రకమైన కీటకం కాటు వేసిన చోట, శిలీంధ్రం వ్యాపిస్తుంది. ఇది వర్షాకాలం ప్రారంభంలో పెరుగుతుంది. ఆగస్టులో పెరిగి అక్టోబర్ నవంబ ర్లో బాగా ఎక్కువ అవుతుంది. ఎండలు ప్రారంభం అయ్యాక తగ్గుతుంది. ఒక చెట్టు నుంచి ఇంకో చెట్టుకు ఇది గాలి ద్వారా వ్యాపిస్తుంది. శిలీంధ్ర రేణువులు గాలి ద్వారా వ్యాపిస్తాయి. అలాగే ఒక చెట్టుపై వాలిన కీటకాలు మరో చెట్టుపై వాలినా వస్తుంది. వర్షం నీరు ఒక చెట్టు నుంచి జారి మరో చెట్టపై పడినప్పుడు కూడా వస్తుంది. చెట్టు పెద్దదా చిన్నదా, వయసు ఎంత అనే దాంతో నిమిత్తం లేకుండా వ్యాపిస్తుండడంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా వేప చెట్లు ఎండిపోయి కన్పిస్తున్నాయి. కొన్ని చోట్ల చెట్ల ఆకులు పూర్తిగా పచ్చదనం కోల్పోగా మరి కొన్ని చోట్ల వైరస్ ఇప్పుడిప్పుడే ప్రభావం చూపుతోంది. ఫోమోప్సిస్ అజాలడిక్స్ అనే శిలీంద్రం సోకడంవల్ల వేపకు ప్రమాదం ఏర్పడిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్రధానంగా లొరాంథస్ నే సమస్యతో వేప చెట్టు చిగుళ్ల ఎండిపోతున్నాయి.

మూడు నాలుగు సంవత్సరాల క్రితం ఈ సమస్య వెలుగులోకి వచ్చినప్పుడు జీవవైవిధ్య విభాగం ప్రత్యేక అధ్యయనం చేసింది. బాగా ఎదిగిన వేపచెట్లపై లొరాంథస్ట్ అనే పరాన్న మొక్క ఎదగడమే ఇందుకు కారణమని సైంటిస్టులు గుర్తించారు. భారీగా ఎదిగిన వేప చెట్లను ఆసరా చేసుకుని ఎదిగే ఈ లొరాంథస్ వేప చెట్టులో ఉండే నీటితో పాటు లవణాలు, పోషకాలు తదితరమైన వాటిని పీల్చుకొని అన్ని భాగాలను ఎండిపోయేలా చేస్తుంది. దాంతో చెట్టు కూలిపోతుంది. అంతేకాకుండా లొరాంథస్ వ్యాపించడంతో వేప చెట్టుకు తగిన సూర్యరశ్మి సోకదు. అయితే వేపచెట్లపై ఈ లొరాంథస్ ను గుర్తించిన వెంటనే, చెట్టును మొత్తం కొట్టేయకుండా, సదరు కొమ్మను నరికివేయడం ద్వారా మిగతా శాఖలకు వ్యాపించకుండా కాపాడవచ్చని అప్పట్లో అధికారులు చర్యలు చేపట్టారు. గతేడాది కూడా ఇదే తీరులో ఎండిపోయాయి. అప్పుడు తీసుకున్న చర్యలతో వైరస్ భారి నుంచి బయట పడ్డాయి. ఇటీవల కొద్ది నెలలుగా మళ్లీ వైరస్ భారిన పడి ఎండిపోతున్నాయి.

తాజాగా ఇప్పుడు మళ్లీ ఎండిపోతుండడంతో అసలు వేప చెట్లు ఎందుకు ఇలా ఎండిపోతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగరీకరణలో కాంక్రీట్ నిర్మాణాల వల్ల చెట్టు వేర్లకు అందాల్సిన నీరు, పోషకాలు తగినంత అందడం లేదు. దీని వల్ల కూడా చెట్లు క్రమంగా అంతరిస్తున్నాయి. గృహ నిర్మాణాల సమయాల్లో, విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయని ఒకవైపు చెట్టు కొమ్మలను నరికేయడం వల్ల భారమంతా ఒకేవైపు పడి అవి నేలకూలుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇలా వేప చెట్లు ఎండిపోతుండడంపై తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రోగ నిర్ధారణ విభాగం శాస్త్రవేత్తలు ఏడాది నుంచే పరిశోధనలు చేస్తున్నారు. తెగులు నివారణపై విస్తృతంగా ప్రయ త్నాలు చేస్తున్నారు.

## పారిశ్రామిక భూమి బదలీ విధానంతో స్థిరమైన అభివృద్ధి

### అసెంబ్లీలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 6 :** పారిశ్రామిక భూమి బదలీ విధానం తెలంగాణా ప్రాంతంతో పాటు హైదరాబాద్ నగరంలో స్థిరమైన అభివృద్ధికి దోహద పడుతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన విధానంతో కాలుష్యరహిత గ్లోబల్ సిటీగా హైదరాబాద్ రూపాంతరం చెందుతుందని ఆయన చెప్పారు. మంగళవారం రాష్ట్ర శాసనసభలో ప్రవేశ పెట్టిన పారిశ్రామిక భూమి బదలీ విధానంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా తో పాటు హైదరాబాద్ నగరం స్థిరంగా అభివృద్ధి చెందడానికి ఈ విధానం పునాది రాయి వంటిదని అభివర్ణించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక భూమి బదిలీ విధానం పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్ధరహితమని ఆయన కొట్టిపడేశారు. పారిశ్రామిక భూమి బదిలీ విధానంపై బి.ఆర్.ఎస్.,బిజెపి లు తమ తమ వైఖరిని స్పష్టం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాలుష్యాన్ని వేద జల్లుతున్న పరిశ్రమలను ఔటర్ రింగ్ వెలుపలికి తరలించాల వద్దా అన్నది బి.ఆర్.ఎస్.,బి.జె.పి లు తేల్చిచెప్పాలన్నారు. లీజు హక్కులతో ఉన్న భూములకు ఇది వర్తించదని, పూర్తిస్థాయిలో యాజమాన్యా హక్కులు కలిగిన భూములకు మాత్రమే వర్తిస్తుందని ఆయన సుస్పష్టం చేశారు. ఐదు లక్షల కోట్ల విలువైన తొమ్మిది వేల ఏకరాల భూములను దారి మల్లిస్తున్నారన్న ప్రతిపక్షాల విమర్శలు పట్ల ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. హైదరాబాద్ మహా నగరాన్ని నివాస యోగ్యంగా రూపొందించేందుకు మాత్రమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఎవరూ ఆపలేదు

### ఎన్జీటియే ఆపింది: వెదిరె శ్రీరాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 6:** 90శాతం పూర్తయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఎవరూ ఆపలేరని,నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆపిందని జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరాం అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కృష్ణా-గోదావరి నదీ జలాల కేటాయింపులపై వెదిరే శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 2014 నుంచి 2024 వరకు తెలంగాణ లిఫ్ట్ చేసిన నీటి కన్నా ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీటిని తరలించిందని పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకి హైడ్రాలిక్ క్లియరెన్స్ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ లేవన్నారు. ఈ ప్రాజెక్టు డిపిఆర్‌ను, బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపిందన్నారు. సరైన వివరాలు ఇవ్వకపోవడదంతో కేంద్రం తిప్పి పంపిందని, ఇవ్వాల్సిన లీగల్,టెక్నికల్ డేటా ఇస్తే 45 టిఎంసీల నీటి వినియోగానికి అనుమతి ఇస్తుందన్నారు. మిగతా 45 టిఎంసీల కోసం ట్రిబ్యునల్‌లో గట్టిగా వాదిస్తే అనుమతులు వస్తాయన్నారు.

## కార్పొరేషన్‌గా నల్లగొండ మున్సిపాలిటీ?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 6:** నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారింది. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీ,శాసనమండలి మంగళవారం బిల్లును ఆమోదించింది. జల్లా కేంద్రమైన నల్లగొండ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కార్పొరేషన్‌గా మారడం వల్ల పట్టణానికి నిధులు రాక పెరుగుతుందని, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని స్థానికులు హర్షం వ్యక్త చేస్తున్నారు. కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.20 కోట్ల వార్షికాదాయంతో పాటు 2లక్షల జనాభా ఉంటే సరిపోతుంది. అయితే నల్లగొండకు రూ.40 కోట్లకు ఆదాయంతో పాటు 2.5లక్షల జనాభా ఉండటంతో కార్పొరేషన్‌గా మార్చడం సులువు అయింది.



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హారీశ్‌రావు

## ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తా

### మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట అర్బన్, జనవరి 6,ప్రభాతవార్త :** ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఆధ్యాపకుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాలలో 175 మంది విద్యార్థులకు బ్లాంకెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలపై ఆర్థికశాఖ మంత్రితో మాట్లాడి వెంటనే విడుదల అయ్యేలా చూస్తానని తెలిపారు. 2004లో తాను యువజనశాఖ మంత్రిగా, సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ గురుకుల పాఠశాలను సిద్దిపేటకు తీసుకవచ్చానని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రూ.14 కోట్లతో పక్కా భవనం నిర్మించడం జరిగిందన్నారు. తెలంగాణ రాక ముందు ఒకటి రెండు మెడికాల్ కాలేజీలు ఉండేవని తెలంగాణ వచ్చాక 33 జిల్లాలకు 34 కాలేజీలు మంజూరు చేశామన్నారు. 2850 ఉన్న ఎంబిబిఎస్ సీట్లను పదివేల ఎంబిబిఎస్ సీట్లుగా మార్చుకున్నామన్నారు. గురుకులంలో చన్నీళ్లతో స్నానాలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తన సొంత డబ్బులతో వాటర్ హీటర్లు ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ సుడా ఛైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, రాజనర్సు, అల్లం ఎల్లం, సర్పంచ్ నాగుల స్రవంతి ప్రశాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇ.వి. పాలసీతో ఇప్పటివరకు లక్షదాక వాహనాల విక్రయం

### ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేస్తే 20 శాతం సబ్సిడీ

### విద్యుత్ వాహనాలకు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫ్రీ

### శాసనసభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వం ప్రత్యేకంగా జారీ చేసిన జీవో 41 మూలంగా ఇప్పటి వరకు లక్షకిపైగా ఎలక్ట్రిక్(ఈవి) వాహనాలు అమ్ముడుపోయాయని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి వాహనాలను ప్రభుత్వ ఉద్యోగులు కొనుగోలు చేస్తే వారికి 20 శాతం సబ్సిడి ఇవ్వాలని కంపెనీలకి సూచించామన్నారు. మంగళవారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఈవి వాహనాల అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. ఈవి పాలసీ ద్వారా రాబోయే తరానికి మంచి జీవితం ఉండడానికి జీవో 41 ద్వారా ఈవి పాలసీ తీసుకొచ్చామన్నారు. సంవత్సర కాలంలో లక్ష ఈవి వాహనాలు అమ్ముడు పోయాయన్నారు. ఈవి వాహనాలు గతంలో ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిమి కెపాసిటీ ఉండేవని.. ఇప్పుడు 500 కిమీ వచ్చే కెపాసిటీ వచ్చిందని...దానిని మరింత పెంచడానికి రివ్యూస్ జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చార్జింగ్ స్టేషన్‌లను పెంచడానికి, కార్యాలయాలు, గ్రేటర్ కమ్యూనిటీ హాల్‌లు, విద్యాలయాల వద్ద కూడా ఏర్పాటు చేయాలని చర్యలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులు డీలర్లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశామని, ఈవి పాలసీ కోసం ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రభుత్వం నుండి దాదాపు 900 కోట్ల రూపాయలు నష్టం జరిగినప్పటికీ పాలసీ అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈవి వాహనాలు కొంటే 20 శాతం మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. రెడ్కో సంస్థల ద్వారా ఛార్జింగ్ స్టేషన్ లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వాహనాలు, పాఠశాల బస్సులు, ఫార్మా, ఐటీ వాహనాలు 25 శాతం నుంచి 50 శాతం వారి అవసరాలు బట్టి ఈవీ వాహనాలు కొనేలా విధానం తీసుకురాబోతున్నామని మంత్రి సభలో చెప్పారు. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చూస్తే అక్కడ గాలిలో డేంజరస్ బ్యాక్టరీ ఉన్నట్లు తెలుస్తుందన్నారు. హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రాకుండా ఉండడానికి ఈవి పాలసీ ద్వారా ఈవి వాహనాలు, సిఎన్‌జి, ఎల్‌పిజి వాహనాల వినియోగం పెంచుతున్నామన్నారు. తెలంగాణ లో 9 వేలకు పైగా బస్సులు ఉన్నాయి. పిఎం-ఈ డ్రైవ్ కింద తెలంగాణలో 500 బస్సులు తిరుగుతున్నాయన్నారు. .హైదరాబాద్‌కి పీఎం-ఈ డ్రైవ్ కింద 2800 బస్సులు దశల వారీగా వస్తున్నాయన్నారు. వరంగల్ మున్సిపాలిటీ 100, నిజామాబాద్ మున్సిపాలిటీ 50 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయన్నారు. ప్రభుత్వ వాహనాల్లో కూడా 20 నుండి 30 శాతం ఈవి వాహనాలు వాడేలా కార్యాచరణ తీసుకుంటుందన్నారు. 15 సంవత్సరాల పైబడిన వాహనాలకి స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని, గతంలో స్క్రాప్ పాలసీ లేదన్నారు. ఆర్‌టిసిలో డీజిల్ బస్సుల స్థానంలో రెట్టిరోఫిట్ చేసి ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామన్నారు. ఆటోలు కూడా డీజిల్ వాహనాలు కనిపించకుండా రెట్టిరోఫిట్‌కి అవకాశం ఇచ్చామన్నారు. ఎల్‌పిజి, సిఎన్‌జి, ఈవి ఆటోలు, రేటిరోఫిట్ ఆటోలకు అనుమతి ఇచ్చామన్నారు. గేటెడ్ కమ్యూనిటీలో ఛార్జింగ్ స్టేషన్‌లు, ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో చార్జింగ్ స్టేషన్ లు, రెడ్కో ద్వారా చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే అన్ని కలెక్టరేట్లు, రెస్టారెంట్లు, టూరిజం స్పాట్లలో చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి వాహనాల వినియోగం దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. ఆర్‌టిసిలో అనేక పెండింగ్ సమస్యలు పరిష్కరించాం..గత ప్రభుత్వం చేసిన విలీన అంశానికి సంబంధించి ఒకటి.. కార్మిక సంఘాల రద్దుపై పాలసీపై త్వరలోనే మార్గదర్శకత్వం వస్తుందన్నారు. ఆర్‌టిసిలో యూనియన్ బ్యాంక్‌తో కలిసి ఉద్యోగులు ఎవరైనా చనిపోతే కోటి రూపాయలు నష్టపరిహారం ఇచ్చే విధంగా కొనసాగిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఒక్క కొత్త బస్సు కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తమ ప్రజా ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేస్తుందని, ఉద్యోగాలు ఇస్తుంది సంస్థ అప్పుల సంఖ్యను పూర్తిగా తగ్గించిందన్నారు.

# స్మార్ట్ వ్యవసాయంతో రైతు ఆదాయం పెంపు

## - ప్రతి నీటి చుక్కను ఆదాయంగా మారుస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం సాంకేతికత, ఖచ్చితత్వం, స్థిరమైన అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం విజయవాడ సమగ్ర జలవనరుల నిర్వాహణ, రైతు శిక్షణ కేంద్రంలోని ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సూక్ష్మనీటి సాగులో ఆటోమేషన్‌ను మంత్రి ప్రారంభించారు. దేశానికే మార్గదర్శకమైన మైక్రో ఇరిగేషన్‌ను మరింత బలోపేతం చేస్తూ, "పర్ డ్రాప్ మోర్ క్రాప్" నుంచి "పర్ డ్రాప్ మోర్ రిటర్న్స్" దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఇకపై నీరు, ఎరువుల వినియోగం ఈ ఫోన్‌పైనే కాకుండా సెన్సర్లు, డేటా, ఆటోమేషన్ ఆధారంగా జరగడంతో 20–30 శాతం నీటి ఆదా, కార్మిక వ్యయాల తగ్గింపు, దిగుబడి, నాణ్యత పెరుగుదల సాధ్యమవుతాయని చెప్పారు. ఉద్యాన, తోట, షేడ్ నెట్, గ్రీన్ హౌస్ మరియు అధిక విలువైన పంటలకు ఈ పథకం అత్యంత ఉపయోగకరమని వివరించారు. పిఎంకెఎస్‌వై కింద హెక్టారుకు రూ. 40,000 వరకు ఖర్చుతో రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతోందని తెలిపారు. చిన్న, సన్నకారు మరియు ఎస్సీ/ఎస్టీ రైతులకు 55శాతం, ఇతర రైతులకు 45శాతం సబ్సిడీ అందిస్తూ, ఇప్పటికే ఉన్న డ్రిప్‌లలోనూ ఆటోమేషన్ అమర్చుకునే వీలుందని చెప్పారు. ఎంపానెల్ చేసిన కంపెనీల ద్వారానే పారదర్శక అమలు, స్థిర ధరలు, అధికారి తనిఖీ అనంతరమే చెల్లింపులు, ప్రతి భాగాన్ని జియోట్యాగింగ్ ముద్ర తప్పనిసరిగా ఉంటుందని పేర్కొన్నారు. వారంటీ, సర్వీస్ సపోర్ట్, త్వరితగతిన ఫిర్యాదు పరిష్కారం కల్పిస్తూ రైతును ఎప్పుడూ భరోసాగా నిలబెడతామని స్పష్టం చేశారు. నీటి, విద్యుత్, ఎరువుల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి, రైతు ఆదాయం స్థిరపడేలా ఆటోమేషన్ ఆధారిత మైక్రో ఇరిగేషన్ వ్యవసాయ సంస్కరణగా నిలుస్తుందని స్మార్ట్ వ్యవసాయంతో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలబెడతామని మంత్రి అచ్చెన్నాయుడు గారు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం

**బొండపల్లి (విజయనగరంజిల్లా), జనవరి 6 ప్రభాతవార్త:** జిల్లాలోని రైస్ మిల్లర్లపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన బొండపల్లిలోని లక్ష్మీనారాయణ మోడరన్ రైస్ మిల్లును సందర్శించారు. అనంతరం మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యాన్ని మర పట్టి ప్రభుత్వానికి అప్పగించడంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని మిల్లర్లపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. సీఎంఆర్ విషయంలో ఎందుకు వెనకబడ్డారని నిలదీశారు. ఇప్పటికి కేవలం 17 శాతం మాత్రమే పూర్తి చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకు గ్యారంటీల విషయంలో కూడా జిల్లాలోని మిల్లర్లకు వెసులుబాటు ఇచ్చామని, అయినప్పటికీ మిల్లింగ్ విషయంలో పెద్దగా శ్రద్ధ చూపడం లేదని అన్నారు. రోజుకి 150 ఏసికేల చొప్పున మిల్లింగ్ చేయాలని, ఈ నెల 8వ తేదీలోగా 45,000 మెట్రిక్ టన్నులు పూర్తి చేయాలని మిల్లర్లను మంత్రి ఆదేశించారు. గోదాముల నిల్వ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని, ఎఫ్సీఐ అంశాన్ని కూడా పరిష్కరించామని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్యూ ఆర్ కోడ్ ప్రవేశపెట్టి దేశంలోనే మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. మంత్రి మనోహర్‌తో బాటు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండి ఎస్.డిల్లీరావు, జిల్లా కలెక్టర్


ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జెసి సేదు మాధవన్, ఇతర అధికారులు, కూటమి నాయకులు, మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

**వీరపునాయునిపల్లె జనవరి6, ప్రభాత వార్త:** వీరపునాయుని పల్లెలోని డిగ్రీ కళాశాల నందు ఉల్లి రైతుల నష్టపరిహార చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్చార్జి మంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి అయినటువంటి సవితమ్మ గారు హాజరయ్యారు అదేవిధంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ గారు హాజరయ్యారు కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి గారు హాజరయ్యారు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉల్లి రైతులు తీవ్రమైన నష్టం రావడంతో ప్రభుత్వము ఎకరాకు 20000 చొప్పున నష్టపరిహారాన్ని అందించిందని ఆయన తెలిపారు పక్కనే సర్వరాయ సాగర్ ప్రాజెక్ట ఉన్నప్పటికీ రైతులకు సాగు నీరు అందించేందుకు పంట కాలువల లేవని ఈ విషయమై ముఖ్య మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే పంట కాలువలను త్రవ్వించి సాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి మాట్లాడుతూ ఉల్లి రైతులు పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోవడం తన దృష్టికి వచ్చిన వెంటనే ఇన్చార్జి మంత్రి మరియు కలెక్టర్ గారి దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రి గారితో మాట్లాడి కర్నూలు రైతులతో పాటు కడప రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని తెలపడంతో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు నష్టపరిహారం పంపిణీ చేశారని ఆయన తెలిపారు అదేవిధంగా గత ఐదు సంవత్సరాలలో అభివృదిచేసి చూపించామని ఆయన తెలిపారు త్వరలోనే సర్వరాయ సాగర్ నుంచి సాగునీరు అందిస్తామని ఆయన తెలిపారు టిడిపి జిల్లా అధ్యక్షుడు భూపేష్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు జిల్లాలో ఉల్లి రైతులకు నష్టపరిహారాన్ని అందించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ గారు మాట్లాడుతూ ఉల్లి రైతులకు సరైన ధర లేక తీవ్రంగా నష్టపోయారని తన దృష్టికి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి గారు దృష్టికి తీసుకువెళ్లి జిల్లా రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరినట్లు ఆయన తెలిపారు అదేవిధంగా రైతులు కూడా పంట పండించడం మేకాదు దానిని సరైన మార్కెట్ ధరకు అమ్ముకునే విధంగా ప్రణాళికలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన తెలిపారు అదే విధంగా మార్కెట్లో ఏ పంట కైతే గిట్టుబాటు ధర ఉంటుందో అలాంటి పంటలనే వేసుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్రంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఎవరి ప్రమేయమున్నా జగన్‌తో సహా వదిలిపెట్టబోమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి కడప జిల్లా ఇన్చార్జి మంత్రిసవిత,

# శివయ్యపండుగను భక్తులు మెచ్చేరీతిలో నిర్వహించాలి!



**శ్రీకాళహస్తి,జనవరి 6 ప్రభాతవార్త:** వచ్చేనెల 10 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు,శివయ్య పండగను భక్తులు మెచ్చేరీతిలో చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం మంత్రి ఆకస్మికంగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వచ్చేనెల ప్రారంభమయ్యే శివయ్య పండగ ఏర్పాట్లను గురించి అధికారులతో సమీక్షించారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ఇఇ శ్రీనివాసుల ఎరెడ్డితో చర్చించారు. శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలంటే ఎనలేని ప్రాధాన్యత అని వివరించారు. ఈ పండగ రోజు లక్షలాది మంది భక్తులు శ్రీకాళహస్తిలోని ఆలయంలో వెలసిన స్వయం భువు వాయులింగేశ్వరుని దర్శనానికి తరలి వస్తారని వివరించారు. గత ఏడాది ప్రణాళిక బద్ధంగా శివరాత్రి నిర్వహించారని రాష్ట్రం ప్రశంసలందుకున్నారని అన్నారు. అలాగే ఈ ఏడాది కూడా అలాగే భక్తులు మెచ్చేరీతిలో చేపట్టాలన్నారు. వచ్చిన ప్రతి భక్తుడు సంతృప్తికరంగా తిరిగి వెళ్లేటట్లు ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. గత ఏడాది లక్ష మందికి పైగా దర్శించుకున్నారని ఈ ఏడాది ఇంకా అధికంగా వస్తారని అందుకు తగ్గట్లు ఏర్పాటు చేయాలన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు సుదర్శనం ఏర్పాట్లను గురించి మంత్రి ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఇక్కడకు ఆ రోజు అతిథుల తాకిడి అధికంగా ఉంటుందని సామాన్యభక్తులకు, అతిదులకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆనంరామ్‌నారాయణరెడ్డి సూచించారు. ఎవ్వరూ దర్శనాలకు సంబంధించి అసంతృప్తి చెందకుండా చూడాలన్నారు. ఇక ఉచిత ప్రసాదాల పంపిణీ, నిత్యాన్నదాన పథకంలో వచ్చిన వారికి ఎలాంటి లోటు లేకుండా భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. వివాదాలు, విమర్శలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆనంరామనారాయణ రెడ్డి సూచించారు. వచ్చిన భక్తులు త్వరగా బయటకు వెళ్లేవిధంగా ఏర్పాట్లు ఉండాలని మంత్రి పదే పదే సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధర్మానికి వచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాబోవు శివరాత్రికి ఆలయంలోపల దర్శనాలకు సంబంధించిన ఏర్పాట్లు క్యూలైన్లను పరిశీలించారు. స్వామి గర్భగుడి, అమ్మవారి గర్భాలయానికి వెళ్ళు దారులను పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించి వివరంగా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి మంత్రికి వివరించారు. మంత్రితో పాటు ఆలయ చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు. దర్శనానంతరం వారికి వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## శివయ్య సేవలో మారిషస్ ప్రధాని దంపతులు

**శ్రీకాళహస్తి,జనవరి 6 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంలో స్వయంభువుగా వవెలసిన వాయులింగేశ్వరుని సేవలో మంగళవారం మారిషస్ ప్రధాని ధరంభీర్ గోకుల్ దంపతులు పూజలు జరిపించుకున్నారు. వారి రాక సందర్భంగా మూడు రోజుల నుంచి ఏర్పాట్లును జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్, ఎస్పి సుబ్బరాయుడు వారి వారి సిబ్బందితో ఏర్పాట్లును సమీక్షించారు. మంగళవారం ఉదయం వస్తారని హంగామా చేసారు.కానీ ఆయన పర్యటనలో కొంత మార్పు జరిగింది.వారు సాయంత్రం వచ్చారు. వారి పర్యటన సందర్భంగా సాధారణ భక్తులకు ఎ లాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి పర్యవేక్షించారు.సాయంత్రం వారు రాగా స్వామి అమ్మవార్ల అంతరాలయ ధర్శనం ఏర్పాటు చేసారు. కొంత సేపు భక్తుల దర్శనాలకుబ్రేక్ కల్పించారు. పోలీసులు సన్నిధి వీధిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా బందోబస్తును స్థానిక డిఐయస్‌పి నరసింహామూర్తి, సిఐ ప్రకాష్‌కుమార్ వారి సిబ్బంది పర్యవేక్షించారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న మారిషస్ ప్రధాని దంపతులకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంటకసుధీర్‌రెడ్డి దంపతులు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లును ఇఓ బాపిరెడ్డి పర్యవేక్షించగా స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, రాఘవయ్య,గోపినాథ్,ఐతా మురళి తదితరులున్నారు.


మారిషస్ ప్రధానికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించిన ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

## అపూర్వ అనుభూతికి నిలయం

### - విజయవాడ పుస్తక ప్రదర్శన

**విజయవాడ,జనవరి6,ప్రభాతవార్తప్రతినిధి:** "ఒంటరి తనాన్ని అధిగమింపచేసే అక్షర వైద్యణీ పుస్తకం,ఆమె తోడుంటే బతుకు బాట నల్లేరుపై బండినడకే(ఘ.వి.కు)" అన్న అపూర్వ అనభూతిని కలిగిస్తోంది విజయవాడ పుస్తక మహోత్సవనం. అనుదినం ఎందరో విజయవాడ బుక్‌ఫేర్‌ను సందర్శించి నచ్చిన పుస్తకాన్ని కొనుగోలు చేసి కొత్త అనుభూతిని పొందుతున్నారు. వేలాదిగా వస్తున్న పుస్తక ప్రియులతో ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానానికి కొత్త కళ వచ్చింది. గ్రంథాలయ శాఖతోపాటు ఈగల్ బృందం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్ల సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.విజయవాడ 36వ పుస్తక మహోత్సవానికి భారీగా తరలివస్తున్న పుస్తక ప్రియులు, స్టాళ్లను పరిశీలించి, అభిరుచులకు తగ్గట్లు కొత్త పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. 240కి పైగా స్టాళ్లలో లక్షలాది పుస్తకాలు అందుబాటులో ఉంచారు. నవలలు, జీవిత చరిత్రలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, విప్లవ సాహిత్య పుస్తకాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానికులే కాకుండా పక్క జిల్లాల ప్రజలూ తరలివస్తున్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు అకడమిక్ పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. యువత రోజులో కొద్దిసేపు పుస్తకాన్ని చదవడానికి కేటాయించాలని పాఠకులు సూచిస్తున్నారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, వడ్లమూడి విమలాదేవి, ప్రతిభా వేదికకు ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లను ఈ ఏడాది పెట్టారు. ఈ నెల 12వ తేదీ వరకూ బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. ఈనెల 12వ తేదీ వరకు జరగనున్న ఈ పుస్తక మహోత్సవంలో మొత్తం 314 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది.

## ప్రతి అడుగు రైతు సంతోషం కోసమే

### మంత్రి నాదెండ్ల మనోహార్

**బొండపల్లి (విజయనగరం జిల్లా) జనవరి 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో సుమారు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రైతుకు ఎటువంటి కష్టం రాకుండా వెన్నంటే ఉండి ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రతి అడుగు రైతు సంతోషం కోసం, సంక్షేమం కోసమేనని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఆయన బొండపల్లి మండలం రాచకిండాం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నేరుగా రైతుల కల్లాల వద్దకు వెళ్ళి వారితో మమేకమయ్యారు. క్షేత్ర స్థాయిలో ధాన్యం నిల్వలను, నాణ్యతను స్వయంగా పరిశీలించిన ఆయన, కొనుగోలు ప్రక్రియపై రైతులతో సుదీర్ఘంగా చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన రైతుల సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, అన్నదాతల వెన్నంటే ఉంటుందని, వారికి ఎటువంటి కష్టం రానివ్వదని స్పష్టం చేశారు. గతంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ఇప్పుడు ప్రభుత్వం ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తోందని వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుందని ఆయన ప్రకటించారు. ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు. ఈ నెల 10వ తేదీలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేసి, గ్రామాల్లో పండుగ వాతావరణాన్ని కల్పిస్తామని చెప్పారు.

## పాడి రైతులకు మద్దతు ధర

### పాలకోవాతో వ్యాపారాభివృద్ధి

### ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,జనవరి 6 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని కో ఆపరేటివ్ పాలసరఫరా సంఘంలో సభ్యులుగా ఉన్న పాడి రైతులకు మద్దతు ధరను ప్రకటించారు. ఇది చారిత్రాత్మకం అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు.మంగళవారం శివాని కళ్యాణమండపంలో చైర్మెన్ మునగాల మధుసూధననాయుడు అధ్యక్షతన జరిగిన మహాజన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు కోటి రూపాయలకుపైగా పాడి రైతులకు డివెండెండ్లు ఇచ్చామని తెలిపారు. కాగా తిరుమలలో బ్రాంచి ఏర్పాటు చేసి పాడిపరిశ్రమను ఇంకా విస్తృత పరచాలనే ప్రతిపాదన ఉందన్నారు.గతంలో రోజుకు 9వేల లీటర్లు వచ్చేదని ప్రస్తుతం మంచుకాలం కాబట్టి కేవలం ఐదువేల లీటర్లు మాత్రమే వస్తుందన్నారు.దాంతో పట్టణంలో పూర్తి స్థాయిలో వినియోగదారులకు ఇవ్వలేకపోయామని వివరణ ఇచ్చారు.

## విద్యార్థులకు విద్యతో పాటు విలువలు ముఖ్యం

### - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, జనవరి 6 ప్రభాతవార్త** ప్రస్తుత తరుణంలో విద్యార్థులకు విద్యతో పాటు విలువలు కూడా నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పైపాళ్యం ప్రభుత్వ పాఠశాలలో ప్రముఖ సామాజికవేత్త లెనిన్ అధ్వర్యంలో విలువల బడి కార్యక్రమంను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా డా॥ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యావేత్త అయిన లెనిన్ సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో సిఎం సూచనల మేరకు విద్యార్థుల కోసం విలువల బడి శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు మానసిక ఒత్తిడి లేకుండా సులభమైన రీతిలో రోజుకు గంటపాటు పాఠశాలలో విలువలు, చదువు, సంస్కారం వాటిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. బాల్యం నుంచే విద్యార్థులు మంచి జీవితానికి బంగారుబాట వేసేందుకు ఈ విలువల బడి కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. పిల్లల తల్లిదండ్రులు కూడా పిల్లలుబడికి వెళ్లి వస్తే చాలని భావించక వారు చదువుతున్న తీరుపై ఎప్పటికప్పుడు చొరవ చూపాలని సూచించారు. సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చుతున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్,మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ సర్పంచులు సికె మణి, వల్లెప్ప, కడ సభ్యుడు రామచంద్ర, యువనేత సికె విజయ్,కనీసవేతనాల సలహామండలి సభ్యుడు శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, నేతలు విభూషణ్, కనకరాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా బారిన గర్ల్ చైల్డ్స్ పడకూడదన్నదే లక్ష్యం

## - మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ. సూర్యకుమారి

**విజయవాడ,జనవరి 9,ప్రభాతవార్తప్రతినిధి:** సమస్యలు ఉద్భవించిన తరువాత వాటికి పరిష్కారాలు వెతకడం కంటే, అవి తలెత్తకముందే కట్టుదిట్టమైన నివారణ చర్యలను అధికారులు సమర్థవంతంగా అమలు చేస్తే అనుకూల ఫలితాలు ఉంటాయని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ. సూర్యకుమారి తెలిపారు. స్థానిక బందరు రోడ్డు బెంజ్ సర్కిల్ సమీపంలోని జెడ్ సూట్స్ హోటల్ లో మంగళవారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయిలో బాలికల సంరక్షణ. మానవ అక్రమ రవాణా నిరోధం పై శిక్షకులకు శిక్షణ అనే అంశం మీద శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఏ. సూర్య కుమారి హాజరై మాట్లాడుతూ.. బాలల రక్షణ, మహిళా సాధికారత కోసం మహిళలు, గర్ల్ చైల్డ్స్ కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ పథకాల సమన్వయానికి ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ను నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. యువకుల కోసం ˜యువ్త, బాలికల కోసం ˜సఖి గ్రూపులను ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది పిల్లలను గ్రూపులుగా చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, రెసిడెన్షియల్ సంస్థలు, బడి బయట పిల్లలతో సహా 100 శాతం కవరేజ్ సాధించడమే లక్ష్యమని చేస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తూ, వారి గౌరవాన్ని మానవ అక్రమ రవాణా దోచుకుంటుందన్నారు. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత తప్పుదారిలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లల భద్రతకు టోల్ ఫ్రీ నంబర్ 112, వన్‌స్టాప్ సెంటర్స్ ద్వారా అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమస్యలు వచ్చిన తర్వాత కాకుండా, ముందస్తు నివారణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, బాలల భద్రత, మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులకు కార్యదర్శి ఏ. సూర్యకుమారి తెలియజేశారు.

## జాబ్ క్యాలెండర్ ప్రకటనలో సర్కార్ విఫలం



**విజయవాడ,జనవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** జాబ్ క్యాలెండర్ ప్రకటించడంలో ఏపీలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీని నెరవేర్చకుండా నిరుద్యోగ యువతను ఘోరంగా వంచిస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఇది జాబ్ క్యాలెండర్ కాదని, యువతను దగా చేసిన ఖిదగా క్యాలెండర్‌ఖి, హామీని అపహాస్యం చేసిన ఖిజోక్ క్యాలెండర్‌ఖి అని ఆమె అభివర్ణించారు. సంవత్సరాలు మారుతున్నా జాబ్ క్యాలెండర్ కు దిక్కులేదంటూ ట్వీట్ చేశారు. ఆమె సోషల్ మీడియాలో స్పందిస్తూ, "గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు జాబ్ క్యాలెండర్ పేరుతో యువత చెవుల్లో పూలు పెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏకంగా క్యాలీఫ్లవర్లు పెడుతోంది" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. 2025 జనవరి 1న ఇస్తామన్న క్యాలెండర్ ఏమైందని, ఇప్పుడు రెండో ఏడాది కూడా దాని ఊసెత్తకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎన్నికల ముందు ఉద్యోగాల పేరుతో ఆశ చూపి, భారీగా ఓట్లు దండుకుని, జీవితాలతో చెలగాటమాడటం ప్రభుత్వానికి తగదన్నారు.

## రైల్వే వన్ యాప్ ద్వారా అన్ రిజర్వు టికెట్ కొనుగోలుపై 3 శాతం డిస్కౌంట్

**విజయవాడ.జనవరి6,ప్రభాతవార్తప్రతినిధి:** రైల్వే వన్ యాప్ ద్వారా అన్ రిజర్వు టికెట్ కొనుగోలుపై 3 శాతం డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదుపాయం ఈ నెల 14 నుంచి జులై 14 వరకు అమల్లో ఉంటుందన్నారు. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ ప్లే స్టోర్, ఐఒఎస్ యాప్ స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉందని తెలిపారు. ఇది అన్ రిజర్వు టికెట్లతోపాటు రైల్వే ప్లాట్ ఫామ్ టికెట్లు రిజర్వు టికెట్లు, లైవ్ ట్రైన్ ట్రాకింగ్, ఫిర్యాదుల పరిష్కారంతోపాటు ఇక్యాటరింగ్ వంటి అన్ని సేవలనూ ఈ యాప్ అనుసంధానిస్తుందన్నారు. ఈ యాప్ నగదు రహిత లావాదేవీలను అనుమతిస్తుందని, ప్రయాణికులు ఆర్ వాలెట్, పేటిఎం, ఫోన్‌పే, గూగూల్‌పే, యుపిఐలు లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి వివిధ డిజిటల్ మార్గాల ద్వారా చెల్లింపులు చేయొచ్చన్నారు.

## తెలుగును కోడింగ్ చేసి విశ్వవ్యాప్తం చేయాలి

### - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ.జనవరి6,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు భాష పరిరక్షణ, అన్ని స్థాయిల్లో అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ప్రపంచ తెలుగు మహాసభ ముగింపు సందర్భంగా జరిగిన సభలో గత రాత్రి బాగాపొద్దుపోయిన తరువాత ఆయన మాట్లాడుతూ తెలుగును విశ్వవ్యాప్తం చేయాలన్నారు. ప్రపంచమంతా తెలుగు భాషపై ఆసక్తి పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతికంగా తెలుగు భాషకు కూడా కోడింగ్ ఉండాలన్నారు. ఇతర భాషలకు కోడింగ్ ఉంటే అన్ని భాషల వారు తెలుగును నేర్చుకుంటారని తెలిపారు. తెలుగును అన్ని భాషల్లోకి కోడింగ్ వచ్చేలా సాఫ్ట్‌వేర్ రూపొందించాలన్నారు. ప్రభుత్వం తెలుగు భాష అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

# సంక్రాంతికి ఆర్టీసి ప్రత్యేక బస్సులు

**విజయవాడ,జనవరి 6,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ సీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రద్దీ దృష్ట్యా రోజూ నడిచే రెగ్యులర్ సర్వీసులకు అదనంగా 8 వేల 432 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. ఈసారి స్త్రీశక్తి పథకం దృష్ట్యా రాష్ట్రంలో పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక బస్సుల ఏర్పాటులో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్టీసీ తెలిపింది. 71 శాతం బస్సులను రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక సర్వీసులుగా నడపాలని నిర్ణయించింది. గ్రామాలు, మండలాలు, పట్టణాల మధ్య రద్దీ గణనీయంగా పెరిగిన దృష్ట్యా వీటి మధ్య 6 వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు 2 వేల 432 ప్రత్యేక బస్సులుగా నడిపేందుకు కేటాయించింది. పండగ ముందు రోజుల్లో మొత్తం 3857 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. వీటిలో హైదరాబాద్ కు 240, బెంగళూరు 102, చెన్నైకు 15 బస్సులు ఏర్పాటు చేయగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 3500 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ తిరుగు ప్రయాణానికి మొత్తం 4 వేల 575 బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ కు 1800, బెంగళూరు 200, చెన్నై 75 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా వీటిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య నడిపేందుకు 2500 బస్సులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ బస్సుల్లోని చార్జీనే వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. దూర ప్రాంతాలకు నడిచే ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు ఆర్టీసీ తెలిపింది. కడప నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసారు.సంక్రాంతికి కడప జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి 40, బెంగళూరు నుంచి 40 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి 30, చెన్నై నుంచి 10 ప్రత్యేక బస్సులు కేటాయించారు. ఈ నెల 9 నుంచి 13 వరకు నడవనున్న బస్సుల్లో సాధారణ ఛార్జీలు వసూలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# వైకల్యం దేహానికే, కళలకు కాదు..



ఉదయపూర్‌లోని గాంధీ ప్రాంగణం... వందలాది కళాకారులు ఘూమర్ నృత్యాన్ని హృద్యంగా నర్తిస్తున్నారు. కానీ అక్కడ అందరి చూపులూ ఇరవయ్యేళ్ల దియా శ్రీమాలి మీద నిలిచి పోయాయి. అంతేనా, వాళ్ల చేతుల్లోని మొబైల్స్ ఆమె నృత్యాన్ని రికార్డు చేశాయి. నిమిషాల్లో ఆ వీడియోలు వైరలై దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకునేలా చేశాయి! 'ఘూమర్ ఘూమర్ ఘూమే...' అంటూ 'పద్మావత్' సినిమాలో దీపిక చేసిన నృత్యం అందరికీ గుర్తే. అన్ని అవయవాలు సరిగ్గా ఉన్నవాళ్లకే ఆ నృత్యం కష్టసాధ్యం. అలాంటిది దియా శ్రీమాలికి పుట్టుకతోనే మోచేతులకింద చేతుల్లేవు. ఆ భాగంలో సన్నని వేళ్లు మాత్రమే ఉంటాయి. కానీ ఇటీవల జరిగిన 'మరుధర ఘూమర్ వేడుకలో ఆమె చేసిన దృశ్యం వీక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. 'ఈ వేడుక గురించి తెలిసి స్నేహితురాలితో అక్కడికి వెళ్లా. అక్కడి లయబద్ధమైన డ్రమ్ముల దరువులు, సంగీతం నన్ను నేను మరచిపోయి, అందులో లీనమై నృత్యం చేశాయి అంటోన్న దియా ప్రతి కదలిక రాజస్థానీ సంప్రదాయానికి అద్దంపట్టింది. ఆమె నృత్యానికి ఫిదా అయిన డెప్యూటీ సీఎం దియా కుమార్ ఆ వీడియోని షేర్ చేస్తూ 'అభిరుచి నృత్యంగా మారినప్పుడు అడుగులు కథ రాస్తాయి' అంటూ క్యాప్షన్ పెట్టారు. దాంతో దియా ఒక్క రాత్రిలోనే సంచలనంగా మారింది.

**తొలి విజయం!** ఎందరినో కట్టిపడేసిన దియా నృత్యం వెనక ఆమె సంకల్పం, కృషి ఎంతో, చేతుల వైకల్యంతో పుట్టిన దియాని కొందరు జాలిగా చూస్తే, మరికొందరు వింతగా చూసేవారట. స్కూల్లో అడ్మిషనూ తేలికగా రాలేదు. మొదట్లో లంచ్‌లో పెట్టే రోటీని ముక్కలుగా తుంచి పెట్టేది వాళ్లమ్మ.. అది అవమానంగా భావించిన చిన్నారి దియా... తనే తుంచుకుని తినడం నేర్చుకుంది. వైకల్యంమీద ఆమె సాధించిన తొలి విజయమది. తరవాత యూట్యూబ్, ఆన్‌లైన్ ట్యుటోరియల్స్ నుంచి స్కెచ్‌లు వేయడమూ నేర్చుకుంది. చేతులు సరిగ్గా లేని ఓ అమ్మాయి వేసిందని ఎవరూ నమ్మలేనంతగా ఆ చిట్టి చేతులు అద్భుతాలే చేశాయి. మోదీ,



దియా

ద్రౌపదీ ముర్ము వంటి ప్రముఖ నాయకుల చిత్రాలనూ చిత్రించింది దియా. వైకల్యం శరీరానికే, కలలకు కాదు. సమాజం మమ్మల్ని చూస్తే దృక్పదం మార్చు కోవాలి. సానుభూతికి బదులు అవకాశాలు కల్పించాలి. వికలాంగ కళాకారుల కోసం ప్రత్యేక ఘూమర్ ఉత్సవం, కళా ప్రదర్శనలకు వేదిక ఏర్పాటుచేయాలి అంటోన్న దియా ప్రయాణం ఎందరికో స్ఫూర్తి దాయకమే కదూ!

## మీకు క్లెన్సర్ పడుతుందా !



చర్మసంరక్షణలో అమ్మాయిలు తప్పకుండా ఉపయోగించే ఉత్పత్తుల్లో క్లెన్సర్. అయితే ఒకే రకమైన క్లెన్సర్లు అన్ని కాలాలకూ సరిపడవు. అందుకే కాలానికి తగినట్లుగా స్కిన్ కేర్ రొటీన్ ను కూడా మార్చు కోవాల్సి ఉంటుంది. ఈ కాలంలో మీరు వాడు తున్న క్లెన్సర్ మీ చర్మతత్వానికి సరిపోతుందా లేదా అని తెలుసుకోవడం ఎలా అంటే... ✦ క్లెన్సర్ వాడిన పది నిమిషాలకు మీ ముఖం బిగుతుగా ఉంది అనిపిస్తే... అది మీ శీతకాలపు స్కిన్ కేర్ రొటీను సెట్ కానట్లేనట.

✦.గడ్డం కింద, ముక్కుకు ఇరువైపుల చర్మం పొలుసు బారుతోందా? క్లెన్సర్ మృదుత్వాన్ని, హైడ్రేషన్ని ఇవ్వడం లేదనే దాని అర్థం. ✦ క్లెన్సర్ పడకపోతే మృతకణాలు తొలగించే ప్రక్రియలో చర్మం పొడిబారుతుంది. కొన్నిసార్లు, దురద, మంట, ఎరుపుగా మారడం వంటివి ఉంటాయి. మాయిశ్చరైజర్ రాసేటప్పుడు మంట కూడా ఎక్కువవుతుందట.

✦ మేకప్ చేసుకునేటప్పుడు అది చర్మం అంతా ఒకే విధంగా ఉండకుండా, అసమానంగా ఒకదగ్గర ఎక్కువ, ఒకదగ్గర తక్కువగా పెచ్చులా కనిపిస్తుందట. చర్మం ముందుకన్నా క్కువగా పొడిబారినట్లు అనిపిస్తుంది. దానితో పదేపదే మాయిశ్చరైజర్ అప్లై చేయవలసి వస్తుంది. అన్నీ గమనించుకుని అవసరమైన వాటిని మార్చుకోండి మరి!

# తిరుప్పావై

### 23వ పాశురము



మారి మలై ముళ్ళల్ మన్నిక్కిడ న్దఉఅంగుమ్
శీరియశింగమఱివిత్తు త్తీ విళిత్తు
వేరిమయిర్ పొంగవెప్పాడుమ్ పేరున్దదఱి,
మూరి నిమిర్న్దు ముళంగి పుఱప్పట్టు
పోదరుమాపోలే నీపూవై పూవ్వణ్ణా, ఉన్
కోయిల్ నిన్ఱింగనే పోందరుళి, కోప్పుడైయ
శీరియ శింగాసనత్తిరున్దు. యామ్వన్ద
కారియ మారాయ్ న్దరుళేలో రెమ్బావామ్

శౌర్యముగల సింహం పర్వతగుహలో నిదురించు చున్నది. అది మేల్కొన్నది. అటు ఇటు చూచింది. పరిమళ ముగల వెంట్రుకలను నిగుడుగా దులుపుకుంది. బాగుగా సాగింది. గర్జించింది. వెలుపలికి రా. శ్రేష్ఠమైన మనోహర మైన సింహాసనముపై కూర్చో. మేము వచ్చిన పనిని తెలు సుకో. మాపై దయచూపు. ఫలం: "అధికారప్రాప్తి"

## అవసరం నేర్పిస్తుంది !



బాబుకి లెక్కలు అర్థం కావడం లేదు. 14 ఏళ్లు వచ్చినా పాప గడియారం చూసి సమయం చెప్పలేక పోతోంది. పిజ్జా, బర్గర్లు అలవాటై ఇంట్లో చేసినవేమీ తినడం లేదు. ఇలా చెప్పుకొంటూ పోవాలె కానీ పిల్లల మీద తల్లులకు ఎన్ని ఫిర్యాదులో. చూడటానికి చిన్నగా కనిపించినా... ఇలాంటవన్నీ నైపుణ్యం లోపాల జాబితాలోకే వస్తాయి. అయితే ఇవి సంపాదించుకోవడానికి ఓ అవసరం. అవకాశం రావాలి. దాన్ని తల్లులే సృష్టించాలి. అవసరమే ఎంత చెప్పినా పాఠాలు నేర్పిస్తుంది అంటున్నారు నిపుణులు. లెక్కలు అర్థం కానప్పుడు రూ.50 ఇచ్చి దుకాణానికి పంపండి. రూ.35 సరకులే తెమ్మనండి. అలానే పాకెట్ మనీ ఇచ్చి లెక్క చెప్పమనండి. అంతా ఓ చోట రాసి, ఇవ్వమనండి. ఇలా అన్నా లెక్కలు నేర్చు కుంటారు. స్మార్ట్ వాచ్లూ, ఫోన్లూ దగ్గరుంటే గడియారం చూసి సమయం చెప్పడం ఎలా వస్తుంది పిల్లలకిన్నీ లేనప్పుడే కదా దీని అవసరం పడేది. వాటిని దూరం చేసి చూడండి. దీన్ని తప్ప కుండా నేర్చు కుంటారు. అలానే బయటి వంటకాలను పూర్తిగా బ్యాన్ చేస్తే... ఇంటివంట తినడం తప్ప వారిదగ్గర పరిష్కారం ఏముంటుంది. ఇలా మంచి అలవాట్లనీ, నైపుణ్యాల్ని నేర్చుకునే మీరు కల్పించాలే తప్ప... ఫిర్యాదులు చేస్తే, వారిని దండిస్తేనో వాళ్లకి ఏదీ నేర్పలేరు. సమస్య ఉంటే దానికి పరిష్కారం కూడా ఉంటుంది. మన ఆలోచ నలకు కాస్త పదును పెడితే... పిల్లలకు మనం నేర్పలేనిది, వాళ్లు నేర్చుకోలేనిదంటూ ఏది ఉండదు. పాటిస్తారుగా మరి!

## పోషకాల వాల్‌నట్స్ చట్నీ



**కావలసినవి:** వాల్నట్స్ కప్పు, పుదీనా పావు కప్పు, ఉప్పు రుచికి తగినంత, కొబ్బరి తురుము 3 చెంచాలు, కొత్తిమీర తరుగు చారెడు, పచ్చిమిర్చి ఆరేడు, పెరుగు 3 టేబుల్ స్పూన్లు, అల్లం అరంగుళం ముక్క, వెల్లుల్లి 4 రెబ్బలు, నూనె 3 చెంచాలు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర అర చెంచా చొప్పున, మిరియాల పొడి పావు చెంచా, ఎండుమిర్చి 1, కరివేపాకు 2 రెబ్బలు

**తయారీ:** కడాయిలో సగం నూనె వేడిచేసి వాల్నట్స్ వేయించి తీయాలి. అందులోనే పుదీనా, పచ్చిమిర్చిలను వేయించాలి. వీటికి కొబ్బరి తురుము, ఉప్పు, పొట్టు తీసిన అల్లం, వెల్లుల్లి, మిరియాల పొడి జతచేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో మిగిలిన నూనె వేసి... ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, మిరియాల పొడి, కరివేపాకు, ఎండుమిర్చిలతో తాలింపు వేయాలి. చల్లారాక.. పెరుగు, కొబ్బరి తురుము కలిపితే సరిపోతుంది.

## ప్రొటీన్ పేస్ట్ !



మన పంటిపైన ఎనామిల్ అనే రక్షణ పొర ఉంటుంది. ఏ కారణంతోనైనా అది ఒక్కసారి పోతే, మళ్లీ రాదు. దానితో దంతాలు రక్షణ కోల్పోయి చల్లటివి తిన్నప్పుడు జివ్వుమనిపించడం పసుపు రంగులోకి మారిపోవడం, బలహీనపడి విరిగిపోవడం, రంధ్రాలు ఏర్పడడం వంటివి జరుగుతాయి. వీటికి పరిష్కారంగా వైద్యులు ఇంతవరకూ పంటిపైన ప్లాస్టిక్ ఎనామిల్‌తో తయారు చేసిన క్యాప్స్ ని వేయడం, సెన్సిటివిటీని తగ్గించడం వంటి వాటి కోసం వైద్యులు సూచించడం చేస్తున్నారు. ఇకపైన వాటిమీద ఆధార పడాల్సి న అవసరం లేకుండా, పంటిపైన సహజసిద్ధంగా ఎనామిల్ పొరను " ఏర్పరిచే కొత్తరకం టూత్‌పేస్ట్‌ని లండన్‌లోని కింగ్స్ కాలేజీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. దీనిని మన జుట్టు, చర్మం, గోర్రెల ఊలలో ఉండే కెరాటిన్ అనే ప్రొటీన్‌తో తయారుచేశారు. ఈ పేస్టో బ్రష్ " చేసినప్పుడు అక్కడని కెరాటిన్ ప్రొటీన్ లాలాజలంలోని క్యాల్షియం, ఫాస్ఫేట్ ఐయాన్లతో కలిసి పంటిపైన బలమైన ఎనామిల్ పొరను ఏర్పరుస్తుంది. దాంతో దంతాలు పాడవకుండా ఉంటాయి. పైగా ఈ టూత్‌పేస్ట్ సహజసిద్ధమైన ప్రొటీన్ నుంచి తయారు చేయడం వలన ఇటు మనకి అటు పర్యావరణానికి మేలుచేస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

### రంగవల్లి



18 చుక్కలు, 6 వరుసలు, ఇటు అటు వదిలి 6 వచ్చే వరకు



- జానకి ఎన్
కె,ఆర్.ఆర్. హిల్స్
హైద్రాబాద్



### ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com
కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు


## 'సరస్వతి' షూటింగ్ పూర్తి

వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్ ప్రేక్షకులలో క్యురియాసిటీ పెంచింది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రంతో తొలిసారిగా దర్శకురాలిగా మారిన వరలక్ష్మి శరత్ కుమార్, తానే ప్రధాన పాత్రలో నటిస్తూ పక్కా ప్లానింగ్, క్లియర్ విజన్‌తో అనుకున్న సమయానికి షూటింగ్‌ను పూర్తిచేశారు. ఫైనల్



అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. 'సరస్వతి' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతోంది. ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. సరస్వతి చిత్ర షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశాం. ఈ ప్రయాణంలో నాకు పూర్తి సహకారం అందించిన ప్రతి ఒక్క ఆర్టిస్ట్‌కు, టెక్నీషియన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్‌ను ప్రారంభించబోతున్నాం. ఈ చిత్రంలో జీవా, ప్రకాష్ రాజ్, నాజర్, ప్రియమణి, రాధిక వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. సంగీత సంచలనం థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, ఎ.ఎం. ఎడ్విన్ సకే కెమెరా మ్యాన్. వెంకట్ ఎడిటర్, సుధీర్ ఆర్ట్ డైరెక్టర్. ప్రవీణ్ డేనియల్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

## శర్వా 'భోగి' షూటింగ్ ప్రారంభం



చార్మింగ్ స్టార్ శర్వా, బ్లాక్ బస్టర్ మేకర్ సంపత్ నంది ప్రతిష్టాత్మక పాన్ఇండియా ప్రాజెక్ట్ భోగి. ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మించారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. 1960 బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న ఈ సినిమా గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ఈ చిత్రం టైటిల్ ఫస్ట్ స్పార్క్ అనే పవర్ ఫుల్ కాన్సెప్ట్ వీడియో అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా కొత్త షూటింగ్ ఈరోజు హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో ప్రారంభమయ్యింది. ఈ కీలక షెడ్యూల్లో టాకీ పార్ట్‌ని చిత్రీకరించనున్నారు. ఈ సినిమాలో శర్వా నెవర్ బిఫోర్ పాత్రలో కనిపించ నున్నారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 1960ల ఉత్తర తెలంగాణవ మహారాష్ట్ర ప్రాంతంలో వింటేజ్ సెట్టింగ్ తో 'భోగి' టెక్నికల్ గా నెక్స్ట్ లెవల్ లో ఉండబోతోంది. ఈ చిత్రానికి స్టార్ కంపోజర్ భీమ్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. డిఓపి కిషోర్ కుమార్, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్. భోగి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.


# తెర



## 'లెనిన్' 'వారెవా వారెవా.' సాంగ్ రిలీజ్.

'లెనిన్' నుంచి 'వారెవా వారెవా.' లిరికల్ సాంగ్ రిలీజ్.. సమ్మర్‌లో విడుదల కానున్న సినిమా ..అఖిల్ అక్కినేని హీరోగా మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తోన్న చిత్రం 'లెనిన్'. ఈ సినిమాను సోమవారం రోజున 'వారెవా వారెవా.' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేవారు. ఈ పాటకు అభిమానులు, మ్యూజిక్ లవర్స్ నుంచి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ పాటను అనంత శ్రీరామ్ రాయగా.. శ్వేతా మోహన్, జుబిన్ నౌటియాల్ తమ వాయిస్‌తో పాటకు ఓ ఎమోషనల్ ఫీల్‌ను తీసుకొచ్చారు. మ్యూజికల్ సెన్సేషనల్ ఎస్.ఎస్.తమన్ సంగీతం సారథ్యం వహిస్తోన్న ఈ చిత్రంలోని ఈ పాట రొమాంటిక్ ఫీల్‌ను కలిగిస్తోంది. సినిమాలోని భావోద్వేగాలను చక్కగా ప్రతిబింబిస్తూ, హీరో-హీరోయిన్ మధ్య కెమిస్ట్రీని హైలైట్ చేసేలా పాట ఉంది. దీంతో ఈ సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి.

## దక్షిణ కాళీ ప్రీ రిలీజ్ ఈవెంట్



విలన్‌గా అఫ్సర్ ఆజాద్ రోరింగ్ ఫెర్ఫార్మెన్‌తో రాబోతున్న దక్షిణ కాళి సుబ్బు, ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'దక్షిణ కాళీ'. హీరోయిన్ అర్చన అమ్మవారి పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రానికి కథను అందించి శ్రీనిధి క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు సత్యవాణి మీసాల. డివోషనల్ కథతో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తోట కృష్ణ. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా మూవీ టీమ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ అమ్మవారి మహిమలు తెలిపేలా దక్షిణ కాళీ చిత్రాన్ని రూపొందించాం. మా సినిమా బాగుందని మేము చెప్పడం కాదు డిస్ట్రిబ్యూటర్స్ చెప్పాలి. అందుకే డిస్ట్రిబ్యూటర్స్ కు మా మూవీ షోస్ వేస్తున్నాం. నిర్మాత సత్యవాణి మీసాల మాట్లాడుతూ అమ్మవారి భక్తురాలిని నేను. ఆమే నాతో ఈ సినిమా నిర్మింప జేసిందని నమ్ము తున్నా. ఈ మూవీకి ప్రతి ఒక్కటీ అనుకు న్నట్లుగా కుదిరాయి. అవన్నీ అమ్మవారి దయ వల్లే జరిగాయని నమ్ముతాను.

## మార్క్ సినిమా ఆనందాన్ని ఇచ్చింది:

### దీప్శిఖ చంద్రన్



**మార్క్ సినిమాలో మీ నటనకు సూపర్ రెస్పాన్స్ వస్తోంది. కెరీర్ ఆరంభం లోనే మాస్ హీరోయిన్‌గా గుర్తింపు రావడం ఎలా అనిపిస్తోంది ?**

నిజంగా చాలా గ్రేట్‌ఫుల్‌గా ఫీల్ అవుతున్నాను. మార్క్ నుంచి వచ్చిన రెస్పాన్స్ నాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చింది. మాస్ హీరోయిన్ అనే ట్యాగ్ ప్రెషర్‌గా కాకుండా ఒక ఆశీర్వాదంలా అనిపిస్తోంది.

**కిచ్చా సుదీప్ గారితో సినిమా అంటే పెద్ద అవకాశం. ఆయనతో పని చేయడం ఎలా అనిపించింది?**

అది నిజంగా గౌరవం భావిస్తున్నాను. కిచ్చా సుదీప్ గారితో పని చేయడం ఒక లెర్నింగ్ స్కూల్ లాంటిది. ఆయన డిసిప్లిన్, ఫోకస్, కోఆర్టిస్ట్స్‌కి ఇచ్చే గౌరవం అద్భుతం. సెట్లో ఆయన ప్రెజెన్స్ చాలా మోటివేటింగ్‌గా ఉంటుంది.

**మీరు చెన్నై బ్యాక్‌గ్రౌండ్ అయినా, తమిళ్, కన్నడ, తెలుగు సినిమాల్లో చేస్తున్నారు. భాషల విషయంలో ఇబ్బంది అనిపించలేదా?**

ఆరంభంలో కొంచెం ఛాలెంజ్ అనిపించింది. కానీ భాష అనేది ఒక మీడియం మాత్రమే, ఎమోషన్ యూనివర్సల్. వినడం, నేర్చుకోవడం, ప్రాక్టీస్ చేయడం మీద ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాను. తమిళ్, తెలుగు, కన్నడ - అన్ని ఇండస్ట్రీలు నాకు ఎంతో ఆత్మీయంగా స్వాగతం పలికాయి.


**తెలుగు ప్రమోషన్స్‌లో మీరు తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫ్యూచర్‌లో సెల్ఫ్ డబ్బింగ్ ప్లాన్ ఉందా?**

ఖచ్చితంగా ఉంది. తెలుగు డిక్షన్ మీద యాక్టివ్‌గా వర్క్ చేస్తున్నాను. సెల్ఫ్ డబ్బింగ్ చేస్తే క్యారెక్టర్‌కి మరింత నిజాయితీ వస్తుంది. ఫ్యూచర్ తెలుగు ప్రాజెక్ట్స్‌లో డబ్బింగ్ చేయాలనే లక్ష్యంతో ప్రాక్టీస్ చేస్తున్నాను. మోడలింగ్ నుంచి సినిమాల్లోకి రావడం చిన్నప్పటి కలేనా, లేక బై ఛాన్స్ జరిగిందా? నటన చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉంది. మోడలింగ్ ఒక స్టెప్పింగ్ స్టోన్ మాత్రమే, కానీ ఫైనల్ గోల్ మాత్రం సినిమా. ఇక్కడ నిలబడాలంటే ప్యాషన్, హార్డ్ వర్క్ తప్పనిసరి.

## బి.ఎ. రాజుకు నివాళి



బి.ఎ. రాజు 66వ జయంతి నివాళి ఈ రోజు (జనవరి 7) బి.ఎ. రాజు గారి 66వ జయంతి. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, తెలుగు సినీ పరిశ్రమలో అజాత శత్రువు. దాదాపు 40 ఏళ్ల పాటు జర్నలిస్ట్‌గా, (పీఆర్వో)గా, పబ్లిషర్‌గా మరియు నిర్మాతగా ఆయన అగ్రస్థానంలో నిలిచారు. ఈ పోటీ ప్రపంచంలో కూడా ఆయన అందరితో స్నేహపూర్వకంగా ఉంటూ, 'అజాతశత్రువు'గా పేరు తెచ్చుకున్నారు. అగ్ర హీరోలు, దర్శకుల నుండి కొత్తవారి వరకు అందరినీ సమాన గౌరవంతో, ప్రేమతో చూసేవారు. ఎంతో మంది హీరోలు, హీరోయిన్లకు మార్గనిర్దేశం చేసి వారి కెరీర్ ఎదుగుదలకు తోడ్పడ్డారు. బి.ఎ. రాజు గారి వృత్తిపరమైన ప్రస్థానం అద్భుతమైనది. సూపర్ స్టార్ కృష్ణ గారి సినిమాలకు పబ్లిసిటీ బాధ్యతలు చూస్తూ కెరీర్ ప్రారంభించి, ఏకంగా 1500 సినిమాలకు పైగా పీఆర్వోగా పనిచేసి ఆయా చిత్రాల విజయాల్లో కీలక పాత్ర పోషించారు. జర్నలిజంలో కూడా ఆయన చెరగని ముద్ర వేశారు. పలు దినపత్రికల్లో పనిచేసిన అనంతరం, 1994లో తన సతీమణి బి. జయ గారితో కలిసి 'సూపర్ హిట్' వీక్లీని స్థాపించారు. 27 ఏళ్ల పాటు ఒక్క వారం కూడా ఆపకుండా, తుదిశ్వాస వరకు ఆ పత్రికను నడిపించడం ఆయన అంకితభావానికి నిదర్శనం.



# మలేసియా ఓపెన్‌లో లక్ష్య, ఆయుష్ గెలుపు

**న్యూఢిల్లీ:** మలేషియా ఓపెన్ సూపర్ 1000లో రెండో రౌండ్‌కు చేరుకోవడం ద్వారా భారత ఏస్ లక్ష్య సేన్ కొత్త సంవత్సరాన్ని విజయవంతమైన ఆరంభంతో ప్రారంభించాడు. మంగళవారం కౌలాలంపూర్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 24 ఏళ్ల అతను సింగపూర్‌కు చెందిన జాసన్ టెహ్ జియా హెంగ్‌ను 21-16, 15-21, 21-14 తేడాతో ఓడించి తన అజేయ రికార్డును నిలబెట్టుకున్నాడు. భారత షట్లర్ ఇప్పుడు హెడ్‌టుహెడ్ రికార్డును 4-0కి ఆధిక్యంలో ఉంచాడు. మరోపక్క శెట్టి ఆయుష్ ఈ ఏడాదిని అత్యుత్తమ ఫామ్‌తో ప్రారంభించాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లీ జియాను ఓడించాడు. సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి వచ్చిన హోమ్ ఫేవరెట్, రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో 20 ఏళ్ల ఆయుష్ శెట్టి ఈ సంవత్సరాన్ని అత్యుత్తమ ఫామ్‌తో ప్రారంభించాడు, తాను ఆపిన చోట నుంచే పుంజుకున్నాడు, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లీ జియాను తన సొంత మైదానంలో ఓడించాడు. సుదీర్ఘ విరామం తర్వాత రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో 20 ఏళ్ల ఆయుష్ చేతిలో చిత్తు అయ్యాడు. వరుస గేమ్‌లలో 12-21, 17-21 తేడాతో ఓడిపోయాడు. తొలి గేమ్‌లో లీని ఓడించిన తర్వాత ఆయుష్ రెండవ రౌండ్‌లో మలేషియా చేతిలో తీవ్ర వత్తిడిని ఎదుర్కొన్నాడు. అయితే ఆయుష్ వ్యూహాత్మకంగా స్కోరును 17-17తో సమం చేశాడు. చివరి క్షణాల్లో లీ ఒత్తిడిలో తడబడి అనవసర తప్పిదాలు చేసిన ఆయుష్ విజయం సాధించాడు.



### బ్రిటీష్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో

# సెమీస్‌కు అనహాత్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక బ్రిటిష్ జూనియర్ అండర్19 ఓపెన్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన టాప్ సీడ్ వర్ధమాన టీనేజ్ ప్రతిభ అనాహత్ సింగ్ మహిళల సెమీఫైనల్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో ఈజిప్ట్‌కు చెందిన బార్బ్ సమేహ్ (5/8)ను 11-4, 10-12, 11-9, 11-3 తేడాతో ఓడించింది. అలాగే భారత రెండో సీడ్ ఆర్యవీర్ దివాన్ బాలుర అండర్17లో ఐదు గేమ్‌ల క్వార్టర్ ఫైనల్‌లో ఈజిప్ట్‌కు చెందిన యాసిన్ కౌరిటమ్‌ను 9-11, 11-3, 10-12, 11-9, 12-10 తేడాతో ఓడించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. అంతకుముందు, అనాహత్ చివరి 16లో మలక్ ఎల్ మరాఫీ (ఈజిప్ట్, 9/16)ను 11-3, 11-3, 11-6తో ఓడించింది. మొదటి రౌండ్‌లో బై పొందిన హాంకాంగ్‌కు చెందిన వింగ్ కై గ్లాడిస్ హోను రెండవ రౌండ్‌లో 11-1, 11-3, 11-3తో ఓడించింది. ఢిల్లీ క్రీడాకారిణి 2025లో బ్రేక్‌అవుట్ సాధించింది, ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ టూర్‌లో తన రెండవ సంవత్సరంలోనే కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచ ర్యాంకింగ్ 28ని సాధించింది. ఇటీవల జరిగిన హెచ్‌సిఎల్ స్క్వాష్ ఇండియన్ టూర్ 4 ఫైనల్లో, టాప్ సీడ్, ప్రపంచ 29వ ర్యాంక్ క్రీడాకారిణి ఢిల్లీ టీనేజర్ అనహత్ 11-8, 11-13, 11-13, 11-6, 11-8 తేడాతో మాజీ ప్రపంచ 10వ ర్యాంక్ క్రీడాకారిణి జోష్నా చిన్నప్పను ఓడించింది.



### బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# దూసుకుపోతున్న నిఖత్, మీనాక్షి, లవ్లీనా

**న్యూఢిల్లీ:** ఎలైట్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రపంచ ఛాంపియన్లు, అగ్రశ్రేణి భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, మినాక్షి, ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లినా బోర్గోహైన్‌తో కలిసి తమప్రచారాలను విజయాలతో అద్భుతంగా ప్రారంభించారు. ఈ టోర్నీలో 48-51 కిలోల విభాగంలో పోటీ పడుతున్న తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న నిఖత్, చండీగఢ్‌కు చెందిన నిధిపై 5-0 తేడాతో క్లినికల్ ప్రదర్శన ఇచ్చింది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఈమె బౌట్‌ను ప్రారంభం నుండి ముగింపు వరకు నియంత్రించింది. అలాగే ప్రపంచ ఛాంపియన్ మినాక్షి 45-48 కిలోలవిభాగంలో లక్ష్యయ విజయన్‌ను 5-0 తేడాతో ఓడించింది. ఇందులో ఆమె ప్రతిఘటనను ఎదుర్కోవడానికి ప్రత్యర్థికి తక్కువ అవకాశం ఇచ్చింది. అలాగే 70-75 కిలోల విభాగంలో టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లినా బోర్గోహైన్ కూడా క్రిషా వర్మపై విజయాన్ని సాధించింది. ఇక పురుషుల బౌట్లలో 47-50 కిలోల విభాగంలో, సాగర్ అశుతోష్‌ను 5-0తో ఓడించగా, సుమిత్ 70-75 కిలోల విభాగంలో అర్ష్‌ప్రీత్ సింగ్‌పై కూడా ఇదే ఫలితాన్ని నమోదు చేశాడు. యువ పోటీదారు హితేష్ 65-70 కిలోల విభాగంలో అంకిత్‌పై ఆధిపత్యం చెలాయించాడు.

# యాషెస్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఆధిక్యం

## 134 రన్స్ వెనుకబడిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆఖరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ (163), కెప్టెన్ స్టీవ్ స్మిత్ (129 నాటౌట్) భారీ శతకాలతో చెలరేగారు. దాంతో సిడ్నీ వేదికగా జరుగుతున్న మూడో రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 124 ఓవర్లలో 7 వికెట్లకు 518 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 134 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/108) 3, బెన్ స్టోక్స్(2/87) 2 వికెట్లు, జోష్ టంగ్, జాకోబ్ బెతెల్ తలో వికెట్ తీసారు. ఇక 166/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియాకు ఓవర్‌నైట్ బ్యాటర్ ట్రావిస్ హెడ్, నైట్ వాచ్‌మన్ మైకేల్ నేసర్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్న ట్రావిస్ నేసర్‌తో కలిసి మూడో వికెట్‌కు 72 పరుగులు జోడించాడు. నేసర్‌ను కార్స్ ఔట్ చేయగా, కెరీర్‌లో లాస్ట్ టెస్ట్ ఆడుతున్న ఉస్మాన్ ఖవాజా (17) ఫుల్‌టాస్ బాల్‌కు వెనుదిరిగాడు. డబుల్ సెంచరీ దిశగా సాగిన ట్రావిస్‌హెడ్‌ను బెతెల్‌వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. స్టీవ్ స్మిత్ 166 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఉస్మాన్ ఖవాజా(17), అలెక్స్ క్యారీ(16), కామెరూన్ గ్రీన్(37) విఫలమవ్వగా, బ్యూ వెబ్‌స్టర్ (42)తో కలిసి మరో వికెట్ పడకుండా స్మిత్ మూడో రోజు ఆటను ముగించాడు. ఇక ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 384 పరుగులకు ఆలౌటైంది. జోరూట్ (160) భారీ శతకంతో చెలరేగగా, హ్యారీ బ్రూక్ (84) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైకేల్ నేజర్(4/60) 4, మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ తలో 2, కామెరూన్ గ్రీన్, మార్నస్ లబుషేన్ చెరో వికెట్ తీసారు.





# క్రికెట్‌లో సిక్సర్ హిట్లర్లు

## అగ్రస్థానంలో బ్రెవిస్

### రెండో స్థానంలో అభిషేక్ శర్మ






**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రపంచంలో సిక్సర్లకి ఉండే క్రేజే వేరు. స్టేడియం బయట బంతి పడుతుంటే వచ్చే ఆ మజాయే వేరు. 2025 ఏడాది క్రికెట్ చరిత్రలో పవర్ హిట్టింగ్‌కు కొత్త అర్థాన్ని ఇచ్చింది. బ్యాటర్లు బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడ్డారు. ముఖ్యంగా టీ20 ఫార్మాట్ పుణ్యమా అని టెస్టుల్లో సైతం సిక్సర్ల వర్షం కురిసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన టాప్ బ్యాటర్ల జాబితాలో టీమిండియా యంగ్ గన్ అభిషేక్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. అంతకు ముందు ఏడాది (2024) యశస్వి జైస్వాల్ వంటి వారు సిక్సర్లతో హోరెత్తించగా, ఈ ఏడాది యువ రక్తం తమ సత్తా చాటింది. ముఖ్యంగా బేబీ ఏబీగా పిలవబడే దక్షిణాఫ్రికా సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గత సంవత్సరంలో టాప్ 5 సిక్సర్ హిట్టర్లలోఅగ్రస్థానంలో డెవాల్డ్ బ్రెవిస్ (దక్షిణాఫ్రికా) ఉన్నాడు. దక్షిణాఫ్రికా యువ కెరటం బ్రెవిస్ 2025లో సిక్సర్ల సునామీ సృష్టించాడు. కేవలం 32 ఇన్నింగ్స్‌ల్లోనే అతను 65 సిక్సర్లు బాదాడు. ఇందులో టీ20ల్లో 39, వన్డేల్లో 20, టెస్టుల్లో 6 సిక్సర్లు ఉన్నాయి. అతని అగ్రెసివ్ బ్యాటింగ్ శైలి అతన్ని ఈ ఏడాది నంబర్ 1 సిక్సర్ కింగ్‌గా నిలబెట్టింది. ఇక రెండో స్థానంలో అభిషేక్ శర్మ (భారత్) ఉన్నాడు. భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తన టీ20 కెరీర్‌ను అద్భుతంగా మలుచుకున్నాడు. కేవలం 21 ఇన్నింగ్స్‌ల్లోనే 54 సిక్సర్లు బాదడం విశేషం. అతి తక్కువ ఇన్నింగ్స్‌ల్లోనే ఎక్కువ సిక్సర్లు కొట్టిన రేషియోలో అభిషేక్ అందరికంటే ముందున్నాడు. ముఖ్యంగా ఆసియా కప్‌లో ఇతని హిట్టింగ్ హైలైట్‌గా నిలిచింది ఇక మూడో స్థానంలో వెస్టిండీస్ వైట్ బాల్ కెప్టెన్ షై హోప్ ఉన్నాడు. ఒకప్పుడు యాంకర్ రోల్ పోషించే హోప్, 2025లో పవర్ హిట్టర్‌గా అవతరించాడు. 50 ఇన్నింగ్స్‌ల్లో 54 సిక్సర్లతో అభిషేక్‌తో సమానంగా రెండో స్థానంలో నిలిచాడు. ఇక అసోసియేట్ దేశాల రికార్డు చూస్తే ఐసీసీ ఫుల్ మెంబర్ దేశాల జాబితా పైన ఉన్నప్పటికీ, ఆస్ట్రియాకు చెందిన కరణ్‌బీర్ సింగ్ టీ20ల్లో ఏకంగా 122 సిక్సర్లు బాది సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. చిన్న దేశాల మధ్య జరిగిన మ్యాచ్‌లలో ఇతని విధ్వంసం అనూహ్యంగా సాగింది. భారత ఆటగాళ్లకు సంబంధించి అభిషేక్ శర్మ తర్వాత రిషభ్ పంత్ కూడా టెస్టులు, టీ20ల్లో కలిపి గణనీయమైన సిక్సర్లు బాది టాప్ 10 జాబితాలో నిలిచాడు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ నవంబర్ 2025లో అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా (352) షాహిద్ అఫ్రిది రికార్డును బద్దలు కొట్టి యూనివర్స్ బాస్ సరసన చేరాడు.



# డాలర్ వర్సెస్ రూపాయి 90.18

**ముంబయి, జనవరి 6:** డాలరుతోరూపాయి మారకం విలువలు కొంత పటిష్టం అయ్యాయి. నష్టాలనునంచి రికవరీ అయిన రూపాయి 12 పైసలు బలపడింది. మంగళవారం కరెన్సీ ట్రేడింగ్‌ముగిసేనాటికి డాలరుతో రూపాయి మారకం విలువలు 90.18గా నిలిచాయి. విదేశీ కరెన్సీ ట్రేడర్ల కథకం ప్రకారంచూస్తే దేశీయంగా ఈక్విటీ మార్కెట్లు బలహీనపడటం, భౌగోళిక ఉద్రిక్తతలు, అమెరికా, వెనిజులా సంఘటనలు రూపాయి బలపడేందుకు దోహదంచేసాయంటున్నారు. ఇంటర్‌బ్యాంకు విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్‌లో డాలరుతోరూపాయి మారకం 90.22 వద్దప్రారంభం అయింది. తదనంతరం క్రమేపీ 90.08నుంచి 90.25వద్ద ఊగిసలాడి చివరకు 90.18 వద్దట్రేడింగ్ ముగిసింది. ముందురోజు ముగింపుకంటే 12 పైలు బలపడింది. ముందురోజు రూపాయి చెలామణి డాలరుకు 90.30గా నిలిచింది. ముడిచమురుదరలు పెరగడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణ వంటివి రానున్న కాలంలో రూపాయిపై ఒత్తిడి పెంచవచ్చని మిరాయె అసెట్ షేర్‌ఖాన్ పరిశోధక విశ్లేషకులు అనూజ్‌చౌదరి వ్యాఖ్యానించారు. ఇక బ్రెంట్‌ముడిచమురుపరంగా 0.47శాతం పెరిగి బ్యారెల్‌కు 62.05 డాలర్లుగా ఫ్యూచర్‌ట్రేడింగ్ నమోదుచేసింది. దేశీయంగా ఈక్విటీ మార్కెట్లలో బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 376.28 పాయింట్లు క్షీణించి 85,063.34 వద్ద స్థిరపడితే నిఫ్టీ 71.60 పాయింట్లు క్షీణించి 26,178.70 వద్ద ముగిసింది. సంస్థాగీ ఇన్వెస్టర్లు ఈక్విటీలనుంచి 36.25 కోట్లు ముందురోజు విత్‌డ్రాచేయడం గమనార్హం. హెచ్‌ఎస్‌బిసి ఇండియా సేవలరంగ పిఎంఐ బిజినెస్ సూచీ 59.8 పాయింట్లనుంచి 58 పాయింట్లకు పడిపోయింది. గత ఏడాది జనవరి నుంచి అత్యంత మందగమనంతో సేవలరంగం ఉందని హెచ్‌ఎస్‌బిసి విశ్లేషించింది.



# స్టీల్ కంపెనీలపై సిసిఐ నజర్!

**న్యూఢిల్లీ, జనవరి 6:** మార్కెట్లలో గుత్తాధిపత్య పోటీ నివారణ, నియంత్రణ సంస్థ కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా అతిపెద్ద ఉక్కు తయారీ సంస్థలపై ఫోకస్ పెంచింది. టాటాస్టీల్, జెఎస్‌డబ్ల్యుస్టీల్, ప్రభుత్వరంగంలోని సెయిల్ సంస్థలపై సిసిఐ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో నిఘా పెంచింది. కొన్నేళ్లుగా ఈసంస్థలు ధరలపరంగా గుత్తాధిపత్యంతో వ్యవహరిస్తున్నాయని సిసిఐ అనుమానిస్తోంది. 28 కంపెనీలకు సంబంధించి 56 మంది ఎగ్జిక్యూటివ్‌లదే బాధ్యత అని తేల్చింది. 2015 నుంచి 2023 మధ్యకాలంలో వీరంతా ఏకపక్షంగా ధరలు పెంచడంవల్ల మార్కెట్‌లో ధరలుపెరిగినట్లు తేల్చింది. ఈ కంపెనీల్లో జెఎస్‌డబ్ల్యు స్టీల్ బిలియనీర్ ఎండి సజ్జన్‌జిందాల్, టాటాస్టీల్ సిఇఒ టివి నరేంద్రన్, సెయిల్‌కు చెందిన మరో నలుగురు ఛైర్మన్ల పేర్లుప్రస్తావించింది. బిల్డర్లు ఈనాలుగు కంపెనీలపై అత్యధిక ఫిర్యాదులు రావడంతో దర్యాప్తు షురూచేసింది. 2021లో దర్యాప్తుచేసింది. అనేక మంది ఉక్కు తయారీ దారులు సమిష్టిగా సరఫరాను పరిమితంచేసి దరలను పెంచుతున్నారని వెల్లడించింది. కోయంబత్తూరు కార్పొరేషన్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం ఈ ఫిర్యాదుచేసింది. రోడ్లు, హైవే నిర్మాణంలో కీలకంగా ఉంటే ఈ సంఘం నాణ్యత, ధరలపైనా ఫిర్యాదులుచేసింది. దీనితో సిసిఐ మొత్తం 31 కంపెనీలపై దర్యాప్తును షురూచేసింది. మార్కెట్‌లో 17.5శాతం వాటాతోను, టాటాస్టీల్ 13.3శాతం, సెయిల్ 10శాతం మార్కెట్ వాటాలతో ఉన్నట్లు తేలింది. జెఎస్‌డబ్ల్యు స్టీల్ రాబడులే 14.2బిలియన్ డాలర్లుగా ఉంటే, టాటాస్టీల్ 14.7 బిలియన్ డాలర్లు రాబడులుసాధించింది. ప్రతిఏటా నిబంధనలు ఉల్లంఘించడంతో నికరలాభాలు పదిశాతంచొప్పున పెరుగుతూ వచ్చినట్లు సిసిఐ గుర్తించింది. ఇతరత్రా శ్యామ్ స్టీల్ ఇండస్ట్రీస్, రాష్ట్రీయ ఇస్పత్‌నిగమ్ వంటి సంస్థలపైనా సిసిఐ దర్యాప్తును షురూచేసింది.

# రెండోరోజూ నష్టాల్లోనే సెన్సెక్స్, నిఫ్టీ!



**ముంబయి, జనవరి 6:** దేశీయ ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు రెండోరోజు కూడా నష్టాల్లోనే ముగిసాయి. మార్కెట్లలో క్షీణించిన ధోరణులే కనిపించాయి. అలాగే అమెరికా అధ్యక్షుడి ట్యారిఫ్ హెచ్చరికలు కూడా సెన్సెక్స్,నిఫ్టీలనుప్రభావితంచేసాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లుకూడా ఎక్కువశాతం విత్‌డ్రాలకే ప్రాధాన్యం ఇవ్వడంతో నగదు చెలామణీపై ఒత్తిడిపెరిగింది. వెనిజులా అమెరికా సైనికచర్య కూడా కొంత అనిశ్చితిని పెంచింది. నిఫ్టీ 50 సూచీ 26,200వద్దనే ముగిసింది. ప్రైవేటు బ్యాంకు సూచీలు వెనకడుగు వేసాయి. భిన్నంగా హెల్త్‌కేర్, ఫార్మా కంపెనీల షేర్లు కొనుగోళ్ల ఆసక్తిని పెంచాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 376.28 పాయింట్లు క్షీణించి 85,063.34 వద్ద ముగిస్తే నిఫ్టీ కూడా 71.60 పాయింట్లు క్షీణించి 26,178.70వద్ద ముగించింది. రెండు రోజుల్లోను సెన్సెక్స్ 0.81శాతం, నిఫ్టీ 0.56శాతం చొప్పున క్షీణించాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.24శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.29శాతం చొప్పున పతనం చవిచూసాయి. మార్కెట్లలో 1659 కంపెనీల షేర్లు పెరిగితే 2520 కంపెనీలషేర్లు నష్టాలు చవిచూసాయి. 169 కంపెనీలుమాత్రమే స్థిరంగా కొనసాగాయి. డాలరుతోరూపాయి మారకం విలువలు 90.18వద్దముగిస్తే ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదునాటి సెటిల్‌మెంట్లు రూ.1,38,200వద్ద కొనసాగింది. పదేళ్ల యుఎస్ బాండ్లు 0.26శాతం పెరిగి 4.179శాతంగాకూపన్‌రేటు నడిచింది. బ్రెంట్‌ముడిచమురు మార్చి సెటిల్‌మెంట్‌చూస్తే 13 సెంట్లుపెరిగి 61.89డాలర్లుగా నడిచింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.42శాతం, ట్రెంట్ 8.62శాతం క్షీణించాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.56శ్శాతం, టాటామోటార్స్‌ప్యాసింజర్ వాహనాలు 1.23శాతం, క్షీణిస్తే ఇండస్ ఇండ్ బ్యాంకు 1.70శాతంపెరిగింది. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా 1.66శాతంపెరిగింది. జిఎం బ్రూవరీస్ 4.32శాతం క్షీణించింది. కెఎస్‌హెచ్ ఇంటర్నేషనల్ 3.34శాతం ర్యాలీతీస్తే మోయిల్ 3.59శాతం పైపైకి ఎగబాకింది. దేవ్ ఐటి కంపెనీ 1.78శాతంపెరిగింది. కోర్ టెక్నాలజీస్‌నుంచి కొత్త ఆర్డరు రావడమే కీలకం అని తేలింది.

# ఆటోమొబైల్ సేల్స్‌లో ప్యాసింజర్ వాహనాలదే హవా!




**న్యూఢిల్లీ, జనవరి 6:** ఆటోమొబైల్ రంగం గత ఏడాది కేలండర్‌సంవత్సంలో పటిష్టమైన వృద్ధినమోదు చేసింది. ప్రత్యేకించి చివరి డిసెంబరునెలలో అమ్మకాలు 15శాతం పెరిగి 20,28,821 యూనిట్లుగా ఉన్నట్లు ఆటోమొబైల్ డీలర్ల సంఘాల సమాఖ్య ఫాడా వెల్లడించింది. ప్యాసింజర్ వాహనాలే రిటైల్ వృద్ధికి బీజం వేసాయి. 27శాతంపెరిగి 3,79,671కిచేరాయి. టూవీలర్లు 7.24శాతంపెరిగి .2.02 కోట్లకు చేరితే ప్యాసింజర్ వాహనాలు 9.70శాతంపెరిగి 33.21 లక్షలుగా ఉన్నాయి. వాణిజ్య వాహనాలు 6.71శాతంపెరిగి 7.49లక్షలకు చేరాయి. ట్రాక్టర్లు 11.52శాతం పెరిగి 7.63లక్షలుగా ఉన్నట్లు ఫాడా వివరించింది. అర్బన్ రిటైల్ అమ్మకాలు కూడా 8.20శాతంపెరిగితే గ్రామీణ ప్రాంతాల్లో 7.31శాతంగా ఉన్నాయి. ప్యాసింజర్ వాహనాలపరంగా గ్రామీణ డిమాండ్ వృద్ధికనిపించింది. 8.08శాంనుంచి 12.31శాతం పెరిగినట్లు తేలింది. ఫాడా అధ్యక్షుడు సిఎస్ విగ్నేశ్వర్‌మాట్లాడుతూ జనవరి ఆగస్టు మధ్యకాలంలో కొంత మందగించినా ఆ తర్వాతనుంచి పన్ను ఊరట భారీగా లభించడంతో సేల్స్ పెరిగాయన్నారు. జిఎస్టీ క్రమబద్ధీకరణతోపాటు 350సిసి వరకూ ఉన్న టూవీలర్లు, చిన్నకార్లు, త్రీవీలర్లు, కీలక వాణిజ్య వాహనాలు సేల్స్ గణనీయంగా పెచుకోగలిగినట్లు తెలిపారు. టూవీలర్ రిటైల్ 9.50శాతం పెరిగి 13.16 లక్షలయూనిట్లు ఒక్క డిసెంబరులోనే ఉన్నాయి. వాణిజ్యవాహనాలు కూడా 24.60శాతం వార్షికవృద్ధితో 83,666 యూనిట్లు అమ్మకాలుజరిగాయని ఆయన అన్నారు.

# బ్యాంకుల్లో రిటైల్ రుణాలకే ఎక్కువ ప్రాధాన్యం!

## మూడో వంతు వాటాతో 7శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, జనవరి 6:** బ్యాంకు రుణాల్లో గణనీయంగా వృద్ధి కనిపిస్తోంది. బ్యాంకులన్నింటిలోనూ స్థూల రుణాల వృద్ధి అంటే జీబిసి ఏడుశాతం పెరిగి రూ.1,95,273 బిలియన్‌లకు పెరిగింది. 2026 ఆర్థికసంవత్సరం ఎనిమిదినెలల్లోనే ఏడుశాతం వృద్ధి నమోదయిందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. రిటైల్‌క్రెడిట్ మొత్తం బ్యాంకురుణాల్లో మూడో వంతు వాటాతో ఉంది. ఎంఎస్‌ఎంఇ రుణాలు రెట్టింపు అయ్యాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు ఈ కాలంలో ఎంఎస్‌ఎంఇ రంగానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాయి. స్థిరాస్థి ప్రమాణాలు, రుణబకాయిల్లో తగ్గుదల వంటివాటికి ప్రాధాన్యం ఇచ్చాయి. ఎంఎస్‌ఎంఇ రుణాలు 17.7శాతంనుంచి 32.5శాతానికి పెరిగాయి. అలాగే ఎంఎస్‌ఎంఇ బకాయిలు కూడా 174 బేసిస్‌పాయింట్లు పెరిగాయి. ప్రభుత్వరంగ బ్యాంకులే ఈ రంగానికి ఎక్కువ రుణాలిచ్చాయి. పారిశ్రామిక సంస్థలకు భారీ రుణాలివ్వడానికి బ్యాంకులు వెనకాడుతున్నాయి రికవరీలు రిస్క్ పెరుగుతుండటమే ఇందుకుకారణం. అలాగే ఎన్బీఎఫ్‌సిలయితే తక్కువ వడ్డీకే తమనుంచి రుణాలు పొందుతున్నా రికవరీలు పెరుగుతుండటంతో వాటికే ప్రాధాన్యం పెరిగింది. అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థిరాస్థి ప్రమాణాలు కూడా పెరిగాయి. స్థూల నిరర్థక ఆస్తులు 2.5శాతానికి తగ్గాయి. ఎస్‌బిఐ మ్యూచువల్‌ఫండ్ సంస్థ బ్యాంకు రుణాలవృద్ధి 2027లో 13నుంచి 14శాతానికి పెరుగుతుందని, బ్యాంకు రుణాలు మేనెలలో 9 శాతంనుంచి నవంబరు నాటికి 11.4శాతంపెరిగినట్లువివరించింది. చిన్న రుణాలే ఇపుడు కార్పొరేట్‌రుణాలకు మించి బ్యాంకులు జారీచేస్తున్నట్లు క్రిసిల్ అంచనావేసింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.